www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 112 | ఆదివారం | 12-10-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00




# తెలంగాణ ఐకానిక్‌గా టి స్క్వేర్

రాయదుర్గ సమీపంలో చేపట్టనున్న నిర్మాణ పనులను నవంబర్ నెలాఖరుకు ప్రారంభించాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

ఆపిల్ వంటి అంతర్జాతీయ సంస్థల అవుట్‌లెట్‌లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశం

ఎఐ హబ్ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని సూచన



ప్రజాపక్షం/హైదరాబాద్

'టి స్క్వేర్' నిర్మాణం తెలంగాణ ఐకానిక్‌గా ఉండాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. రాయదుర్గం సమీపంలో చేపట్టనున్న టి స్క్వేర్ నిర్మాణ పనులను నవంబర్ నెలాఖరుకు ప్రారంభించాలని సిఎం దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, టిజిఐఐసి సంయుక్తంగా ఈ రెండు ప్రాజెక్టులు చేపడుతున్నాయి. ఎఐ హబ్, టి స్క్వేర్‌పై సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని శనివారం ఐసిసిసిలో నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, సంజయ్ కుమార్, సిఎం ఓఎస్‌డి వేముల శ్రీనివాసులు, టిజిఐఐసి ఎండి శశాంక, టి ఫైబర్ ఎండి వేణు ప్రసాద్, ఐటి శాఖ డిప్యూటీ సెక్రటరీ తరువాయి 2లో

# 9, 41, 42 జిఒలపైనే స్టే



ఎలక్షన్ నోటిఫికేషన్‌పై ఇవ్వలేదు

రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ఎన్నికలు జరపొచ్చు

హైకోర్టు స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

బిసి రిజర్వేషన్లను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ 9, ఎంపిటిసి, జెడ్‌పిటిసి, గ్రామ పంచాయతీ ఎన్నికలు సంబంధించి పంచాయతీ రాజ్ చట్టం–2018లో రిజర్వేషన్ల శాతాన్ని పెంపు చేస్తూ సెప్టెంబర్ 26న జారీ చేసిన జిఒలు 41, 42లపై మాత్రమే స్టే ఇస్తున్నట్లు హైకోర్టు స్పష్టం చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఎన్నికల నోటిఫికేషన్‌పై స్టే ఇవ్వలేదని చెప్పింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యాక కోర్టుల జోక్యానికి వీల్లేదని, అందుకే ఎన్నికల నోటిఫికేషన్‌లో జోక్యం చేసుకోలేదని వివరించింది. జిఒ9 ప్రకారం బిసి రిజర్వేషన్లు 25 నుంచి 42 శాతానికి పెంపు చేయడం వల్ల మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి పెరిగినందున జిఒలు మూడింటిపైన స్టే విధిస్తున్నట్లు చెప్పింది. ప్రధాన కేసుల్లోని మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని స్పష్టం చేసింది. వికాస్ కిషన్‌రావ్ గవాలీ కేసులో సుప్రీంకోర్టు రిజర్వేషన్లు 50 శాతానికి మించవద్దని నిర్దేశించిందని గుర్తు చేసింది. ఈ మేరకు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు చెప్పింది. అందుకే 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇచ్చిన జీవోపై స్టే విధిస్తున్నామని తెలిపింది. జిఒ వల్ల 50 శాతానికి మించిన 17 శాతం సీట్లను ఓపెన్ కేటగిరీ సీట్లుగా నోటిఫై చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవచ్చని స్పష్టం చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినందున ప్రక్రియలో జోక్యం చేసుకోవద్దన్న వాదనలు తమ ముందుకు వచ్చాయని.. వాదనలు ప్రాథమిక దశలోనే ఉన్నందున సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన రాహుల్ రమేశ్‌వాఘ్ కేసులో సుప్రీంకోర్టు తరువాయి 2లో

# జిఒ 9 అమలుకోసం సుప్రీం కోర్టుకు

బిసి రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

సీనియర్ కౌన్సిల్‌తో వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన

సోమవారం అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిసి రిజర్వేషన్ల అంశంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఇచ్చిన జిఒ నెంబర్ 9 అమలు కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించింది. తాజాగా హైకోర్టు ఉత్తర్వుల కాపీ విడుదల కాగా దానిని అధ్యయనం చేసిన అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం ప్రకటించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల జీఓను నిలిపివేస్తూ హైకోర్టు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని, హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేసి ఎన్నికల నిర్వహణకు అనుమతి కోరాలని, ఈ మేరకు సీనియర్ కౌన్సిల్‌తో వాదనలు వినిపించాలని తరువాయి 2లో

# 16న కేబినేట్

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 16వ తేదీన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరగనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు, బిసి రిజర్వేషన్ల అంశంపై ప్రధానంగా చర్చించే అవకాశముంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత ఏర్పడిన నేపథ్యంలో మంత్రివర్గ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది.



# కృష్ణా జలాలను వదులుకోం

- అందుకు సర్కారు సిద్ధంగా లేదు
- కాళేశ్వరం జలాలు లేకున్నా పంటలు పండాయ్
- ట్రిబ్యునల్‌లో మన వాదనలు గట్టిగా వినిపిస్తాం
- హరీష్‌రావు తప్పుడు ఆరోపణలు మానుకోవాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం / హనుమకొండ

కృష్ణా నదీ జలాలను వదులుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేదని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రెడ్డి అన్నారు. ఇటీవల నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి చనిపోగా ఆయనను పరామర్శించేందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి హన్మకొండకు వచ్చారు. అనంతరం మంత్రి సీతక్కతో కలిసి మీడియాతో మాట్లాడారు. కృష్ణా నదిలో నికర జలాలైనా, మిగులు జలాలైనా, వరద జలాలైనా సరే.. తెలంగాణకు చెందాల్సిన నీటివాటాలో ఒక చుక్క నీరుకూడా వదులుకునేది లేదని ఉత్తమ్ స్పష్టం చేశారు. ఈ విషయమై కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్లో మన వాదనలు తరువాయి 2లో

# వైద్య విద్యార్థినిపై అత్యాచారం

పశ్చిమ బెంగాల్‌లో మరో దారుణం



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో అత్యాచార ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఇటీవల కోల్‌కతాలో ఆర్‌జికర్ వైద్యురాలితో పాటు మరో న్యాయ విద్యార్థిని పైనా అత్యాచారం జరగడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చెలరేగిన సంగతి తెలిసిందే. తాజాగా మరో వైద్య విద్యార్థినిపై అత్యాచారం జరగడం ఆందోళన రేకెత్తిస్తోంది. పశ్చిమ బర్ధమాన్ జిల్లాలో ఒడిశాకు చెందిన వైద్య విద్యార్థినిపై గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం చేశారని పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి తరువాయి 2లో


# స్వస్థలాలకు గాజా ప్రజలు

దాదాపు రెండు లక్షలమంది తిరిగి రాక

అత్యధికులు ఖాన్ యూనిస్ నగరవాసులే

నేటి నుండి మానవతా సహాయం

రేపు 20 మంది బందీల విడుదల 02










# ప్రపంచం
WORLD NEWS

## సూడాన్‌లో ఆర్‌ఎస్‌ఎఫ్ దాడులు : 60 మంది మృతి

**ఖార్టూమ్ :** అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న ఆఫ్రికాదేశం సూడాన్ లోని అల్‌ఫిషర్ నగరంలో శుక్రవారం నుండి శనివారం ఉదయం వరకూ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్‌ఎస్‌ఎఫ్) చేసిన దాడుల్లో 60 మంది ప్రజలు మరణించారు. డ్రోన్లతోను, పదాతిదళ సైన్యంతోనే ఆర్‌ఎస్‌ఎఫ్ సహాయ శిబిరాలపై చేసిన దాడుల్లో వీరంతా మరణించారు. దార్ఫర్ ప్రాంతంలో సైన్యానికి గట్టి పట్టు ఉన్న అల్ ఫిషర్‌ను తన స్వాధీనంలోకి తెచ్చుకునేందుకు ఆర్‌ఎస్ఎఫ్‌ఈ దాడులు చేస్తోంది. అల్ ఫిషర్ నగరాన్ని అనేకరోజులుగా ఆర్‌ఎస్‌ఎఫ్ ముట్టడించి నగరంలోకి రాకపోకలు లేకుండా చేసింది. దీంతో ఆ నగరంలో అంటువ్యాధులు ప్రబలాయి. సరుకులులేక ప్రజలు ఆకలితో అలమటించి మరణిస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎఫ్ దాడుల్లో ఆసుపత్రులు, క్లినిక్‌లు, మసీదులు, ఇతర కీలక ప్రాంతాలన్నీ నేలమట్టం అవుతున్నాయి. అనేకమంది శిథిలాల్లోనే చిక్కుకుపోయారు. వారి జాడ, ఆ సంఖ్య తెలియదు.

### ఫ్రెంచ్ ప్రధానిగా లెకార్నో పునర్నియామకం

# రాబోయే 48గంటలూ అగ్నిపరీక్షే

**పారిస్:**ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం సమస్యకు పరిష్కారం సాధించలేకపోయిన దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, ప్రధానమంత్రిగా లెకార్నోను తిరిగి నియమించారు. మేక్రాన్ పాలనలో లెకార్నో ఆరో ప్రధానమంత్రి. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఫ్రాన్స్ ప్రజలను మెప్పించే బడ్జెట్‌ను సోమవారంలోపు పార్లమెంటుకు సమర్పించడమే ఇప్పుడు లెకార్నో ముందున్న అతి ప్రధానమైన తొలి సవాలు. కానీ మితవాద పార్టీలు మాత్రం లెకార్నునుపదవీత్యుణ్ణిచేయాలని గట్టిగా కంకణం కట్టుకున్నాయి. లెకార్నును బడ్జెట్‌కు ముందే అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించలేకపోతే, పార్లమెంటులో ఏ పార్టీకీ పూర్తి మెజారిటీ లేదు గనుక ఆయన ముసాయిదా బడ్జెట్ నామరూపాలు లేకుండా భారీగా మార్పులకు గురయ్యే అవకాశాలుంటాయి. ఒకవేళ ఆయన ప్రభుత్వం అవిశ్వాస తీర్మానంతో పదవి కోల్పోతే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేవరకూ ప్రభుత్వ లావాదేవీల నిమిత్తం అత్యవసర తాత్కాలిక శాసనం చేయాల్సి వస్తుంది. 100 మిలలియన్ యూరోలకంటే ఎక్కువ సంపద ఉన్న ధనికులపై రెండూశాతం మేరకు పన్ను విధించాలని పార్లమెంటులో ప్రధానప్రతిపక్షమైన వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ముసాయిదా బడ్జెట్ వివరాలను లెకార్ను పైకి చెప్పకపోయినప్పటికీ, రాబోయే సంవత్సరానికి బడ్జెట్‌లోలు 4.7 శాతం లేదా 5 శాతం మేరకు తగ్గే అవకాశం ఉంటుందని ఘంటాపథంగా చెబుతున్నారు.



బడ్జెట్ లోటును మాత్రం 5.4 శాతంగా అంచనా వస్తున్నారు. అందువల్ల రాబోయే 49 గంటల సమయం ఆయనకో అగ్నిపరీక్ష. 13వ తేదీ దాటితే బడ్జెట్‌పై చర్చించి ఆమోదించడానికి రాజ్యాంగం పార్లమెంటుకు ఇచ్చిన 75 రోజుల గడువు చేజారిపోతుంది. సంబంధిత చట్టాన్ని సమీక్షించడానికి న్యాయస్థానానికి కూడా ఎనిమిదిరోజుల గడువు అవసరం అవుతుంది. వద్దు... వద్దు... అని ఎవరు చెప్పినా వినకుండా గత ఏడాది జులై లో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించిన మేక్రాన్ రెండోసారి బొటాబొటీగా గెలిచి సంకీర్ణ ప్రభుత్వం చేపట్టాక అసమర్థపాలడుగా ముద్ర వేసుకున్నారు. మేక్రాన్ అధ్యక్షుడుగా కొనసాగేందుకు 2027 వరకూ అవకాశం ఉంది. కానీ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆయనను అభిశంసించేందుకు ప్రతిపక్షాలు అదనుకోసం ఎదురుచూస్తున్నాయి. ఆయన హయాంలో ఇప్పటివరకూ ఐదుగురు ప్రధానమంత్రులుమారారు.కానీ రాజీనామా తీసుకున్న చేతులతోనే తిరిగి నియామకపు పత్రాన్ని అందుకున్న ఏకైక ప్రధానమంత్రి లెకార్ను మాత్రమే. లెకార్ను మొదటినుండీ మేక్రాన్‌కు చాలా సన్నిహితుడు. మంత్రివర్గానికీ, పార్లమెంటుకు ఆయన 13వ తేదీలోపు ముసాయిదా బడ్జెట్ సమర్పించాలి. బడ్జెట్, సామాజిక భద్రతకు సంబంధించిన మంత్రులను ముందుగా ఆయన నియమించుకోవాలి. ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసిన లెకార్నును తుది విడత ప్రయత్నాలు చేయమని మేక్రాన్ ఒక అవకాశం ఇచ్చారు. కానీ ఈ చివరి ప్రయత్నం కూడా విఫలమైంది. ప్రతిపక్షంలో ప్రధానపాత్ర పోషిస్తున్న వామపక్షాలనుఉద్దేశపూర్వకంగావిస్మరించేందుకు యత్నిం చడంవల్లనే మేక్రాన్‌కు, దేశానికి ఇన్ని కష్టాలు వస్తున్నాయని లెఫ్ట్ వింగ్ విమర్శలు కొనసాగిస్తోంది. ప్రజల ఆర్థిక బాధలు విపరీతంగా పెరిగిపోవడంతో సర్వత్రా తీవ్ర అసంతృప్తి నెలకుని ఉంది. ఈ పరిస్థితుల్లో జనరంజకమైన బడ్జెట్‌ను తీర్చిదిద్ది, ప్రజలకు మేలు చేసే సంక్షేమ విధానాలతో కూడిన ఆర్థిక ప్రణాళిక రూపొందించడం సవాలుగా మారింది. లెకార్ను మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసేవిషయంలో మేక్రాన్ జోక్యం చేసుకుని కొన్ని పేర్లు ప్రతిపాదించడం ఆయన వైదొలగిపోవడానికి గల ప్రధానకారణాలలో ఒకటి. ప్రధానమంత్రికి స్వేచ్ఛలేకుండా చేశారని లెకార్ను విమర్శించారు.

# మళ్లీ ట్రంప్ కొత్త పేచీ

## జిన్‌పింగ్‌తో శిఖరాగ్ర సదస్సు రద్దు

### చైనాపై 100 శాతం అదనపు సుంకాలు

**వాషింగ్టన్:** చైనాపై ట్రంప్ మళ్లీ సుంకాల యుద్ధానికి తెరతీసి కొత్త పేచీ పెట్టారు. దక్షిణ కొరియాలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ఈనెలలో సదస్సు కూడా జరగకపోవచ్చునని సంకేతాలిచ్చారు. దీంతో గడచిన ఏప్రిల్ తర్వాత మళ్లీ మరోసారి శనివారం స్టాక్ మార్కెట్లు పతనమయ్యాయి. అమెరికాకు దిగుమతయ్యే చైనా వస్తువులపై వచ్చేనెల నుండి 100శాతం అదనపు సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. కీలకమైన సాఫ్ట్‌వేర్ ఎగుమతులపై కూడా నియంత్రణలు విధిస్తామని సోషల్ మీడియా వేదికగా ఆయన ఒక పోస్టింగ్ పెట్టారు. హైటెక్నాలజీ వస్తువుల తయారీలో ప్రధానంగా ఉపయోగించే కీలకమైన అరుదైన ఖనిజ వనరులను ఎగుమతి చేసేవిషయంలో చైనా ప్రభుత్వం సరికొత్త నియంత్రణలు విధించడంతో తాను విసిగిపోయానని ట్రంప్ పేర్కొన్నారు. నవంబరు 1వ తేదీ నుండీ లేదా అంతకంటే ముందునుండే ఈ అదనపు సుంకాలు అమలులోకి వస్తాయన్నారు. అదేవిధంగా దక్షిణ కొరియాలోనిర్ణీత ప్రకారం జిన్‌పింగ్‌తో చర్చలు కూడా జరుగుతాయో?లేదో? అని సందేహం వ్యక్తం చేశారు.మేంచర్చలురద్దుచేసుకోలేదు,కానీ చర్చలు జరుగుతాయో లేదో తనకు తెలియదన్నారు. వైట్ హౌస్‌లో పాత్రికేయులకు కూడా ఆయన శనివారం ఇదే విషయం చెప్పారు.



''చైనా శత్రుత్వం ప్రదర్శిస్తోంది, ప్రపంచాన్ని బందీగా ఉంచాలని ప్రయత్నం చేస్తోంది, చైనా అలాంటి చర్య తీసుకుంటుందనే విషయం నమ్మడం అసాధ్యం, కానీ చైనా అదేచేసింది, ఇక మిగిలిందంతా చరిత్ర'' అని సోషల్ మీడియాలో ట్రంప్ విమర్శించారు. ఈ పోస్టింగ్‌తో నాస్‌డాక్ 3.6 శాతం, ఎస్ అండ్ పి 2.7 శాతం మేరకు క్షీణించాయి. కార్లు, సెల్‌ఫోన్లు తయారుచేసే అరుదైన కీలకమైన ఖనిజాలను ఎగుమతి చేయడంలో ప్రపంచమార్కెట్‌లో చైనా దేశానిదే ఆధిపత్యం. ఈ ఎగుమతులపై కొత్త నియంత్రణలను తీసుకురావడంతోట్రంప్ సుంకాలతో బెదిరించారు. ఈ ఏడాది ఆరంభంలో ట్రంప్ చైనాపై సుంకాలు పెంచారు. దాంతో చైనా కీలక ఖనిజాల ఎగుమతులపై కఠిన నియంత్రణలు విధించడంతో చైనా కార్లకంపెనీలు, సెల్‌ఫోన్ కంపెనీలు గగ్గోలుపెట్టాయి. దీంతో ఫోర్డ్ కంపెనీ తాత్కాలికంగా ఉత్పత్తి నిలిపివేయాల్సివచ్చింది.దీంతోపాటుఅమెరికాటెక్ కం పెనీ క్వాల్‌కాం గుత్తాధిపత్యంపై చైనా దర్యాప్తు చేయడం కూడాఅమెరికా,చైనామధ్య వాణిజ్య సంబంధాలలో తీవ్ర ఒడిదొడుకులు మొదలయ్యాయి.

### రక్షణవాదం గుత్తాధిపత్యం పోవాలి : చైనా

రక్షణవాదం, గుత్తాధిపత్యం పోవాలని, బహుళపక్ష వాణిజ్యం, స్వేచ్ఛావాణిజ్యాన్ని అన్నిదేశాలూ ప్రోత్సహించాలని చైనా అంతర్జాతీయ వాణిజ్య ప్రతినిధి లీ చెంగ్ గాంగ్ పిలుపు ఇచ్చారు. దక్షిణాఫ్రికా గెక్‌బెర్హాలో జరిగిన జి–20 వాణిజ్య పెట్టుబడి మంత్రుల సమావేశంలో చెంగ్ గాంగ్ మాట్లాడుతూ, ఏకపక్ష, గుత్తాధిపత్య వాణిజ్య విధానాలను వ్యతిరేకించారు. స్వేచ్ఛావాణిజ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.ప్రపంచ సవాళ్ళను అధిగమించడానికి, వాణిజ్య సమ్మిళితవృద్ధి, హరిత పారిశ్రామికీకరణ, స్థిరమైన అభివృద్ధిని సాధించాలంటే బహుళపక్ష వాణిజ్యవ్యవస్థ అమలులోకి రావాలన్నారు.

# స్వస్థలాలకు గాజా ప్రజలు

**గాజా:** శాంతి ఒప్పందం మొదటి దశ అమలుకు హమాస్–ఇజ్రాయెల్ అంగీకారం తెలియజేసిన తర్వాత గాజాస్ట్రిప్‌లో సానుకూల వాతావరణం ఏర్పడింది. ఉత్తరగాజాకు దాదాపు రెండు లక్షల మంది స్వస్థలాలకు తిరిగి వచ్చారు. వీరిలో ఎక్కువమంది ఖాన్ యూనిస్ నగరవాసులే. శిథిలాలలో కూరుకుపోయిన తమ బంధువుల మృతదేహాల కోసం వారు అన్వేషణ ప్రారంభించారు. మరోవైపు మానవతా సహాయం, ఆహారం మోసుకొచ్చే లారీలు గాజాలోకి ప్రవేశించడం ప్రారంభించాయి. జోర్డాన్, ఈజిప్టు వంటి దేశాల నుండి వచ్చిన దాదాపు 1.70 లక్షల మెట్రిక్ టన్నుల ఆహారం, మానవతా సహాయాన్ని ఐక్యరాజ్యసమితి బృందాలు ఆదివారం నుండీ పంపిణీ చేసేందుకు ఇజ్రాయెల్ తన సమ్మతి తెలియజేసింది. ఇదిలా ఉండగా, సజీవులైన 20 మంది బందీలను ఒప్పందం ప్రకారం హమాస్ సోమవారం విడుదల చేస్తుందని డోనాల్డ్ ట్రంప్‌తోపాటు ఇజ్రాయెల్ సైన్యం కూడా ప్రకటించింది.

''సోమవారం అత్యంత కీలకమైన రోజు'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. హమాస్ వద్ద మొత్తం 48 మంది బందీలు ఉండగా, వీరిలో 28 మంది మరణించారు. ఈ మృతదేహాలు వేరువేరుచోట్ల ఉన్నాయి. బందీల మృతదేహాలను హమాస్ ఇప్పుడిప్పుడే బయటకు తీసుకువస్తోందని, యుద్ధ పరిస్థితులమధ్య మృతదేహాల జాడ తెలుసుకోవడం హమాస్‌కే సవాలుగా మారిందని ట్రంప్ అన్నారు. కొందరు బందీలు ఎక్కడ ఉన్నారో కూడా తెలియకపోవడం బాధాకరమైన విషయమని అన్నారు.

ఒప్పందంలో భాగంగా ఇజ్రాయెల్ ప్రభుత్వం కూడా 2000 మంది పాలస్తీనా ఖైదీలను జైళ్ళనుండి విడుదల చేస్తుంది. వీరిలో దాదాపు 400 మంది జీవితఖైదీలు ఉన్నారు. ఇజ్రాయెల్ జైళ్ళల్లో ఉన్న మహిళలు, పిల్లలందరినీ విడుదల చేయాలని షర్మ్–ఎల్–షేక్ చర్చల్లో పాల్గొన్న హమాస్ అగ్రనేత ఖలీల్ హయ్యా డిమాండ్ చేశారు. ఐతే ఇజ్రాయెల్ ప్రభుత్వం 250 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేస్తున్నట్లు ఒక జాబితా ప్రకటించింది. ఈ జాబితాలో తీవ్ర హింసాత్మక దాడులు చేసిన ఏడుగురు పాలస్తీనా నిందితులపేర్లు మినహాయించింది. దీంతో హమాస్ ఆగ్రహించి ప్రముఖ ఖైదీలు మార్వాన్ బార్ఘౌటీ, అహ్మద్ సాదత్‌లను కూడా విడుదల చేయాలని శనివారం డిమాండ్ చేసింది. ఇజ్రాయెల్ జైళ్ళల్లో 55 మంది పాలస్తీనా మహిళలు, 350 మంది పిల్లలు కూడా ఉన్నారు. ఒప్పందం ప్రకారం నిర్ణీత రేఖ నుండి సైన్యం వెనక్కు వెళ్ళిన తర్వాత కూడా ఇంకా 50 శాతం గాజా భూభాగం తమ అధీనంలోనే ఉంటుందని, ఆత్మసంరక్షణ ప్రాతిపదికపై ఈ ప్రాంతంలో తమ కార్యకలాపాలు కొనసాగుతాయని ఐడిఎఫ్ ప్రకటించింది. ఇజ్రాయెల్ సైనికులు అంగీకృత ప్రాంతాలను ఖాళీచేసి వెళ్ళిపోతూ ఉండటంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఒప్పందం ప్రకారం హమాస్ ఆయుధాలను వదలిపెట్టకపోతే గాజాపై దాడులు పునరుద్ధరిస్తామని నెతన్యాహూ హెచ్చరించారు. తదపరి దశలో హమాస్ ఆయుధాలను వదిలిపెట్టడమే ప్రధానాంశమని అన్నారు.

**శాంతి పర్యవేక్షణ టాస్క్‌ఫోర్స్‌కు అమెరికా సైన్యం నాయకత్వం**

గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలును 200 మంది అమెరికా సైనికులు పర్యవేక్షిస్తారు. ఇప్పటికే మధ్యప్రాచ్యంలో ఉన్న అమెరికా సైనికులు ఇజ్రాయెల్‌కు బయలుదేరారు. సివిల్ మిలిటరీ కో–ఆర్డినేషన్ సెంటర్ పేరుతో ఈజిప్టు, ఖతార్, టర్కీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన సైనికులతో 'మల్టీనేషనల్ టాస్క్‌ఫోర్స్‌ను అమెరికా సైన్యం ఏర్పాటు చేస్తోంది. అమెరికా సైనికులు గాజాలో కాలు పెట్టకుండా శాంతి అమలు పర్యవేక్షణ మాత్రమే చేస్తారని వాషింగ్టన్ వర్గాలు చెప్పాయి. గాజాలోకి అమెరికా సైన్యం ప్రవేశించబోదని, ఒక ఉమ్మడి నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసే బాధ్యతలను తమ సైనికులు నిర్వహిస్తారని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. మధ్యప్రాచ్యంలో ఉన్న 'యుఎస్ సెంట్రల్ కమాండ్' ఈ టాస్క్‌ఫోర్స్‌కు నాయకత్వం వహిస్తుంది. ఇదిలా ఉండగా, గాజాలో అంతర్జాతీయ స్థాయి సైనికుల మోహరింపును హమాస్ సహా దాని అనుబంధ ఉగ్రవాద సంస్థలన్నీ నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాయి.

## జిఓలపైనే స్టే
(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన తీర్పుపై ఆధారపడి మధ్యంతర ఉత్తర్వులు ఇస్తున్నట్లు వెల్లడించింది. రిజర్వేషన్లను పెంచకుండా పాత విధానంలో అంటే 50 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించేందుకు ఎలాంటి అడ్డంకులు లేవంది. ఓపెన్ కేటగిరీలో ఎన్నికలు జరపొచ్చునని వెల్లడించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు వల్ల మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి పెంపుదల సుప్రీం కోర్టుకు వ్యతిరేకమని, అందుకే స్టే ఇస్తున్నట్లు చెప్పింది. 50 శాతానికి మించి ఉన్న 17 శాతం రిజర్వేషన్లను జనరల్ కేటగిరీగా పరిగణించి పాత పద్ధతిలో అంటే 50 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదంది. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం పాత విధానంలో అంటే బీసీలకు 25 శాతం ఎస్సీలకు 15, ఎస్టీలకు 10 శాతం చొప్పున కేటాయిస్తూ ఎన్నికలు నిర్వహించవచ్చునని చెప్పింది. పాత పద్ధతిలో సీట్ల రిజర్వేషన్ల ప్రక్రియను సవరించి ఆమేరకు సీట్లను, రిజర్వేషన్లను ప్రకటించి ఎన్నికల ప్రక్రియ కొనసాగించవచ్చని పేర్కొంది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మోహిద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ గతంలో జారీ చేసిన స్టే ఆదేశాల ప్రతి శుక్రవారం అర్ధరాత్రి తర్వాత అందుబాటులోకి వచ్చింది. బీసీ రిజర్వేషన్లు 42 శాతంలో అమలు చేస్తే తిరిగి సరిదిద్దలేని పరిణామాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని పేర్కొంది.

అందుకే రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 26న జారీ చేసిన బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన జీవో 9, గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులకు రిజర్వేషన్లను స్థిరీకరిస్తూ పంచాయతీరాజ్ శాఖ జారీ చేసిన జీవోలు 41, 42 అమలును నిలిపివేస్తూ మధ్యంతర స్టే ఆదేశాలిస్తున్నట్లు చెప్పింది. కేశవ్ కిషన్ రావు గవాలి కేసును పరిగణనలోకి తీసుకుని జీవోలపై స్టే ఇస్తున్నట్లు తెలిపింది. రాహుల్ రమేష్ వాగ్–మహారాష్ట్ర మధ్య జరిగిన కేసులో సుప్రీంకోర్టు 2022లో ఇచ్చిన తీర్పులో ట్రిపుల్ టెస్ట్ చేయాలని ఆదేశించిందని, స్థానిక స్థాయిలో ఓబీసీలపై సమగ్ర డేటా సేకరించేందుకు ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయాలని, కమిషన్ అధ్యయనం చేసిన డేటా ఆధారంగా రిజర్వేషన్ శాతాన్ని నిర్ణయించాలని. మొత్తం రిజర్వేషన్లు (ఎస్సీ, ఎస్టీ, బీసీ) రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీం కోర్టు తీర్పులో పేర్కొందని, ఈ నేపథ్యంలో స్టే ఇస్తున్నట్లు వెల్లడించింది. ఇలా చేయకపోవడం వల్లే మహారాష్ట్రలో రిజర్వేషన్ల పరిధి 50 శాతానికి మించడాన్ని సుప్రీం కోర్టు నిలిపివేసిందని కూడా వివరించింది. స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసే పరిస్థితులు లేకపోతే పెంచిన 17 శాతం రిజర్వేషన్లను జనరల్ కేటగిరీగా పరిగణించాలని, ఆ మేరకు నోటిఫై చేసి ఎన్నికలు నిర్వహించాలని స్టే ఉత్తర్వుల్లో ఆదేశించింది. ఇదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యాక కోర్టులు జోక్యానికి వీల్లేదని సుప్రీం కోర్టు తీర్పు ఉన్నందున రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఎలక్షన్ నోటిఫికేషన్ విషయంలో జోక్యం చేసుకోవడం లేదంది. ప్రతివాదుల లేవనెత్తిన అంశాలపై ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం లేదంది. తదుపరి విచారణను డిసెంబర్ 3కి వాయిదా వేసింది.

## వదులుకోం
(మొదటి పేజీ తరువాయి)

గట్టిగా వినిపించనున్నామన్నారు. కృష్ణ లో 512 టీఎంసీల నీటిని ఆంధ్రప్రదేశ్ కు ఇచ్చేందుకు బీఆర్‌ఎస్ ఒప్పుకుందని ఆయన ఆరోపించారు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టు కాళేశ్వరం ఉత్తగా ఉన్నా తెలంగాణలో అత్యధిక వరి పంట పండిందన్నారు. గోదావరి కృష్ణాలో మోసం జరిగిందని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో హరీష్ రావు తెలంగాణ ప్రభుత్వాన్ని బదనాం చేయడం సరికాదని,ఆయన తీరు మార్చుకోవాలని హితవు పలికారు. ఏపీ సర్కారు చేపట్టే బంకచర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకమని, ఆల్మట్టి ఎత్తు పెంచడాన్ని వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. మంత్రి హోదాలో కృష్ణా ట్రిబ్యునల్‌కి హాజరైన ఏకైక మంత్రిని నేనే అని ఉత్తమ్ స్పష్టం చేశారు. కృష్ణా గోదావరి నీటి హక్కును కాపాడుకునే చిత్తశుద్ధి తెలంగాణ ప్రభుత్వానికి ఉందని, మన నీటి హక్కులను ఒక చుక్క కూడా వదులుకోమని, ఈ విషయాన్ని కేంద్రానికి ఇదే విషయం పదే పదే చెప్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే తెలంగాణ రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, సిరిసిల్ల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## టి స్క్వేర్ (మొదటి పేజీ తరువాయి)

భవేశ్ మిశ్రాతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ టి స్క్వేర్‌లో ఆపిల్ వంటి అంతర్జాతీయ సంస్థల ఔట్ లెట్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎఐ హబ్ తాత్కాలిక ఏర్పాటు కోసం ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ భవనాలను పరిశీలించాలని సూచించారు. ఎఐ హబ్ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రముఖ ఎఐ సంస్థల ప్రతినిధులతో బోర్డు ఏర్పాటు చేయాలని సిఎం ఆదేశించారు. యుటిలిటి జోన్ ఏర్పాటు చేయాలని, టి స్క్వేర్ 24 గంటల పాటు పని చేయాలన్నారు. టి స్క్వేర్ ఐకానిక్ బిల్డింగ్‌గా ఉండాలని, నిర్మాణం లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిఎం సూచించారు.

## సుప్రీంకోర్టుకు
(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి సూచించినట్లు సమాచారం. దీంతో సోమవారం ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనుంది. ఈ సందర్భంగా బిసి రిజర్వేషన్లకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నామని సిఎం రేవంత్ ఉద్ఘాటించినట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా జనాభా గణాంకాలపై సర్వే నిర్వహించి, బిసి జనాభా 57.6 శాతం ఉన్నందున 42 శాతం రిజర్వేషన్లు కల్పించామని, దీనికి అనుగుణంగా రిజర్వేషన్ల పరిమితిని సవరిస్తూ చట్టం తీసుకువచ్చిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి తదితరులు జూమ్ మీటింగ్‌లో ఈ విషయాలను సమీక్షించారు. హైకోర్టు జీఓ 9 పై స్టే ఇచ్చిన నేపథ్యంలో తదుపరి చర్యల గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఇదిలా ఉండగా, బిసి రిజర్వేషన్ల జీఓ 9ను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేసిన బి.మాధవరెడ్డి, మరొకరు సుప్రీం కోర్టులో కేవియట్ దాఖలు చేశారు. రిజర్వేషన్లకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎవరైనా అప్పీలు దాఖలు చేస్తే తమ వాదన వినకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వరాదని వారు అభ్యర్థించిన విషయం తెలిసిందే.

## అత్యాచారం
(మొదటి పేజీ తరువాయి)

దుర్గాపూర్‌లోని ప్రైవేట్ వైద్య కళాశాల క్యాంపస్ వెలుపల ఈ ఘటన జరిగిందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ఒడిశాలోని జలేశ్వర్‌కు చెందిన విద్యార్థిని సమీపంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతోందని ఒక పోలీసు అధికారి తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు ఆధారంగా తాము దర్యాప్తు ప్రారంభించామన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు విలేకరులతో మాట్లాడుతూ తన కుమార్తె స్నేహితులు ఫోన్ చేయడంతో శనివారం ఉదయం దుర్గాపూర్ చేరుకున్నట్లు వారు చెప్పారు. శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో తన కుమార్తె తన స్నేహితురాలిలో ఒకరితో కలిసి భోజనానికి వెళ్ళినప్పుడు ఆమెపై సామూహిక అత్యాచారం జరిగిందని విద్యార్థిని తల్లి ఆరోపించింది. ఈ నేపథ్యంలో తాము పోలీసులకు ఫిర్యాదు చేశామని, కళాశాల విద్యాపరంగా చాలా బాగా ఉంది అని తెలిసి తమ కుమార్తెను ఇక్కడ మెడిసిన్ చదవడానికి పంపామని విద్యార్థిని తండ్రి అన్నారు. కాగా, శుక్రవారం రాత్రి 88.30 గంటల ప్రాంతంలో విద్యార్థిని తన స్నేహితుడితో కలిసి క్యాంపస్ బయటకు వెళ్లిందని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసు అధికారి తెలిపారు. ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు అక్కడికి వచ్చినప్పుడు స్నేహితుడు ఆమెను ఒంటరిగా వదిలేసి వెళ్ళాడని, ఆ వ్యక్తులు ఆమె ఫోన్ లాక్కొని క్యాంపస్ వెలుపల ఉన్న అడవికి తీసుకెళ్లి, అక్కడ ఆమెపై అత్యాచారం చేశారని వెల్లడించారు. ఈ ఘటన గురించి ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ఆమెను బెదిరించారన్నారు. నిందితుడు తన మొబైల్ ఫోన్ తిరిగి ఇవ్వడానికి ఆమె నుండి డబ్బు డిమాండ్ చేశాడని ఆయన చెప్పారు. విద్యార్థి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశామని ఆ అధికారి తెలిపారు. తాము బాధితురాలి స్నేహితుడితో మాట్లాడామని, కొన్ని సిసిటివి ఫుటేజీలను కనుగొనడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఆధారాలు సేకరించడానికి ఫోరెన్సిక్ బృందం ఘటనా స్థలాన్ని సందర్శిస్తుందన్నారు. బాధితురాలు, ఆమె తల్లిదండ్రులను కలవడానికి జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) బృందం దుర్గాపూర్ వెళ్లింది. 'బెంగాల్‌లో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. ఇలాంటి కేసుల్లో పోలీసులు ఎటువంటి ముందస్తు చర్యలు తీసుకోవడం లేదు. ఇది చాలా దురదృష్టకరం. ఇలాంటి నేరాలు పెరగకుండా ముఖ్యమంత్రి ముందుకు వచ్చి కలిసి పనిచేయాలని నేను అభ్యర్థిస్తున్నాను' అని ఎన్‌సిడబ్ల్యు సభ్యురాలు అర్చన మజుందార్ అన్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర ఆరోగ్య శాఖ శనివారం దుర్గాపూర్‌లోని ప్రైవేట్ మెడికల్ కాలేజీ నుండి నివేదిక కోరిందని ఒక సీనియర్ అధికారి తెలిపారు.

## నేడు బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర సమితి సమావేశం

### ముఖ్యఅతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర సమితి సమావేశం ఆదివారం (నేడు) హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలోని డాక్టర్ రాజబహదూర్ గౌర్ హాలులో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులుతాటిపాముల వెంకట్రాములు , ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయ నాయుడు తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు హాజరవుతున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థలలో 42 శాతం బిసి రిజర్వేషన్ పై హైకోర్టు స్టే విధించడం తదనంతర పరిణామాలు సమావేశంలో చర్చించనున్నట్లు వారు వెల్లడించారు. అదేవిధంగా బిసి రిజర్వేషన్ల ఇతర న్యాయమైన డిమాండ్స్ సాధన కోసంతగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర సమితి సభ్యులు ,ఆహ్వానితులు సకాలంలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

## నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌పై ఎంఎల్‌సి ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గాంధీ మహాత్ముడి గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌పై ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్ హైదరాబాద్ సిసిఎస్‌లో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాంత్ అయ్యంగార్‌పై చట్టపరమైన కేసులు నమోదు చేసి శిక్షించాలని ఆయన పోలీసులను కోరారు.


భవిష్యత్‌లో ఎవరు ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా కఠినంగా శిక్షించాలన్నారు. నటుడు శ్రీకాంత్ అయ్యంగార్‌ను మా అసోసియేషన్ నుంచి సభ్యత్వం తొలగించాలని డిమాండ్ చేశారు. సినీమాటోగ్రఫి మంత్రితో పాటు... మా అసోసియేషన్, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. చాలా విషయాలపై స్పీడ్‌గా స్పందించే సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు మహాత్ముడి విషయంలో స్పం దించకపోవడం బాధాకరమని విచారణ వ్యక్తం చేశారు.

అల్లు అర్జున్ విషయంలో స్పందించిన ఫిల్మ్ ఇండస్ట్రీ... శ్రీకాంత్ అయ్యంగార్ గాంధీజీపై చేసిన కామెంట్స్ పై స్పందించకపోవడం బాధాకరమన్నారు. శ్రీకాంత్ అయ్యంగార్ పై రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తామన్నారు. శ్రీకాంత్ అయ్యంగార్ వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తామని తెలిపారు.

# మొక్క జొన్న, జొన్న పంటలను కనీస మద్దతు ధర పథకంలో చేర్చాలి

### ఈ పంటలపై 25 శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలి

### కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మొక్క జొన్న, జొన్న పంటలను కనీస మద్దతు ధర పథకంలో చేర్చడంతో పాటు 25శాతం కొనుగోలు పరిమితిని తొలగించాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌కు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రికి లేఖ రాశారు. శనివారం పిఎం ధన్ ధాన్య కృషి యోజన, నేషనల్ మిషన్ ఆన్ పల్సెస్ పథకాలను ప్రారంభించిన సందర్భంగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ కు లేఖ ద్వారా అభినందనలు తెలిపారు. దేశంలో ఆహార భద్రతను బలోపేతం చేయడానికి, రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చూపుతున్న దృఢ సంకల్పాన్ని మంత్రి అభినందిస్తూనే, రాష్ట్రంలో అమలవుతున్న ( పిఎస్ఎస్) కనీస మద్దతు ధర పథకంలో ఉన్న పరిమితులు, ప్రధాన పంటల కొనుగోలుపై కేంద్రం చూపెడుతున్న నిర్లక్ష్యం, రైతుల ఆదాయంపై ప్రభావం చూపుతున్న కేంద్ర వాణిజ్య విధానాల లేఖ ద్వారా నిరసన తెలిపారు. ప్రస్తుతం పిఎస్ఎస్ పథకం కింద కొనుగోలు చేస్తున్న నువ్వులు, శనగలు, వేరుశెనగ, సోయాబీన్, పెసళ్ళు వంటి పంటలపై కేంద్రం 25 శాతం సీలింగ్ విధించడం వల్ల రైతులు పండించిన పంటలో కేవలం 25 శాతంమాత్రమే మద్ధతు ధరకు అమ్ముకొనే వెసులుబాటు కలుగుతుందన్నారు.

తెలంగాణలాంటి రాష్ట్రాలలోని భూముల్లో నువ్వులు, శనగలు, వేరుశెనగ, సోయాబీన్, పెసళ్ళు వంటి పంటలు విస్తారంగా సాగవుతాయని, ఈ పరిమితిని విధించడంతో రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.మార్కెట్‌లో ధరలు పడిపోయిన సమయంలో రైతుల ప్రయోజల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్, సహకార సంస్థల ద్వారా కేంద్రం విధించిన 25శాతం సీలింగ్ కంటే ఎక్కువ కొనుగోళ్లు చేయవలసి వస్తోందని, దీని వల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. 25శాతం కొనుగోలు పరిమితిని రద్దు చేయడం లేక సడలించాలని కేంద్రాన్ని మంత్రి తుమ్మల కోరారు. 25శాతం కొనుగోలు పరిమితిని రద్దు చేయాలని లేదా సడలించాలని కేంద్రాన్ని మంత్రి తుమ్మల కోరారు. పత్తి విషయంలో సిసిఐ కొనుగోళ్లు 5060 శాతం వరకు మాత్రమే పరిమితం అవుతున్నాయని, నాణ్యత పరమైన కారణాలు మరియు కొనుగోళ్లలో ఆలస్యం కారణంగా రైతులకు కనీస మద్దతు ధర లభించడం లేదని మంత్రి అన్నారు. ఈ వాణిజ్య విధానాలు రైతుల ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఆయిల్ పామ్, పత్తిపై దిగుమతి సుంక విధానాలు దేశీయ మార్కెట్ సీజన్‌లకు అనుగుణంగా ఉండేలా ఆర్థిక మంత్రిత్వ శాఖతో సమన్వయం చేయాలని ఆయన కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## లడ్డూపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదు: మంత్రి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వేములవాడ లడ్డూపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం వచ్చిన ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. వేములవాడ లడ్డూ ఘటనపై దేవస్థానం అధికారులు మేరకు సమగ్ర నివేదికను మంత్రి కొండా సురేఖకు శనివారం సమర్పించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను టెంపుల్ ఇఒ రమాదేవి... లడ్డూపై వచ్చిన ఆరోపణలల్లో వాస్తవం లేదని తేల్చారు. ఎక్కడా ఎటువంటి లోపం జరగలేదని... అయినా, భక్తుల మనోభావాలను గౌరవించే ప్రక్రియలో భాగంగా కీలక చర్యలు తీసుకుంటున్నట్టు స్పష్టం చేశారు.

### కొంతమంది డాక్టర్లు, అధికారుల వల్ల
## ప్రభుత్వ వైద్య రంగం నిర్వీర్యం



వి.ఎస్.బోస్ విమర్శ...
ఘనంగా తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర 5వ మహాసభలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కొంతమంది డాక్టర్లు, అధికారులే ప్రభుత్వ వైద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఎఐటియుసి జాతీయ సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్ విమర్శించారు. చాలమంది ప్రభుత్వ డాక్టర్లకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో భాగస్వామ్యం ఉండడంతో తమ స్వార్థం కోసం ఈ వ్యవస్థను నీరు గార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్‌లో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలు శనివారం ఘనంగా జరిగాయి. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన మహాసభలను వి.ఎస్.బోస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం, విద్య అందాలంటే ఈ రెండు ప్రధాన రంగాలను ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని ఇందుకు రాష్ట్రప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం వైద్యరంగంలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులతో పని చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి కనీస వేతనాలను కూడ ఇవ్వకుండ తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. వైద్య శాఖలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరికీ ప్రతి నెల 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, ప్రజా రవాణాలాంటి వాటిని కూడ పాలకులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఏ ప్రభుత్వాలు వచ్చిన కార్మికులకు పెద్దగా చేసింది. చేస్తున్నది ఏమి లేదన్నారు. రాష్ట్రంలో 2 కోట్లకు పైగా అసంఘటిత కార్మికులున్నారని, కనీసం వారిని పట్టించుకున్న దాఖలాలు కూడ లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లు గడిస్తున్న ఇప్పటికీ కనీస వేతనాలను నిర్థారించి అమలు చేయపోవడం తీవ్ర అన్యాయమని ఆయన పేర్కొన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు మాట్లాడుతూ యూనియన్‌ను మరింత బలోపేతం చేసేందుకు సభ్యులందరూ కృషి చేయాలని సూచించారు. సంఘం ఎంత బలంగా ఉంటే సమస్యలు అంతా త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. వైద్య రంగంలో సేవలందిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి పూర్తి సహాయ సహకారాలను అందించనుందని తెలిపారు. అంతకు ముందు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇందిరా శ్రీలక్ష్మి కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టగా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మహా సభల్లో యూనియన్ కార్యనిర్వహక అధ్యక్షులు వి.వేణు కుమార్, ఉపాధ్యక్షులు ఎం.సి.ఎస్ రాజు, ఎం.ఎస్. మూర్తి, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు శ్రీనివాస చారి, నర్సయ్య, కోశాధికారి శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్య, సంక్షేమ వ్యవస్థలను గత ప్రభుత్వం భ్రష్టు పట్టించింది

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్య, సంక్షేమం వ్యవస్థలను గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. మేమే రాజులం, మేమే మంత్రులం అంటూ దశాబ్దం పాటు వారు ఈ రెండు శాఖలను పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర సచివాలయంలో శనివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో విద్యార్థుల సంఖ్య 67,113 వద్దే నిలిచిపోగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఆ సంఖ్య 71,044 మందికి పెరిగిందని చెప్పారు. ప్రస్తుతం గురుకులాల్లో మొత్తం 3.27 లక్షలకుపైగా విద్యార్థులు చదువుతున్నారని మంత్రి వెల్లడించారు. ఇందులో ఎస్‌సి గురుకులాల్లో ఇంటర్‌లో 62,334 మంది, డిగ్రీలో 8,710 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. విద్యార్థులకు పెంచిన మెస్ ఛార్జీలతో రూ.39,520.24 లక్షలు కాస్మోటిక్ ఛార్జీలతో రూ.6,918.60 లక్షలు మొత్తం ప్రభుత్వంపై అదనంగా రూ.46,438.84 లక్షలు భారం పడుతున్నా తమ ప్రభుత్వం ఆ కుటుంబాలకు భరోసా, అండగా ఉంటుందన్నారు. కానీ బిఆర్‌ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలతో విద్యార్థుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సరిదిద్దే చర్యలు చేపట్టామన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో ఎక్కడా శాశ్వత భవనాల నిర్మాణం జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బాచుపల్లి, గొల్లపల్లి (జగిత్యాల) ప్రాంతాల్లో కొత్త భవనాల నిర్మాణం ప్రారంభమైందని తెలిపారు. విద్యార్థుల భోజనం, వసతి, పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని ఆయన వెల్లడించారు. బాసర ట్రిపుల్ ఐటి విద్యార్థుల ఆహారం నాణ్యతలేమిపై రాత్రంతా మెస్‌లో తాము జాగారం చేశామని గతంలో ఏఒక్క మంత్రి కూడా అక్కడకు వెళ్లిన దాఖాలే లేవని, అలాంటి నాయకులు ఇప్పుడు తమపై విమర్శలు చేయడం హాస్యాస్పదం, అని మంత్రి వ్యాఖ్యానించారు. 2022లో జరిగిన ఆందోళనల్లో విద్యార్థులు అన్నం తినకుండా నిరసన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. మా ప్రజా ప్రభుత్వ హాయంలో సివిల్ సర్వీసుల్లో గురుకులాల ప్రతిభ 2024 సివిల్స్ ప్రిలిమ్స్‌లో 24 మంది, మెయిన్స్‌లో 3 మంది సెలెక్ట్ అయ్యారని తెలిపారు అదేవిధంగా 2025లో 26 మంది విద్యార్థులు సివిల్స్ ప్రిలిమినరీలో క్వాలిఫై అయ్యారు. ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ ప్రిలిమినరీలో 5 మంది విద్యార్థులు విజయం సాధించారు గ్రూప్–1 (2024–25): 33 మంది, గ్రూప్–4: 145 మంది, డిఎస్‌సి: 123 మంది, మొత్తం 186 మంది రాష్ట్ర–కేంద్ర సర్వీసులకు ఎంపికయ్యారని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దూరదృష్టితో గురుకులాల్లో అత్యవసర ఇబ్బందుల పరిష్కారం కోసం రూ.60 కోట్లు అత్యవసర నిధులు విడుదల చేశారన్నారు. ఈ నిధులతో హాస్టళ్లలో ఎదురయ్యే చిన్నచిన్న సమస్యలకు తక్షణ పరిష్కారం సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వెల్ఫేర్ సొసైటీలకు కలిపి నిధులు కేటాయించడం సిఎం విద్యార్థుల సంక్షేమంపై ఉన్న అంకితభావానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి సొసైటీ సెక్రటరీకి నిధుల వినియోగంపై పూర్తి అధికారం ఇవ్వడంతో పాటు హాస్టళ్లలో ఆహార నాణ్యత, మెడికల్ చెకప్‌లు, సానిటేషన్‌పై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేశామని చెప్పారు. ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకునే విధానం ఫాస్ట్ యాక్షన్ మెకానిజాన్ని అమల్లోకి తీసుకువస్తున్నామన్నారు. ప్రతి వారం తనిఖీలు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపేవిధంగా చర్యలు చేపట్టామని,విద్యార్థుల ఆరోగ్య స్థితిని డిజిటల్‌గా మానిటర్ చేసే ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటవుతోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, సంక్షేమం, విద్యార్థుల భవిష్యత్తు పట్ల అంకితభావంతో పనిచేస్తోంది, విద్యార్థుల సంక్షేమంపై రాజకీయాలు చేయడం తగదని మంత్రి పేర్కొన్నారు.

## బనకచర్లపై ఎపి ముందుకెళ్తే ప్రమాదంలో మన రాష్ట్ర భవిష్యత్తు

మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తూ తెలంగాణ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతోందని బిఆర్‌ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ బనకచర్లపై కేంద్రమంత్రి సి.ఆర్. పాటిల్ లేఖపై సిఎం రేవంత్ రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 23న జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ రాసిన లేఖలో బనకచర్ల ప్రాజెక్టు టెక్నో ఎకనామికల్ అప్రైజల్ కోసం ప్రాసెస్‌లో ఉందని పేర్కొన్నారని, వరద జలాలపై డిపిఆర్ అనేది చట్ట విరుద్ధమన్నారు. కానీ సిఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని నిలదీయకపోవడం ఆశ్చర్యకరమన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న నష్టంపై కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఎందుకు స్పందించటం లేదని హరీశ్ రావు ప్రశ్నించారు. సిడబ్ల్యూసి అనుమతులు లేకుండా, డిపిఆర్ ఎలా ఆమోదిస్తారన్నారు. దేశంలోని ఒక్కో రాష్ట్రానికి ఒక్కో నీతి ఉంటుందా అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్ళాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్‌కు ఎంపిలు ఉండి ఉంటే తెలంగాణ హక్కులపై పార్లమెంట్‌లో కొట్లాడేవారన్నారు.

**కర్ణాటక, మహారాష్ట్ర లేఖలు ఆందోళనకరం..**
కర్ణాటక సెప్టెంబర్ 17న కేంద్రానికి లేఖ రాసి, ఏపి గోదావరి నుంచి 423 టిఎంసిలను తరలిస్తే తాము కృష్ణాలో 112 టిఎంసిలు ఆపుకుంటామని చెప్పిందన్నారు. మహారాష్ట్ర కూడా ఫ్లడ్ వాటర్ ప్రాజెక్టులపై ముందుకు వెళ్తే తాము కృష్ణాలో 74 టిఎంసిలు ఆపుకుంటామని స్పష్టం చేసిందన్నారు. గోదావరి నీళ్లు ఆంధ్రాకు, కృష్ణా నీళ్లు కర్ణాటకకు పోతే మనకు ఏమి మిగులుతుందని హరీశ్ రావు ప్రశ్నించారు. బనకచర్ల అప్రైజల్ ఆగాలి, డిపిఆర్ ఆగాలన్నారు. కేంద్రం వినకపోతే బిఆర్‌ఎస్ సుప్రీంకోర్టుకు వెళ్తుందని స్పష్టం చేశారు.

**పోలవరం లింక్ సాధ్యం కాదు**
పోలవరం బనకచర్ల లింక్ సాధ్యం కాదని కేంద్ర సంస్థలైన సిడబ్ల్యూసి, జిఆర్‌ఎంబి, పోలవరం అథారిటీ ముందే తెలిపాయన్నారు. అయినా కేంద్రం ఇప్పుడు టెక్నో ఎకనామికల్ అప్రైజల్ పేరుతో ఆమోదానికి దారులు వేస్తోందన్నారు. ఎపి సిఎం చంద్రబాబు ఒత్తిడికి బిజెపి తలొగ్గిందని స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు.

## బనకచర్లపై హరీశ్‌రావు చేతులు దులుపుకునే యత్నం



పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శ

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** బనకచర్ల విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావు చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తున్నారని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే బనకచర్ల జిఒలు వెలువడ్డాయన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. రాయలసీమను రత్నాల సీమ చేస్తానన్నది మాజీ సిఎం కెసిఆర్ కాదా? అని ప్రశ్నించారు. నాటి ఎపి సిఎం జగన్‌తో కెసిఆర్ చెట్టాపట్టాలు వేసుకుని విందులు, వినోదాలు చేసుకున్నారని మండిపడ్డారు. బనకచర్ల విషయంలో ఒక చుక్క నీటిని కూడా వదులుకునే ప్రసక్తే లేదు. బనకచర్లపై మంత్రులు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లతో వివరించే ప్రయత్నం చేశారన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్‌కు కాంగ్రెస్ పార్టీ తరపున కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టుకు వెళ్లి అప్పీలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, అక్కడ వెసులుబాటు దొరుకుతుందని ఆశిస్తున్నామన్నారు. రిజర్వేషన్లు ఆపటంలోఅసలైన ముద్దాయి బిజెపి అని, బిఆర్‌ఎస్ కలిసి బిసి రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందుకే గవర్నర్ దగ్గర బిల్లు పెండింగ్‌లో ఉంచారన్నారు. గవర్నర్‌ను నియమించేది మీరు అయితే కావలని బిల్లు పెండింగ్‌లో ఉంచింది మీరే అన్నారు. అన్ని బిజెపి వద్ద ఉండగా కావలని మూడు చట్టాలు ఒక ఆర్డినెన్స్ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బిసిలకు నోటి దాకా వచ్చిన ఫలాలను అడ్డుకున్నారని, బిసిల ఉసురు తగులుతుందన్నారు. బిసి రిజర్వేషన్‌పై కాంగ్రెస్‌కు చిత్త శుద్ధి ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మంత్రుల మధ్య విభేదాలు అన్ని సర్దుబాటు చేసుకుంటామని ఆర్‌ఓబి నిర్మాణాల కోసం కేంద్రం నుండి నిధులు రావల్సి ఉందన్నారు.

## చంద్రశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం అండ

మంత్రులు శ్రీధర్ బాబు, లక్ష్మణ్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఇటీవల అమెరికాలోని డల్లాస్‌లో గుర్తు తెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో ఎల్‌బి నగర్‌లోని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ టీచర్స్ కాలనీ ఫేస్2లో నివాసం ఉండే పోలే చంద్రశేఖర్ ఈ నెల 3న మృతి చెందాడు. మృతదేహం అమెరికా నుంచి శనివారం ఉదయం 4 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మృతదేహం చేరుకోవడంతో ప్రభుత్వ యంత్రాంగం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం అనంతరెడ్డి, సరూర్‌నగర్ తహశీల్దార్ వేణుగోపాల్, పోలీసులు ప్రజాప్రతినిధులు పర్యవేక్షణలో మృతదేహాన్ని వారి స్వగృహం టీచర్స్ కాలనీకు తరలించారు. కుటుంబ సభ్యులు చంద్రశేఖర్ మృతదేహాన్ని చూసి బంధువులు తీవ్ర దుఃఖంలో మునిపోయారు.

**పార్థివదేహానికి మంత్రులు నివాళి:** పోలే చంద్రశేఖర్ పార్థివదేహాన్ని రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, కార్పొరేటర్లు ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, గణేష్ రెడ్డి, దెంది శశిధర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు కొత్త శివ ముదిరాజ్ హాజరై పూలమాలలు వేసి నివాళిలర్పించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఈ సంఘటన దురదృష్టకరమన్నారు. చంద్రశేఖర్ మృతదేహం స్వరాష్ట్రం రావడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, ఎల్‌బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధుయాష్కీ గౌడ్ అమెరికాల్లో ఉండడంతో త్వరగా మృతిదేహాన్ని తీసుకురావడం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఎంతో శ్రమించారన్నారు. ప్రభుత్వం చంద్రశేఖర్ కుటుంబానికి అన్ని విధాలుగా అదుకుంటామని వారికి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని వ్యక్తపరిచారు. వారి కుటుంబంలో చదువుకున్న వారికి అర్హతను బట్టి ప్రభుత్వం రంగంలో ఉద్యోగ అవకాశం కల్పించే విధంగా కృషి చేస్తామని, ఎస్సీ కార్పొరేషన్‌లో 5 లక్షల వరకు లోన్లు మంజూరు చేయిస్తామన్నారు. స్వగ్రామం కోహెడలో అంతక్రియలు నిర్వహించారు. నాయకులు, కాలనీ వాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా కోర్టు నూతన భవనానికి శంకుస్థాపన




**ప్రజాపక్షం/యాదాద్రి:** యాదాద్రి భువనగిరి జిల్లా కోర్టు నూతన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యి జిల్లా కోర్టుల నూతన భవన శంకుస్థాపన, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తి, యాదాద్రి భువనగిరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి కె.శరత్, ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజన, జస్టిస్ వి.రామకృష్ణ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా న్యాయమూర్తి ఎ.జయరాజు, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి పి.ముక్తిదా, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవి లత, భువనగిరి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఉషశ్రీ, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్యాంసుందర్, రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి సబిత, భువనగిరి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి స్వాతి, రామన్నపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి శిరీష, చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి మహతి వైష్ణవి, ఆలేరు జూనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్, యాదాద్రి జూనియర్ సివిల్ జడ్జి చండీశ్వరి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ యం.హనుమంతరావు, జిల్లా పరిపాలన యంత్రాంగం, రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు, డిప్యూటీ పోలీస్ కమిషనర్ అక్షాంశ్ యాదవ్, జిల్లా పోలీసు యంత్రాంగం, భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి.వెంకటయ్య గౌడ్, కార్యదర్శి బొల్లేపల్లి కుమార్, జిల్లాలోని రామన్నపేట, చౌటుప్పల్, ఆలేరు మరియు భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు ఉన్నత న్యాయస్థాన చీఫ్ జస్టిస్‌కి మరియు న్యాయమూర్తులను సన్మానించి మెమెంటోలను అందచేసారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వెన్నెల, జె.భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్.ఆర్.పాఠశాల విద్యార్తినిలచే స్వాగతనృత్యం చేయించారు. నేడు జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా న్యాయమూర్తులు బాలికలకు శుభాకాంక్షలు తెలిపి వారిని ప్రశంసించారు. ఈ సందర్భంగా మ.రా. చీఫ్ జస్టిస్ మాట్లాడుతూ భువనగిరి హైదరాబాద్‌కు దగ్గర్లో ఉండి భువనగిరి కోర్టులపై భారం అధికంగా ఉంటుందని దీనికై సాంకేతికంగా, ఇతరుల వనరుల పరంగా ఎంతో అవసరం ఉంటుందని దీనికై త్వరితగతిన భవన నిర్మాణం పూర్తి చేయాలని ఈ శంకుస్థాపన నిర్వహించటం జరిగిందని, ముఖ్యంగా న్యాయవ్యవస్థలు రాజ్యాంగ లక్ష్యాలను చేరుకోవటానికి ప్రజలకు న్యాయం అందించటానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయ శాఖలోని ఉద్యోగులు చిత్త శుద్ధితో నైతిక విలువలు కాపాడుతూ కృషి చేయాలని, వ్యవస్థలు ఎంత పటిష్టంగా ఉంటే తద్వారా దేశం పురోగమిస్తుందని తెలిపి దేశ సాయుధ దళాలు జాతి రక్షణకోసం ముందుండి దేశ సేవ చేస్తున్నారని దానిని మనం ఆశయంగా తీసుకోవాలని వ్యవస్థలపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని అనుసరిస్తూ మనం సేవలు అందించాలని తెలిపారు. యాదగిరిగుట్టలో మంచిర్యాల జిల్లా శంకుస్థాపనను కూడా వర్చువల్ విధానంలో నిర్వహించారు.

## చిన్నారులను మింగిన వ్యవసాయ బావి

బహిర్భూమికి వెళ్లి కానరాని లోకాలకు..



**ప్రజాపక్షం/కొత్తగూడ/గూడూరు:** దసరా సెలవుల కానీ అమ్మమ్మ ఇంటికి వెళ్లిన ఓ ఇద్దరు చిన్నారులను వ్యవసాయ బావి మింగింది. బహిర్భూమికని బయటికి వెళ్లిన చిన్నారులు కానరాని లోకానికి వెళ్లిపోయారు. వివరాల్లోకి వెళ్తే ములుగు జిల్లా పుల్లిమడుగు గ్రామానికి చెందిన ఇటికాల నరసయ్య స్వాతి దంపతుల కుమారుడు రిత్విక్ (12) నరసయ్య సోదరి అనిత శ్రీనువాస్ దంపతుల కుమారుడు జతిన్ (12) దసరా పండుగ సెలవులకు మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెం గ్రామానికి వచ్చారు. ఈసందర్భంగా వారి మేనత్త చనిపోవడంతో అక్కడికి కుటుంబ సభ్యులందరూ వెళ్లాగా రిత్విక్ జతిన్ బహిర్భూమికని ఇంటి పక్కనే ఉన్న వ్యవసాయ బావి దగ్గరికి వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందారు. కాగా బావిలో చెప్పులు బట్టలు ఉండడంతో గ్రామస్తులు బావిలో వెతకగా మృతదేహాలు లభ్యమయ్యాయి. విషయం తెలుసుకున్న కొత్తగూడ ఎస్సై రాజకుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. గ్రామస్తులు సహాయంతో బావిలో చిన్నారుల మృతదేహాలు తీయడం జరిగింది. కాగా చిన్నారులు మిగిత జీవులుగా పడి ఉండడంతో వెళ్లి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

## అధిక వడ్డీ ఆశ చూపి రూ.50 కోట్లు వసూలు

నిందితుడు బాలాజీ నాయక్ అరెస్టు..
ఎస్‌పి శరత్ చంద్ర పవర్




**ప్రజాపక్షం/నల్లగొండ :** అధిక వడ్డీ పేరుతో ఆశ చూపి దాదాపు రూ.50 కోట్ల మేర అమాయక ప్రజల వద్ద నుండి ఏజెంట్ల ద్వారా వసూలు చేసి మోసం చేసిన నిందితున్ని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిక వడ్డీ పేరుతో ఆశ చూపి దాదాపు రూ.50 కోట్ల మేర అమాయక ప్రజల వద్ద నుండి ఏజెంట్ల ద్వారా వసూలు చేసి మోసం చేసిన నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు. పీఏ పల్లి మండలం వద్దిపట్ల గ్రామం పలుగు తండాకు చెందిన రామవత్ బాలాజీ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని నిర్ణయించుకొని డబ్బులు 2 రూపాయల వడ్డీకి దొరకగపోగా 6 రూపాయల వడ్డీ ఇస్తానని ఆశ చూపి నమ్మించి అదే గ్రామానికి చెందిన వారి నుంచి రూ.10 లక్షలు ఒకరి వద్ద, రూ.5 లక్షలు మరొకరి వద్ద తీసుకొని వడ్డీ చెల్లిస్తూ నమ్మించడానికి తెలిపారు. నెలకు రూ.10 వడ్డీ ఇస్తానని జనాలను నమ్మించి సుమారు రూ.50 కోట్లు డబ్బులు వసూలు చేసి వడ్డీ మాత్రమే ఇచ్చి బాధితుల వద్ద ఉన్న ప్రామిసరీ నోటు వెనుకల వడ్డీ ఇచ్చినట్లు వ్రాసి పాత ప్రామిసరీ నోటు తీసుకొని కొత్త ప్రామిసరీ నోటు అదే అసలు అమౌంట్‌కి వ్రాసి ఇచ్చేవాడు. ఇలా వచ్చిన కోట్ల డబ్బులతో వైన్‌షాప్ పర్మిషన్‌ల కోసం సుమారు 2.3 కోట్లు, స్టాక్ మార్కెట్‌లలో పెట్టుబడులు పెట్టి నష్ట పోయినాడని తెలిపారు. గత కొన్ని నెలలుగా బాధితులకు అసలు, వడ్డీ డబ్బులు ఇవ్వలేక పోయే సరికి బాధితులు బాలాజీ నాయక్‌పై ఒత్తిడి చేయడం ప్రారంభించారని ఇన్ని డబ్బులు ఇవ్వలేక బాలాజీ నాయక్ బాధితుల నుండి తప్పించుకొని పారిపోయాడని తెలిపారు. గుడిపల్లి పిఎస్‌లో ఇతని పైన కేసు నమోదు చేయడంతో నల్లగొండలో అరెస్టు చేయడం జరిగిందని ఈ కేసును అడిషనల్ ఎస్‌పి ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు తో విచారణ జరుగుతుందని తెలిపారు. అతని వద్ద నుండి సుమారు 80 లక్షల విలువగల ఫార్చునార్, స్కార్పియో కారు. విలువైన ఆస్తికి సంబంధించిన పత్రాలు మిర్యాలగూడ, హయత్‌నగర్, నేరేడుచర్ల, పలుగు తండాలో ఇల్లు, దామరచర్లలో వ్యవసాయ భూమి. బాధితులకు వ్రాసి ఇచ్చిన ప్రామిసరీ నోట్లను 5.5 లక్షల విలువగల ఏడు సెల్‌ఫోన్లను స్వాధీన పరుచుకోవడం జరిగిందని తెలిపారు. బాధితులు నేరుగా వారి వద్ద ఉన్న పత్రాలతో గుడిపల్లి పోలీస్ వారిని సంప్రదించి కేసులు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం. ఫోన్ నం.08743-232428

ఆర్.సి.నం.ఇ1/569/2025 | ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన | తేది: 11.10.2025

ఈ దేవస్థానము నందు వైకుంఠ ఏకాదశీ ఉత్సవములు-2025-26 సందర్భంగా వివిధ పనులు చేయుటకుగాను రిజిష్టర్డ్ సంస్థల నుండి ఈ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లు కోరబడుచున్నవి. **ఇ-టెండరు డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేది:** 14.10.2025 ఉదయం గం.11.00ల నుండి, **టెండరు దాఖలు చేయు చివరి తేది:** 28.10.2025 ఉదయం గం.11.00ల వరకు, **టెక్నికల్ బిడ్ తెరచు తేది:** 28.10.2025 ఉదయం గం.11.30లకు, **ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది:** 28.10.2025 మధ్యాహ్నం గం.12.00లకు. ఇతర వివరములు https://tender.telangana.gov.in నందు చూడవచ్చును.

సం/- కె.దామోదర్ రావు
కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 9057-PP/CL/ADVT/1/2025-26, Date: 11-10-2025

**పురపాలక కార్యాలయము : బెల్లంపల్లి : జిల్లా :: మంచిర్యాల**
ఈ-ప్రొక్యూర్మెంట్ టెండర్ నోటీస్ నెం. ఇ1/09/టెండర్/2025-26/Bp/Mptly. తేది: 10-10-2025

ఈ-ప్రొక్యూర్మెంట్ షార్ట్ టెండర్ నోటీస్

ఈ కార్యాలయములో అంచనా విలువ రూ.8.00 లక్షల విలువ గల (2) పనులకు 15వ ఆర్థిక సంఘ నిధులకు గాను ఎలక్ట్రికల్ / ఫర్మ్ / సప్లయర్స్/ డీలర్స్/ కంపెనీస్/ సివిల్/లేబర్ కాంట్రాక్టర్స్, రిజిస్ట్రేషన్ కాంట్రాక్టర్ వారి నుండి ఈ కార్యాలయం ఈ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. వాటి వివరములు ఈ క్రింది విధముగా ఉన్నవి.

టెండర్ తేదీల వివరములు :

01. డౌన్‌లోడ్ మొదలు తేది & సమయం : 10.10.2025 from 04.30 PM
02. డౌన్‌లోడ్ చివరి తేది & సమయం : 17.10.2025 up to 4.00 PM

ఇట్టి విషయములో తదుపరి సమాచార నిమిత్తము ఆఫీసు పనివేళల్లో మున్సిపల్ కార్యాలయము నందు సంప్రదించగలరు. పూర్తి వివరములకు website: www.tender.telangana.gov.in నందు చూడవచ్చును.

**పురపాలక కార్యాలయము : బెల్లంపల్లి: జిల్లా :: మంచిర్యాల**
కొటేషన్ నోటీస్ నెం. ఇ1/కొటేషన్/07/2025-26/Bpl/Mptly. తేది: 10-10-2025

కొటేషన నోటీస్

ఈ కార్యాలయములో ఎస్.బి.యమ్. 2.0లో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా వేబ్రిడ్జి, ట్రామెల్ (16-40 ఎమ్.ఎమ్), విన్‌డ్రా టర్నర్, సార్టింగ్ కన్వేయర్ బెల్ట్ (సైట్ కండీషన్), బేయిలింగ్ మిషన్, గార్డెన్ శ్రెడ్డర్, శ్రెడ్డర్, ఏయిర్ బ్లోయర్ కొనుగోలు చేయుటకు బెల్లంపల్లి మున్సిపల్ కమీషనర్ గారి కార్యాలయంకు సీల్డ్ కొటేషన్లు కోరబడుచున్నవి. వాటి వివరములు ఈ క్రింది విధముగా ఉన్నవి.

కొటేషన్స్ కార్యాలయమునకు సమర్పించు తేదీల వివరములు :

01. కొటేషను సమర్పించు చివరి తేది & సమయం : 17.10.2025 up to 1.00 PM

ఇట్టి విషయములో తదుపరి సమాచార నిమిత్తము ఆఫీసు పనివేళల్లో మున్సిపల్ కార్యాలయము నందు సంప్రదించగలరు.

సం/- కమీషనర్,
బెల్లంపల్లి మున్సిపాలిటి.

DIPR R.O. No. : 9022-PP/CL/ADVT/1/2025-26, Date: 11-10-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## 'మద్యం' దరఖాస్తు కౌంటర్లను పరిశీలించిన ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మద్యం దుకాణం కోసం దరఖాస్తు చేసుకునే దరఖాస్తుదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగ కూడదని ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ అధికారులకు సూచించారు. అబ్కారీ భవన్‌లో ఏర్పాటు చేసిన దరఖాస్తుల కౌంటర్లను ఆయన శనివారం పరిశీలించారు. అబ్కారీ భవన్‌లో పది ఎక్సైజ్ డివిజన్ల కౌంటర్లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తెలంగాణలోని పది ఎక్సైజ్ డివిజన్ల నుంచి దరఖాస్తులు వేయడానికి వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండ చూసుకోవాలని సి.హరికిరణ్ ఆదేశించారు.నాంపల్లిలోని అబ్కారీ భవన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి పది జిల్లాలకు సంబంధించి ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లను శనివారం తనిఖీ చేశారు. అదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు సంబంధించిన కౌంటర్లను అబ్కారీ భవన్‌లోని మొదటి అంతుస్తులో ఏర్పాటు చేశారు. నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలకు సంబంధించిన దరఖాస్తుల కౌంటర్లను రెండవ అంతుస్తులో ఏర్పాటు చేశారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలయ్యే దాకా

# స్థానిక ఎన్నికలు నిర్వహించొద్దు

**అఖిలపక్షం ఏకగ్రీవ తీర్మానం**

**హైకోర్టు స్టే పై సుప్రీంకోర్టును ప్రభుత్వం ఆశ్రయించాలి**

**సిఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్ష నేతలతో కలిసి ప్రధాని మోదీని కలవాలి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర హైకోర్టు బిసి రిజర్వేషన్‌ల పెంపుపై ఇచ్చిన స్టేను తీవ్రంగా నిరసిస్తూ, 42 శాతం రిజర్వేషన్లు అమలు అయ్యే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించరాదని అఖిలపక్షం ఏకగ్రీవంగా తీర్మానించింది. హై కోర్టు స్టే పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని, బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ పరిరక్షణ కల్పించేందుకు సిఎం రేవంత్ రెడ్డి అఖిలపక్ష నేతలతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీని కలవాలని కోరింది. హైదరాబాద్ బంజారాహిల్స్ కళింగ భవన్‌లో శనివారం 'బిసి రిజర్వేషన్‌లపై హైకోర్టు స్టే పరిష్కార మార్గాలు భవిష్యత్ కార్యాచరణ' అంశంపై అఖిలపక్ష పార్టీలు, బిసి సంఘాలు, బిసి కుల సంఘాలు, మేధావుల సంయుక్త సమావేశం బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు, టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, కాంగ్రెస్ నాయకులు అనిల్, బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ కుమార్‌గౌడ్, సిపిఐ(ఎం) బండారు రవి కుమార్, సిపిఐ ఎంఎల్ నాయకులు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. 30 బిసి కుల సంఘాలు, 80 కుల సంఘాల రాష్ట్రాధ్యక్షులు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, బిసి నాయకులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

### బిసి బిల్లు వ్యతిరేక శక్తులను ఏకాకి చేస్తేనే విజయం సాధిస్తాం : సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



బిసి బిల్లుకు వ్యతిరేకంగా ఉన్న శక్తులను ఏకాకి చేస్తేనే విజయం సాధిస్తామని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. బిసిల సామాజిక న్యాయం కోసం కేంద్ర ప్రభుత్వం వెంటనే బిసి బిల్లును ఆమోదించాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనసభ, శాసన మండలిలలో ఆమోదించిన తర్వాత కూడా గవర్నర్ ఆమోదించకుండా జాప్యం చేస్తున్నారని అన్నారు. శాసనసభ, శాసనమండలిలలో బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతామని చెప్పిన పార్టీలు అఖిలపక్షంగా ఢిల్లీకి వెళ్లినప్పుడు కొన్ని పార్టీలు రాలేదన్నారు. బిసి రిజర్వేషన్‌లు దక్కేందుకు న్యాయపరంగా ప్రయత్నం చేయాలన్నారు. తెలంగాణ ఉద్యమ తరహాలో ఉద్యమించాలన్నారు. సామాజిక ఉద్యమాలకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. జాతీయ స్థాయిలో కూడా సిపిఐ మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ తన చిత్తశుద్ధితో కులగణన చేసిందని, బిసి బిల్లు ప్రవేశపెట్టిందన్నారు. ఇవన్నీ జరిగిన తరువాత కూడా హైకోర్టు స్టే ఇచ్చిందన్నారు.తాత్కాలికంగా కొంత నిరాశకు గురైన అంతిమంగా విజయం సాధిస్తామన్నారు.

### న్యాయ పోరాటంతో పాటు ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేయాలి : కోదండరామ్

కోదండరామ్ మాట్లాడుతూ 50 శాతం రిజర్వేషన్ల పరిమితి రాజ్యాంగంలో లేదని కోర్టులు కూడా స్పష్టం చేశాయన్నారు. లీగల్ పోరాటంతో పాటు కార్యాచరణ ప్లాన్ కూడా సిద్ధం చేయాలన్నారు. ఢిల్లీలో అన్ని పార్టీలు, ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

### జెఎసి ఏర్పాటు చేసి, సమగ్ర ఉద్యమం చేపట్టాలి : అద్దంకి దయాకర్

అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ఇప్పుడు పోరాటం చేసే సమయం వచ్చిందన్నారు. బిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కేసులు వేసిన వారు చిన్న వ్యక్తులు మాత్రమే అన్నారు. అన్ని పార్టీలు, అన్ని వర్గాలు ఐక్యంగా ఉండాలన్నారు. జెఎసి ఏర్పాటు చేసి, సమగ్ర ఉద్యమం చేపట్టాలని సూచించారు.

### పార్లమెంట్‌లో చట్టపరమైన రక్షణ కల్పించాలి : ఆనంద్ కుమార్‌గౌడ్

ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రిజర్వేషన్ల అంశం క్షేత్రస్థాయికి వెళ్లిందన్నారు. పార్టీ విమర్శలు వద్దు అన్నారు. జయలలిత లా ధైర్యంగా 9వ షెడ్యూల్‌లో చేర్చే విధంగా కేంద్రం ముందుకు రావాలని కోరారు. సిఎం, ప్రధాని, అన్ని పార్టీలు కలిసి పార్లమెంట్‌లో చట్టపరమైన రక్షణ సాధించాలన్నారు.

### బిసి రిజర్వేషన్‌లకు అడ్డుపడింది బిజెపినే : బండారు రవికుమార్

బండారు రవికుమార్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లకు అడ్డుపడింది బిజెపియే అన్నారు. రాజ్‌భవన్‌ను రాజకీయ కేంద్రాలుగా మార్చిందని విమర్శించారు. బిసిలు వేలాదిగా రాజ్‌భవన్ ముట్టడికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

### బిసి సమాజం రోడ్డెక్కితే పరిస్థితి వేరేలా ఉంటుంది : జాజుల శ్రీనివాస్‌గౌడ్

జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లు పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వాలని, బిసి సమస్యల పరిష్కారానికి ఎంపి లక్ష్మణ్ చొరవ తీసుకోవాలని కోరారు. బిసి సమాజం రోడ్డెక్కితే పరిస్థితి వేరేలా ఉంటుందన్నారు.

### సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తాం : ఇరావత్ అనిల్

ఇరావత్ అనిల్ మాట్లాడుతూ హైకోర్టు స్టే పై సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తామని తెలిపారు. కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. సిఎం రేవంత్ రెడ్డి అఖిలపక్షాన్ని ఏర్పాటు చేయడం పట్ల సానుకూలంగా ఉన్నారని చెప్పారు. ప్రధాని సమయం బిజెపి నేతలు ఇప్పిస్తే అఖిలపక్షంగా కలిసి ప్రధాని మోదీని కలుస్తామని తెలిపారు.

## తెలంగాణ బంద్‌కు మద్దతు ఇవ్వండి

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కోరిన ఆర్.కృష్ణయ్య**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బిసి రిజర్వేషన్‌లపై తెలంగాణ హైకోర్టు స్టే కు నిరసనగా బిసి నేత, ఎంపి ఆర్.కృష్ణయ్య ఈనెల 14న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. అందులో భాగంగా తెలంగాణ బంద్‌కు బిజెపి మద్దతు కోరారు. ఇదే విషయంపై శనివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో ఆర్.కృష్ణయ్య భేటీ అయ్యారు. అనంతరం ఎంపి మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ జి.ఓపై హైకోర్టు స్టే ఇవ్వడం, ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేస్తూ, ఈనెల 14న రాష్ట్రవ్యాప్తంగా బంద్ నిర్వహిస్తామని తెలిపారు. అన్ని బిసి సంఘాల మద్దతుతో బంద్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అందరూ కలిసి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు మద్దతు ఇవ్వాలన్నారు. బంద్‌కు బిజెపి మద్దతు ఇవ్వాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కోరడం జరిగిందన్నారు. దీనిపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కిషన్ రెడ్డి చెప్పారని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక కోర్టులు జోక్యం చేసుకోవడం ఏంటని కృష్ణయ్య ప్రశ్నించారు. బిసి సంఘాలు ఇప్పటికే పెద్దఎత్తున రౌండ్ టేబుల్ సమావేశం, నిరసనలు, ధర్నాలు చేస్తున్నారని కృష్ణయ్య చెప్పారు.

## విజిలెన్స్ అధికారుల ఆకస్మిక దాడులు

**35 వాహనాలపై కేసు..రూ.6.7లక్షల ఫైన్**





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం కలిగిస్తున్న రవాణా వాహనాలపై రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 16 వాహనాలపై కేసులు నమోదు చేసి వారికి రూ. 6,70,000 చలానా విధించామని విజిలెన్స్ డిజి శిఖాగోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్య రాత్రి తరువాత ఆర్‌సిపురం యూనిట్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, మైన్స్, స్టేట్ టాక్స్, ఆర్‌టిఎ డిపార్ట్‌మెంట్‌ల అధికారులతో కలిసి ముత్తంగి, పటాన్‌చెరు శివారు ప్రాంతాల్లో ఆకస్మిక రూట్ తనిఖీ నిర్వహించామని తెలిపారు. టాక్స్ చెల్లింపు చేయక పోవడం, ఓవర్‌లోడ్, ట్రాన్సిట్ ఫారం లేకుండా రవాణా,రాయల్టీలు, జీఎస్టీ ఎగవేత, మోటారు వాహన చట్టం, మైన్స్ చట్టం, జిఎస్‌టి చట్టం కింద కేసులు బుక్ చేశామని శిఖాగోయల్ తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని కోకాపేట్ ప్రాంతంలో కూడా ఆకస్మిక రూట్ తనిఖీ నిర్వహించారు. వాహనాలను తనిఖీ మరో 19 వాహనాలపై మోటారు వాహనాల చట్టం కింద 15 కేసులను మైన్స్, మినరల్స్ చట్టం కింద బుక్ చేశామని తెలిపారు. వీరికి రూ.6,16,258 చలానా విధించామని తెలిపారు. ప్రభుత్వ నిధులు, సహజ వనరుల దుర్వినియోగం, ప్రభుత్వ ఆదాయ లీకేజీని నిరోధించడానికి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ కట్టుబడి ఉందని శిఖాగోయల్ పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులు లేదా వనరుల దుర్వినియోగం లేదా ఏదైనా అవకతవకల గురించి సమాచారాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌తో పంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వం అఖిలపక్షం ఏర్పాటు చేయాలి : సిపిఐ(ఎం) డిమాండ్

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమేఅఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేయాలని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్రకమిటీ డిమాండ్ చేసింది. 6 నెలలు పైగా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న బిసి రిజర్వేషన్ల బిల్లులను 9వ షెడ్యూల్లో చేర్చే విధంగా పోరాటం సాగించాలన్నారు.. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయబద్ధంగా చేయాల్సిన ప్రయత్నం చేస్తూనే, కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి సాధించడం కోసం ఉద్యమాన్ని కొనసాగించాలని ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమాన్నిరూపొందించాలి,అఖిలపక్షంతీసుకున్న ఉద్యమానికి సిపిఎం పూర్తిగా మద్దతిస్తుందని రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పేర్కొన్నారు. రాష్ట్రంలో బిజెపి ఎంఎల్‌ఎలతో పాటు 8మంది ఎంపిల్లో ఇద్దరు కేంద్ర మంత్రుగా ఉన్నా , వీళ్ళందరూ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్‌కు అనుకూలంగా కేంద్రంలోవ్యతిరేకంగామాట్లాడుతున్నారనివిమర్శించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిసి బిల్లులను అమలు చేయించాల్సిన బాధ్యత ఈ పార్టీ ఎంపీలు, మంత్రులదేనని లేకపోతే రాజీనామాలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి ఇదే వైఖరి కొనసాగిస్తే రాష్ట్రంలో జూబ్లీహిల్స్, స్థానిక సంస్థల ఎన్నికలే కాదు, ఏ ఎన్నికలు జరిగినా బిజెపికి ఓట్లు వేయకుండా సామాజిక తరగతులన్ని తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

## జాతీయ స్థాయి ఆయుర్వేద ఇన్‌స్టిట్యూట్‌ను మంజూరు చేయాలి

**కేంద్ర మంత్రి ప్రతాప్‌రావు జాదవ్‌కు మంత్రి దామోదర్ రాజనర్సింహ విజ్ఞప్తి**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణకు జాతీయ స్థాయి ఆయుర్వేద ఇనిస్టిట్యూట్‌ను మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్నికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌కు విచ్చేసిన కేంద్ర ఆయూష్ ఆరోగ్య శాఖ మంత్రి ప్రతాప్‌రావు జాదవ్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ లేఖను అందజేశారు. 2030 నాటికి దేశంలో 10 ఆల్ ఇండియా ఆయుర్వేద ఇనిస్టిట్యూట్స్‌ను నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యంలో భాగంగా ఒకటి తెలంగాణలో ఏర్పాటు చేయాలనిఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహా కేంద్ర మంత్రిని కోరారు. తెలంగాణ అడవుల్లో అద్భుతమైన ఆయుర్వేద సంపద ఉన్నదని, మెడిసినల్ వాల్యూస్ ఉన్న మూలికలు, మొక్కల జాతులు ఉన్నాయని మంత్రి లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సాంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానాలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు ఇటీవలే సుమారు 800 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించామని తెలిపారు.ఆయుష్ హాస్పిటళ్లను బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు.రాష్ట్రంలో వందల సంవత్సరాలుగా ఆయుష్ వైద్య విధానాలకు మంచి ప్రాచుర్యం ఉన్నదని, ఇక్కడి ప్రజలు ఆయుష్ వైద్య సేవలను కూడా వినియోగించుకుంటున్నారని మంత్రి పేర్కొన్నారు.కేంద్రం ఏర్పాటు చేయబోయే ఆయుర్వేద ఇనిస్టిట్యూట్స్‌లో ఒకటి తెలంగాణకు కేటాయించాలని, అవసరమైన భూమి, ఇతర వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి లేఖలో వివరించారు.

## న్యాయ నిపుణులతో చర్చలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు తీర్పుపై న్యాయ నిపుణులతో రాష్ట్ర ఎన్నికల సంఘం చర్చలు జరుపుతోంది. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేదని హైకోర్టు తాజా ఉత్తర్వుల్లో పేర్కొంది. జి.ఓ 9, 41పై మాత్రమే మధ్యంతర స్టే ఇచ్చినట్లు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పాత రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు న్యాయ నిపుణుల సూచన మేరకు తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు ఎస్ఈసి స్పష్టం చేసింది.

## వరంగల్, నల్లగొండలో ఇంక్యూబేషన్ కేంద్రాలు

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను 'ఇన్నోవేషన్ హబ్' గా మార్చాలన్నదే తమ సంకల్పమని, వరంగల్, నల్గొండలోనూ టిహబ్ తరహాలో ఇంక్యూబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నట్లుగా రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే కాకతీయ, మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయాలతో ఎంఒయు కుదుర్చుకోనున్నట్లుగా వివరించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న 'కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అలుమ్ని' గోల్డెన్ జూబ్లీ వేడుకలను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైన్స్ కు మానవత్వాన్ని జోడిస్తే ప్రతి ఆవిష్కరణ సమాజహితానికి బాటలు వేస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణను గ్లోబల్ ఫార్మా, లైఫ్ సైన్సెస్ హబ్ గా మాత్రమే కాకుండా 'ఫార్మసీ ఆఫ్ పర్పస్'గానూ మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. రీసెర్చ్ ను మార్కెట్‌కు, పాలసీని రోగికి అనుసంధానించే సమగ్రమైన 360 డిగ్రీల ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 18 నెలల్లోనే లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా రూ.54వేల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. ఎలీ లిల్లీ లాంటి అంతర్జాతీయ ఫార్మా దిగ్గజ కంపెనీలను తెలంగాణకు తీసుకొచ్చి, ఇక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు.డాక్టర్ల కంటే వేగంగా రోగాలను నిర్ధారించినా, అనుభూతి చెందే మనసును మాత్రం ఏ యంత్రం భర్తీ చేయలేదన్నారు. దేశంలో తమ అనుభవాన్ని 'నాలెడ్జ్ ఇన్వెస్ట్ మెంట్'గా పెట్టేందుకు ముందుకు రావాలని ప్రవాసీ భారతీయ నిపుణులకు విజ్ఞప్తి చేశారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ..ప్రజల ఆరోగ్యం, భద్రత కోసం మీరు అందించే సేవలు వెలకట్టలేనివి. సమాజం కోసం మీ మేధస్సును దారపోస్తారన్నారు. నల్గొండ జిల్లా సంకిశాల ప్రాంతానికి చెందిన పైళ్ల మల్లారెడ్డి 35 ఏళ్లుగా ఫార్మా రంగంలో ఉన్నారని ఆయన న్యూ యార్క్ లో బ్యాక్టోలాక్ ఫార్మాస్యూటికల్,పలు కంపెనీలకు చైర్మన్ గా ఉన్నారని గుర్తు చేశారు. ఆయన మార్కెట్ నెట్ వర్త్ సుమారు 10వేల కోట్లు.. గ్రామీణ ప్రాంతానికి చెందిన పైళ్ల మల్లారెడ్డి లాంటి వారిని నేటి ఫార్మా విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ కె.ప్రతాప్ రెడ్డి, డా.బి.ప్రభా శంకర్, రాంప్రసాద్‌రెడ్డి, ప్రద్యుమ్న, డా.తామర విజయ్ కుమార్, ప్రొఫెసర్ భాస్కర్ ఆర్.జాస్తి, రాజేశ్వర్ తోట, ప్రొఫెసర్ జె. కృష్ణ వేణి తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో ఎన్నికల విధులు

**జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సత్యనిష్ఠతో, సమన్వయంతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల నేపథ్యంలో శనివారం బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో సెక్టార్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఆర్.వి. కర్ణన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు ఎన్నికల బాధ్యతలు, విధులపై వివరంగా అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను కచ్చితంగా పాటించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, పారదర్శక ఎన్నికలు నిర్వహించే బాధ్యత అందరిదన్నారు. బూత్ లెవెల్ అధికారులు తమ పనులను సకాలంలో పూర్తి చేసి, ఉన్నతాధికారులకు నిరంతరం నివేదికలు అందించాలని సూచించారు. ఎటువంటి సందేహాలైనా వెంటనే పై అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. ఏదైనా ఉల్లంఘనలు గమనించిన వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కాకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, రిటర్నింగ్ అధికారి పి. సాయిరాం, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునంద పాల్గొన్నారు.

**నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తిచేయాలి**

జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 13న విడుదల కానుండగా, అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ శనివారం సందర్శించారు. రిటర్నింగ్ అధికారి పి. సాయిరాం, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఎఆర్‌ఓ)తో కలిసి ఏర్పాట్లను సమీక్షించిన ఆయన, నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

## టూరిస్టు పోలీసులు వచ్చేశారు..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పర్యాటకులకు మరింత భద్రతతో పాటు మంచి అనుభూతి కొరకు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టూరిస్టు పోలీసులను రంగంలోకి దింపింది. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర సంపన్న సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు పర్యాటకులకు ప్రపంచస్థాయిసౌకార్యలను కల్పించేందుకు పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి) కట్టుబడి ఉందని సంస్థ ఎండి వల్లూరు క్రాంతి తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక ప్రదేశాలలో టూరిస్టు పోలీసు యూనిట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తద్వార సందర్శకుల భద్రతను మెరుగుపరచడం, ప్రయాణికులకు మెరుగైన సహాయాన్ని అందించడం లక్ష్యంగా టూరిస్టు పోలీసులను నియమించామని తెలిపారు. 80 మంది టూరిస్టు పోలీసులకు ఓరియంటేషన్,సెన్సిటైజేషన్ అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ కూడా ఇప్పించడం జరిగిందని వల్లూరు క్రాంతి తెలిపారు. ఈ నెల 10,11 తేదీల్లో యాదగిరిగుట్ట, భువనగిరి కోట, గోల్కొండ కోట, కుతుబ్ షాహీ సమాధులు, లుంబినీపార్క్‌లలో వారి విధులను పర్యవేక్షించడం జరిగిందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న టూరిస్టు పోలీసులను యాదగిరిగుట్ట, కీసర దేవాలయం, సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, అనంతగిరిహిల్స్, అనంత పద్మనాభ స్వామి దేవాలయం, కోటపల్లి రాజర్వాయర్, భద్రాచలం, కిన్నెరసాని డ్యామ్, రామప్పదేవాలయం, సమ్మక్కసారక్క దేవాలయం, బుద్ధవనం, అమ్రాబాద్, సోమశిల దేవాలయంతో పాటు పలు పర్యాటక ప్రదేశాలలో నియమిస్తామని తెలిపారు. కీలక పాత్ర పోషించనున్నారని వల్లూరు క్రాంతి తెలిపారు.


## నాలుగురోజుల పాటు వర్షాలు

**వివిధ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ మేరకు వివిధ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.శనివారం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురియగా, ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో, సోమవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. మంగళవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

## గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై హరీష్‌రావువి పచ్చి అబద్ధాలు : కాంగ్రెస్ నేతలు

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గల్ఫ్ కార్మికుల సంక్షేమ కార్యక్రమాలపై మాజీ మంత్రి టి హరీష్‌రావు మాటాలన్ని పచ్చి అబద్దాలని రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. గాంధీ భవన్ లో శనివారం ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్, అంబాసిడర్ డా. బిఎం వినోద్ కుమార్ , కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, కమిటీ సభ్యులు నంగి దేవేందర్ రెడ్డి, చెన్నమనేని శ్రీనివాస రావులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 10 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో రెండువేల మంది తెలంగాణ కార్మికులు గల్ఫ్ దేశాలలో చనిపోతే వారికి ఎక్స్ గ్రేషియా ఇవ్వలేదని అనిల్ అన్నారు. గల్ఫ్ కార్మికుల పాలిట కెసిఆర్ ఒక నరరూప రాక్షసుడైతే, కెటిఆర్, కవిత, హరీష్ చిన్న రాక్షసులని ఆయన పేర్కొన్నారు ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్, అంబాసిడర్ డా. బిఎం వినోద్ కుమార్ మాట్లాడుతూ ఆర్థిక మంత్రిగా పనిచేసిన హరీష్ రావు, గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఒక్క రూపాయి కేటాయించలేదని ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని మాట్లాడుతున్నాడని ప్రశ్నించారు. బొగ్గుబాయి బొంబాయి దుబాయి అనే నినాదంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో... వలస కార్మికులను రెచ్చగొట్టి వాడుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని వదిలేసి, నట్టేట ముంచిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీదని కమిటీ సభ్యులు చెన్నమనేని శ్రీనివాస రావు విమర్శించారు. . గల్ఫ్ కార్మికులకు ఎన్నో హామీలు ఇచ్చిన కెసిఆర్, కెటిఆర్, కవిత తో పాటు ఆర్థిక మంత్రులుగా పనిచేసిన ఈటెల రాజేందర్, తన్నీరు హరీష్ రావు, లు మాట తప్పారని, ఈ 5గురు 'గల్ఫ్ ద్రోహులు' గా చరిత్రలో నిలిచిపోయారని నంగి దేవేందర్ రెడ్డి అన్నారు. ఈ అన్నారు. వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి మాట్లాడుతూ హరీష్ రావు గల్ఫ్ కార్మికులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఐఇడి పేలడంతో కోబ్రా కమాండోకు గాయాలు

**బీజాపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో శనివారం నక్సలైట్లు అమర్చిన ఐఇడి పేలడంతో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ కోబ్రా యూనిట్‌కు చెందిన ఒక కమాండో గాయపడ్డాడని పోలీసులు తెలిపారు. ఉసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పూజారి కాంకేర్ క్యాంప్ నుండి 206వ బెటాలియన్ కోబ్రా బృందం ప్రాంత ఆధిపత్య ఆపరేషన్‌కు బయలుదేరినప్పుడు ఈ పేలుడు సంభవించిందని ఒక అధికారి తెలిపారు. పెట్రోలింగ్ బృందం అడవిని చుట్టుముడుతుండగా, ఒక జవాన్ అనుకోకుండా ఐఇడిని తాకాడని, దీని వలన అతనికి స్వల్ప గాయాలయ్యాయన్నారు. గాయపడిన కమాండోను వైద్య కేంద్రానికి తరలించామని, పరిస్థితి ప్రమాదకరంగా ఉందన్నారు. బీజాపూర్‌తో సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ ప్రాంతంలోని అంతర్గత ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేస్తున్న భద్రతాసిబ్బందిని లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు అడవుల్లోని రోడ్లు,మట్టి పట్టాలవెంట ఐఇడిలను అమర్చుతారు. గతంలో ఇటువంటి ఉచ్చులకు పౌరులు బలైపోయారు. గురువారం గంగలూర్‌ప్రాంతంలో జరిగిన ఇలాంటి పేలుడులో ఒక బాలుడు గాయపడ్డాడు.

### డిజిటల్ యుగంలోనూ...
# ఆడపిల్లలు దుర్భలత్వాన్ని ఎదుర్కోవడమా ?

**భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ ఆవేదన**

**సుప్రీంకోర్టు ప్రాంగణంలో 'జువైనల్ జస్టిస్ కమిటీ' నిర్వహించిన కార్యక్రమంలో కీలక ప్రసంగం**



**న్యూఢిల్లీ :** ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ బెదిరింపులు, డిజిటల్ స్టాకింగ్‌తోపాటు వ్యక్తిగత డేటా, డీప్ ఫేక్ చిత్రాల దుర్వినియోగం కారణంగా డిజిటల్ యుగంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న దుర్భలత్వాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) ఎత్తిచూపారు. ప్రత్యేక చట్టాలు రూపొందించాలని, చట్టం అమలుచేసేవారికి, నిర్ణయాధికారులకు శిక్షణ ఇవ్వాలని పిలుపునిచ్చారు. భారత సుప్రీంకోర్టు, యునిసెఫ్‌తో కలిసి పనిచేస్తున్న జువెనైల్ జస్టిస్ కమిటీ (జెజెసి) ఆధ్వర్యంలో 'బాలికలకు పటిష్ఠ రక్షణ : భారతదేశంలో ఆమెకు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణం కల్పించడం'అనే అంశంపై శనివారం జరిగిన జాతీయ వార్షిక వాటాదారుల సంప్రదింపుల కార్యక్రమంలో సిజెఐ గవాయ్ మాట్లాడుతూ ఆందోళన వ్యక్తంచేశారు. రాజ్యాంగ, చట్టపరమైన హామీలు ఉన్నప్పటికీ దేశవ్యాప్తంగా ప్రజలు తమ ప్రాథమిక అవసరాలను, మనుగడ కోసం ప్రాథమిక అవసరాలను కూడా విషాదంగా తిరస్కరించడం కొనసాగుతోందని, ఈ దుర్బలత్వం లైంగిక వేధింపులు, దోపిడీ, స్త్రీ జననేంద్రియ విచ్ఛేదన, పోషకాహార లోపం, లైంగిక గర్భస్రావాలు, అక్రమ రవాణా, వారి ఇష్టానికి వ్యతిరేకంగా బాల్య వివాహాలు వంటి ఆచారాల వంటి అసమానమైన ప్రమాదాలకు దారితీస్తుందని సిజెఐ అన్నారు. 'ఆమె భద్రతను కాపాడుకోవడం అంటే ఆమె శరీరాన్ని రక్షించుకోవడం, ఆమె ఆత్మను విడిపించుకోవడం మాత్రమే కాదు. ఆమె తన తల గౌరవాన్ని నిలుపుకోగలిగే సమాజాన్ని సృష్టించడం. అంటే లోతుగా పాతుకుపోయిన పితృస్వామ్య సంస్కృతి బాలికలకు సరైన స్థానాన్ని నిరాకరిస్తూనే ఉంది. దీనిని మనం ఎదుర్కోవాలి, అధిగమించాలి' అని భారత ప్రధాన న్యాయమూర్తి గవాయ్ అన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన 'వేర్ ది విథౌట్ ఫియర్'' కవితను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ ఆడపిల్లలను రక్షించడంలో సాధించాల్సిన ప్రయత్నం యొక్క సారాంశాన్ని ఇది గ్రహిస్తుందని గవాయ్ చెప్పారు. 'ఏదైనా బాలిక దేశం, వివక్షత, భయంతో లేదా నేర్చుకునే, కలలు కనే అవకాశం నిరాకరించబడినంత కాలం భయంతో జీవించినంత కాలం ఆ దృక్పథం అసంపూర్ణంగా ఉంటుంది' అని ఆయన అన్నారు. ప్రతీ ఆడపిల్ల స్వేచ్ఛ, గౌరవప్రదమైన వాతావరణంలో పెరుగుతుందని ఆయన చెప్పారు. దేశం స్వేచ్ఛా స్వర్గంలోకి మేల్కొన్న సంప్రదాయంతో రవీంద్రనాథ్ ఠాగూర్ చాలా అందంగా మాట్లాడాడు అని గుర్తుచేశారు. బాలికల జీవితాలకు ఆటంకం కలిగిస్తున్న సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అడ్డంకులను లోతుగా పరిశీలించాలని ప్రధాన న్యాయమూర్తి గవాయ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. యునిసెఫ్ ఇండియా దేశ ప్రతినిధి, కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి, సింథియా మెక్‌కాఫ్రీ సమక్షంలో బి.ఆర్.గవాయ్ ప్రసంగిస్తూ యువతులు ఎదుర్కొంటున్న ముప్పులు ఇకపై విశాలమైన, తరచుగా నియంత్రించబడని డిజిటల్ ప్రపంచంలో విస్తరించి ఉన్న భౌతిక ప్రదేశాలకే పరిమితం కాదని సిజెఐ తెలిపారు. లైంగిక దోపిడీ, డిజిటల్ అక్రమ రవాణా, సైబర్ వేధింపులను పరిష్కరించే చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడం, విద్య, అవగాహన కార్యక్రమాలతో రూపొందించాలని సిజెఐ ఎత్తిచూపారు. 'నేడు ఆడపిల్లను రక్షించడం అంటే ఆమె తరగతి గదులు, పని ప్రదేశాలు, ఆమె ఎదుర్కొనే ప్రతీ స్క్రీన్‌లోనూ భద్రత కల్పించడం' అని సుప్రీంకోర్టు ప్రాంగణంలో అధికసంఖ్యలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, బాలల హక్కుల కార్యకర్తలు, న్యాయవాదులు, ఇతరులు హాజరైన ఈ కార్యక్రమంలో గవాయ్ వివరించారు. భారతదేశంలోని ఒక యువతి తన పురుషుడు చేసే ఏపనినైనా స్వేచ్ఛగా కోరుకోగలిగితే, దానికి తగిన మద్దతు, వనరులను పొందగలిగితే ఆమె నిజంగా సమానమైన పౌరురాలిగా చెప్పబడుతుందని సుప్రీంకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ (జెజెసి) చైర్‌పర్సన్ జస్టిస్ బి.వి.నాగరత్న తెలిపారు. ఈ కార్యక్రమంలో జెజెసి సభ్యుడు జస్టిస్ జె.బి.పార్థివాలా తదితరులు ప్రసంగించారు.

## నాతో పాటు యావత్ దేశం అండ

**ఆత్మహత్య చేసుకున్న హర్యానా ఐపిఎస్ భార్యకు సోనియా లేఖ**

**న్యూఢిల్లీ :** హర్యానాలో ఆత్మహత్య చేసుకున్న ఐపిఎస్ అధికారి వై. పురాణ్ కుమార్ భార్యకు కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ లేఖ రాశారు. అధికారంలో ఉన్నవారి పక్షపాతపూరిత వైఖరి అత్యంత సీనియర్ అధికారులకు కూడా సామాజిక న్యాయాన్ని అందకుండా చేస్తుందని ఐపిఎస్ మరణం గుర్తుచేస్తుందని ఆమె అన్నారు. న్యాయం కోసం తనతో పాటు దేశంలోని లక్షలాది మంది ప్రజలు ఆమెతో ఉన్నారని పురాణ్ కుమార్ భార్య అమ్నీత్‌కు రాసిన లేఖలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియాగాంధీ పేర్కొన్నారు. 52 ఏళ్ల కుమార్, 2001 బ్యాచ్ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపిఎస్) అధికారి మంగళవారం చండీగఢ్ సెక్టార్ 11లోని తన నివాసంలో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సీనియర్ ఐఎఎస్ అధికారిణి అయిన ఆయన భార్య హర్యానా ప్రభుత్వ కమిషనర్ , కార్యదర్శి. కాగా, 'మీ భర్త విషాదకరమైన మరణ వార్త దిగ్భ్రాంతికరమైనది, తీవ్ర విచారకరమైనది. ఈ కష్ట సమయంలో మీకు, మీ మొత్తం కుటుంబానికి నా హృదయపూర్వక సంతాపం' అని సోనియాగాంధీ తన లేఖలో పేర్కొన్నారు. ఈ రోజు కూడా అధికారంలో ఉన్నవారి పక్షపాత వైఖరి అత్యంత సీనియర్ అధికారులకు కూడా సామాజిక న్యాయం అందకుండా చేస్తుందని పురాణ్ మరణం మనకు గుర్తు చేస్తుందన్నారు.

## మహిళా జర్నలిస్టును అనుమతించని అఫ్ఘాన్ విదేశీమంత్రి ఐజెయు తీవ్ర ఖండన

**హైదరాబాద్/చండీగఢ్:** న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన అఫ్ఘానిస్థాన్ విదేశాంగమంత్రి అమిర్ ఖాన్ ముత్తఖీ పత్రికాగోష్ఠిలో మహిళా జర్నలిస్టులు పాల్గొనకుండా మినహాయించడాన్ని ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజెయు) తీవ్రంగా ఖండిచింది. ఈ విషయంపై భారత ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఐజెయు అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి బల్విందర్ సింగ్ జమ్మూ ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యదేశంగా ఎంతో గర్వించే భారత్ సమానత్వం, సమాన న్యాయ విలువలను సమున్నతస్థానంలో నిలబెట్టి తీరాలని వారు పేర్కొన్నారు. తాలిబన్ ప్రభుత్వ వివక్షపూరిత విధానాలకు ప్రత్యేకించి భారతగడ్డపై తావివ్వడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని విమర్శించారు. సనాతన విలువలను నరనరానా జీర్ణించుకున్న తాలిబన్ కాలం చెల్లిన ఆలోచనలకు ఈ చర్య అద్దం పడుతోందని వారు విమర్శించారు.స్త్రీ,పురుషులకు సమాన హక్కుల భరోసా ఇచ్చిన రాజ్యాంగం అమలులో ఉన్న భారతగడ్డపై ఈ విధమైన వివక్షను పాటించడం భయంగొలుపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటన మహిళా జర్నలిస్టుల గౌరవ మర్యాదలను తగ్గించడమేకాకుండా, స్త్రీ పురుష సమానత్వం, పత్రికాస్వేచ్ఛలకు కట్టుబడిన భారతదేశం రాజీపడినట్టయిందని పేర్కొన్నారు. ఈ విధంగా స్త్రీలకు సమానత్వం లేకుండా కఠోరమైన వివక్ష పాటించడానికి వ్యతిరేకంగా భారత ప్రభుత్వం అనివార్యంగా బలమైన వైఖరి చేపట్టాలని, దౌత్యపరమైన వ్యవహారాలలో కూడా మహిళలకు గౌరవం, రక్షణ కల్పించే హక్కులకు భరోసా ఇవ్వాలని శ్రీనివాసరెడ్డి, బల్విందర్ సింగ్ జమ్మూ కోరారు.

# మహిళలకు అవమానం

**అఫ్ఘాన్ విదేశాంగమంత్రి అమిర్‌ఖాన్ ముత్తాఖీ మీడియా సమావేశానికి మహిళా జర్నలిస్టులను అనుమతించకపోవడంపై ప్రతిపక్షాలు తీవ్ర మండిపాటు**



**న్యూఢిల్లీ :** అఫ్ఘాన్ విదేశాంగమంత్రి అమిర్‌ఖాన్ ముత్తాఖీ ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో పెద్ద విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ సమావేశంలో ఉద్దేశపూర్వకంగానే మహిళలు పాల్గొనకుండా నిషేధం విధించారంటూ ప్రతిపక్ష నేతలు కేంద్రంపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ చర్య ఆమోదయోగ్యం కాదని, మహిళలను అవమానించడమేనని కాంగ్రెస్ అభివర్ణించింది. ఇలాంటి వివక్షతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వహించడం నారీ శక్తిపై ఆయన నినాదాల 'శూన్యతను' బహిర్గతం చేస్తుందని పేర్కొంది. ప్రధాని మోదీ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. అమిర్‌ఖాన్ ముత్తాఖీ నిర్వహించిన మీడియా సమావేశానికి మహిళా జర్నలిస్టులను అనుమతించకపోవడం ప్రధాని దేశంలోని ప్రతి మహిళ తరుపున నిలబడడానికి తాను బలహీనుడినని చెప్పకపోనే చెబుతున్నారనిఎద్దేవా చేశారు. అయితే ఇలాంటి వివక్షతపై మోదీ మౌనం నారీ శక్తిపై ఆయన నినాదాల 'శూన్యతను' బహిర్గతం చేస్తుందని కూడా గాంధీ అన్నారు. మన దేశంలో, మహిళలకు ప్రతి రంగంలోనూ సమాన భాగస్వామ్య హక్కు ఉందని, అటువంటి వివక్షను ఎదుర్కొన్నప్పుడు మీరు మౌనం వహించడం నారీ శక్తిపై మీ నినాదాల శూన్యతను బయటపెడుతుందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత ఎక్స్‌లో పోస్టు చేశారు. న్యూఢిల్లీలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా భారతదేశంలో మహిళా జర్నలిస్టులపై (తాలి) నిషేధం. భారత ప్రభుత్వం దీనికి అంగీకరించడం దిగ్భ్రాంతికరమైనది, ఆమోదయోగ్యం కాదు అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ముత్తాఖీ విలేకరుల సమావేశంలో మహిళా జర్నలిస్టులు లేకపోవడంపై మోదీ తన వైఖరిని స్పష్టం చేయాలని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు. ఈ ఘటనను భారతదేశంలోని అత్యంత సమర్థులైన కొంతమంది మహిళలకు అవమానంగా అభివర్ణించారు. మాజీ హోంమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చిదంబరం మాట్లాడుతూ, ముత్తాకి ప్రసంగించిన విలేకరుల సమావేశంలో మహిళా జర్నలిస్టులను మినహాయించడం షాక్ ఇచ్చిందన్నారు. తన వ్యక్తిగత అభిప్రాయం మేరకు పురుష జర్నలిస్టులు తమమహిళా సహోద్యోగులను మినహాయించారని (లేదా ఆహ్వానించబడలేదని) తెలిసిన వెంటనే వారు మీడియా సమావేశాన్ని వాకౌట్ చేసి ఉండాలని అన్నారు.

**బంగారు తరుగు కేసులో**

## 9మంది అధికారులపై చర్యలు

**టిడిబి అధ్యక్షుడు పిఎస్ ప్రశాంత్**

**పతానంతిట్ట :** కేరళలోని శబరిమల ఆలయంలో బంగారం తరుగు కేసు దర్యాప్తులో బోర్డు విజిలెన్స్ విభాగం లోపాలను ఎత్తిచూపిన తొమ్మిది మంది అధికారులపై చర్యలు తీసుకుంటామని టిడిబి అధ్యక్షుడు పిఎస్ ప్రశాంత్ శనివారం తెలిపారు. డిప్యూటీ దేవస్వం కమిషనర్ (హరిపాద్) బి మురారి బాబుపై ఇప్పటికే చర్యలు ప్రారంభించినట్లు ప్రశాంత్ విలేకరులతో అన్నారు. 'విజిలెన్స్ తొమ్మిది మంది అధికారుల లోపాలను గుర్తించింది. ఇప్పటికే బాబుపై చర్య తీసుకున్నాము. మిగిలిన అధికారులపై చర్యను 14న జరిగే బోర్డు సమావేశంలో నిర్ణయిస్తాము' అని ఆయన అన్నారు. చర్యలు ఎదుర్కొనే అవకాశం ఉన్న వారిలో ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు కార్యదర్శి జయశ్రీ, కార్యనిర్వాహక అధికారి సుధీష్, పరిపాలనా అధికారి శ్రీకుమార్, మాజీ తిరువాభరణం కమిషనర్ కెఎస్ బైజు ఉన్నారు. 'బైజు స్థానంలో వచ్చిన అధికారికి బంగారం బరువు తగ్గడం గురించి తెలుసు కానీ దానిని నివేదించడంలో విఫలమయ్యారు' అని ప్రశాంత్ అన్నారు. 2019 బోర్డు ఉత్తర్వు ప్రకారం ద్వారపాలక ప్లేట్లను తిరువాభరణం కమిషనర్ పర్యవేక్షణలో అప్పగించాలని, బాధ్యత, స్పాన్సర్‌షిప్‌ను ఉన్నికృష్ణన్ పొట్టికి అప్పగించాలని ఆదేశించింది. అయితే, బంగారు ప్లేట్‌లను పొట్టికి అప్పగించవచ్చని బోర్డు నిర్ణయాన్ని టిడిబి కార్యదర్శి జయశ్రీ ఎగ్జిక్యూటివ్ అధికారి, కమిషనర్‌కు తెలియజేశారు. విధానపరమైన లోపాలు జరిగాయి అని ఆయన అన్నారు. రాజకీయ విమర్శలకు ప్రతిస్పందిస్తూ, కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు విడి సతీశన్ బాధ్యతాయుతమైన ప్రకటనలు చేయాలని ప్రశాంత్ అన్నారు. ప్రస్తుత బోర్డుకు ఈ సమస్యతో సంబంధం లేదని స్పష్టంగా ఉందని, అలాంటప్పుడు తమపై ఎందుకు ఆరోపణలు వస్తున్నాయని ప్రశ్నించారు. శబరిమల తీర్థయాత్ర సీజన్‌కు సన్నాహాలు జరుగుతున్నాయని, ఈ సంవత్సరం దాదాపు 60 లక్షల మంది భక్తులు వస్తారని ప్రశాంత్ అన్నారు. ఇటువంటి ఆరోపణలు శబరిమల సీజన్‌ను నిర్వహించడానికి పనిచేస్తున్న తమపై మాత్రమే ప్రభావం చూపుతాయన్నారు.

## రామేశ్వరం మత్స్యకారుల ధర్నా

**రామేశ్వరం :** శ్రీలంక నావికాదళం 47 మంది మత్స్యకారులను అరెస్టు చేసి, పడవలను స్వాధీనం చేసుకోవడాన్ని ఖండిస్తూ శనివారం తమిళనాడులోని రామేశ్వరం జిల్లాకు చెందిన మత్స్యకారులు సమ్మెకు దిగారు. మత్స్యకారుల విడుదల కోసం తమిళనాడు ప్రభుత్వం కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరిన నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. మత్స్యకారులు హార్బర్ సమీపంలో సమ్మె చేసినట్లు రామేశ్వరం టౌన్ పోలీస్ స్టేషన్ అధికారి ఒకరు పిటిఐకి తెలిపారు. శ్రీలంక నావికాదళం అరెస్టు చేసిన 47 మంది మత్స్యకారులను త్వరగా విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ అక్టోబర్ 9న విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌ను కోరారు. ఈనెల 9 నాటికి, తమిళనాడుకు చెందిన మొత్తం 242 ఫిషింగ్ బోట్లు, 74 మంది మత్స్యకారులు శ్రీలంక కస్టడీలో ఉన్నారని ముఖ్యమంత్రి లేఖలో తెలిపారు. సమ్మె దృష్ట్యా దాదాపు 400–450 పడవలు చేపలు పట్టడానికి సముద్రంలోకి వెళ్లలేదని ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న ఆల్ మెకనైజ్డ్ బోట్ ఫిషర్మెన్స్ అసోసియేషన్ పేర్కొంది. అసోసియేషన్‌లో నమోదైన మొత్తం 650 ఫిషింగ్ బోట్లలో దాదాపు 200 ఫిషింగ్‌కు వెళ్లాయని అసోసియేషన్ అధ్యక్షుడు జేసు రాజా తెలిపారు. తాము మంగళవారం వరకు నిరసన కొనసాగిస్తామని, అప్పటి వరకు దాదాపు 400–450 బోట్లు ఫిషింగ్‌కు వెళ్లవన్నారు. బుధవారం (అక్టోబర్ 15), తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తామని ఆయన పిటిఐకి తెలిపారు. పావళితో సహా రానున్న పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈనెల 15 వరకు నిరసనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు రాజా తెలిపారు. శనివారం నుండి మత్స్యకారులు నిరవధిక సమ్మెకు దిగుతారని నివేదికలు వెలువడ్డాయి. ఈ అంశంపై కేంద్రం దృష్టిని ఆకర్షించడానికి అసోసియేషన్ సభ్యులు, మత్స్యకారుల కుటుంబాలు, అంతకుముందు రోజు, హార్బర్ సమీపంలో నిరసనలు నిర్వహించారు. శ్రీలంక నావికాదళం వారి ఫిషింగ్ బోట్లతో పాటు మత్స్యకారులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

### వరి, గోధుమ పంటలపైనే కాకుండా...
# రైతులు పప్పు ధాన్యాల సాగునూ మరింత పెంచాలి

**ప్రధాని మోదీ పిలుపు**

**రూ.35,440 కోట్లతో రెండు ప్రధాన వ్యవసాయ పథకాలు ప్రారంభం**

**గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శనాస్త్రాలు**



**న్యూఢిల్లీ :** ఇతర దేశాల దిగుమతులపై భారతదేశం ఆధారపడకుండా ఉండాలంటే, రైతులు కేవలం వరి, గోధుమ పంటలకే పరిమితం కాకుండా ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును కూడా మరింత అధికం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. శనివారం ప్రధాని మోదీ రూ.35, 440 కోట్ల వ్యయంతో కూడిన రెండు ప్రధాన వ్యవసాయ పథకాలను ఇక్కడ ప్రారంభించారు. సంఘ సంస్కర్తలు జయప్రకాశ్ నారాయణ్, నానాజీ దేశ్‌ముఖ్ జయంతి సందర్భంగా 'పూసా క్యాంపస్'లో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం (వీక్షిత్ భారత్)ను సాకారం చేసుకోవడంలో రైతులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అరగంట సేపు సాగిన తన ప్రసంగంలో మోదీ ప్రభుత్వానికి, గత కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వానికి మధ్య ఉన్న తారతమ్యాన్ని వివరిస్తూ విమర్శలతో విరుచుకుపడ్డారు. గతంలో ఓ పార్టీ నిర్లక్ష్యం వల్ల వ్యవసాయ, పర్యావరణ వ్యవస్థ బలహీనపడటానికి దారితీసిందని దుయ్యబట్టారు. ఫలితంగా వివిధ విభాగాలు సమన్వయం లేకుండా బహుళ దిశల్లో పనిచేస్తున్నాయని ధ్వజమెత్తారు. రూ.24,000 కోట్లతో 'ప్రధాన్ మంత్రి ధన్ ధాన్య కృషి యోజన'(పిఎండిడికెవై), రూ.11,440 కోట్ల వ్యయంతో 'మిషన్ ఫర్ ఆత్మనిర్భరత ఇన్ పల్సెస్'ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈ పథకాలు లక్షలాది మంది రైతుల దుస్థితిని మారుస్తాయని పేర్కొన్నారు. ఈ రెండు పథకాలను ఇప్పటికే కేబినెట్ ఆమోదించింది. వీటిని రాబోయే రబీ (చలికాలం) నుండి 2030–2031వరకు అమలు చేయనున్నట్లు చెప్పారు. వ్యవసాయం, పశు సంవర్ధకం, మత్స్య సంపద, ఆహార ప్రక్రియ రంగాలకు చెందిన ప్రాజెక్ట్‌లను ప్రారంభించిన ప్రధానమంత్రి మోదీ కోట్లాది రూపాయల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. స్వాతంత్ర్యానంతరం మీరు (రైతులు) భారతదేశాన్ని స్వావలంభన దేశంగా తయారుచేశారు. ఇప్పుడు భారతదేశాన్ని ఒక అభివృద్ధి చెందిన దేశంగా (వీక్షిత్ భారత్) మార్చడంలో రైతులది కీలక పాత్ర అన్నారు. 'ఒకవైపు మనం స్వయం సమృద్ధి ( ఆహారంలో) సాధిస్తూ మరోవైపు ప్రపంచ మార్కెట్ కోసం ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మిత్రులారా, మనం అంతర్జాతీయ మార్కెట్ తలుపులు తట్టాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. ప్రపంచ డిమాండ్ ఉన్నటువంటి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని ఆయన రైతులను అభ్యర్థించారు. 'మనం మన దిగుమతులను తగ్గించుకోగలగాలి. అయితే అదే సమయంలో ఎగుమతులను పెంచడం పడిపోకుండా కూడా చూసుకోవాలి' అని మోదీ చెప్పారు. ఈ రెండు కొత్త పథకాలు ఈ జంట లక్ష్యాలను సాధించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని అన్నారు. రైతులు వరి, గోధుమ పంటలకే పరిమితం కాకుండా ప్రొటీన్ అధికంగా లభించే పప్పుధాన్యాలపై దృష్టి సారించి వాటిని వైవిధ్యపరచాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే పప్పుధాన్యాల అతిపెద్ద ఉత్పత్తిదారు, వినియోగదారు అయినప్పటికీ భారతదేశం ఇప్పటికీ దిగుమతులపై ఆధారపడి ఉంటోంది. పప్పు ధాన్యాల మిషన్ కింద ఉత్పత్తిని పెంచడానికి, స్వయం సమృద్ధి సాధించడానికి 2030 నాటికి పప్పుధాన్యాల విస్తీర్ణం 35లక్షల హెక్టార్లకు పెంచాల్సిన అవసరం ఉందని మోదీ అన్నారు. 2030–31 నాటికి 25238లక్షల టన్నుల క్యూబిక్ మీటర్ల నుండి 350లక్షలటన్నులకు పెంచడం ఈ మిషన్ లక్ష్యం. తద్వారా పంటపై ఆధారపడటాన్ని తగ్గించడం దీని లక్ష్యం. ప్రభుత్వ ఆకాంక్ష జిల్లాల కార్యక్రమాన్ని అనుసరించి రూపొందించిన పిఎండిడికెవై, తక్కువ పనితీరు కనబరిచిన 100వ్యవసాయ జిల్లాలను లక్ష్యంగా చేసుకుంటుందని, వివిధ మంత్రిత్వ శాఖల నుండి 36 పథకాలను ఏకీకృతం చేస్తుందని మోదీ అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేశారని, ఈ కీలకమైన రంగం వృద్ధికి ప్రతిపక్ష పార్టీకి దృక్పథం లేదని మోదీ ఆరోపించారు. తన ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ఎగుమతులు రెట్టింపు అయ్యాయని మోదీ చెప్పారు. ఆహార ధాన్యాల ఉత్పత్తి 900 లక్షల టన్నులు పెరిగిందని, పండ్లు, కూరగాయల ఉత్పత్తి 640 లక్షల టన్నులు పెరిగిందని ప్రధానమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగామోదీ రైతులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, వ్యవసాయ శాఖ సహాయమంత్రి భగీరథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

**ఒడిశాలో రూ.160 కోట్ల విలువైన రెండు ఫిషరీ ప్రాజెక్ట్‌లకు వర్చువల్ శంకుస్థాపనలు**

దేశ రాజధాని ఢిల్లీలో శనివారం రూ.24,000 కోట్లతో ప్రధానమంత్రి ధన్ ధాన్యయోజన (పిఎండిడికెవై), రూ.11,440 కోట్లతో పప్పు ధాన్యాల మిషన్‌ను ప్రారంభించిన ప్రధానమ ంత్రి నరేంద్ర మోదీ ఒడిశా రాష్ట్రం సంబల్‌పూర్ జిల్లాలోని బసంత్‌పూర్‌లో రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్‌కు, భువనేశ్వర్‌లోని పండార వద్ద రూ.59.13 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఫిష్ మార్కెట్‌కు శంకుస్థాపనలు చేశారు. ముఖ్యమంత్రి చరణ్ మాఝీ, ఆయన డిప్యూటీ కె.వి.సింగ్ దేవ్, ఇతరులతో కలిసి ఇక్కడి ఒయుఎటి ప్రాంగణం నుండి వర్చువల్‌గా ఒక రాష్ట్రస్థాయి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పిఎంఎంఎస్‌వై) కింద చేపడుతోన్నఈఫిష్‌మార్కెట్‌ప్రాజెక్ట్ అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది అని ముఖ్యమంత్రి చరణ్ మాఝీ అన్నారు. మొత్తం రూ.59.13 కోట్ల వ్యయంలో కేంద్ర ప్రభుత్వం రూ.30కోట్లు ఇస్తున్నదని, మిగతా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించనుందని సిఎం మాఝీ చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వ మత్స్య ,జంతువనరుల విభాగం మరియు భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్తఆధ్వర్యంలోఈ ప్రాజెక్ట్‌ను అమలు చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా 143 మంది ట్రేడర్లకు ప్రత్యక్షంగా, 2,000మందికి పైగా ప్రజలకు పరోక్షంగా ప్రయోజనం కలుగనుందని చెప్పారు.

# నా భవితవ్యం నాకు తెలుసు

**సిఎం కుర్చీ కోసం తొందరపడడం లేదు : డికె**

**బెంగళూరు :** గత కొంతకాలంగా కర్నాటకలో సిఎం మార్పుపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. పలు మార్లు సిద్ధరామయ్య స్థానంలో డికె శివకుమార్‌కు బిఎం బాధ్యతలు అప్పగిస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగిన విషయం విదితమే. తాజాగా ముఖ్యమంత్రి పదవిపై డిప్యూటీ సిఎం డికె శివకుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఏం తొందరపడడం లేదని.. తన భవితవ్యం తనకు తెలుసునన్నారు. పలు మీడియా నివేదికలు వాస్తవాలను వక్రీకరిస్తున్నాయని, రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. కర్నాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వం నవంబర్‌లో రెండున్నరేళ్ల పాలన పూర్తి చేసుకోబోతున్నది. తాజాగా రాష్ట్ర రాజకీయాల్లో మార్పులు రాబోతున్నాయని మరోసారి ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో డికె శివకుమార్ స్పందించారు. 'కొందరు సిఎం కావాలనే కోరికను వ్యక్తం చేశారు. సమయం దగ్గర పడుతోందని చెప్పారు అంతే. దాన్ని వక్రీకరించి నేను సిఎం అయ్యే సమయం దగ్గరపడుతోందని చెప్పానని మీడియాలో చూపించకండి. నాకు తొందర లేదు' అని వ్యాఖ్యానించారు. ఓ కార్యక్రమంలో డికె శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ, తాను రాజకీయాలు చేసేందుకు ఇక్కడకు రాలేదన్నారు. మీడియా తప్పుడు, సంచలనాత్మక వార్తలను ప్రచారం చేస్తే భవిష్యత్‌లో మీకు మద్దతు ఇవ్వను.. ఎలాంటి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించనని.. పిలవకుండా రాజకీయాలు ఎలా చేయాలో తనకు తెలుసునన్నారు. తాను సిఎం అయ్యే సమయం ఆసన్నమైందని చెప్పినట్లుగా మీడియాకు ఎవరు చెబుతున్నారని..? నేను అలా ఎప్పుడు చెప్పానని ప్రశ్నించారు. తనకు అలా చెప్పాల్సిన అవసరం లేదని.. తన గమ్యం ఏమిటో తనకు తెలుసునన్నారు. దేవుడు నాకు ఏ అవకాశం ఇచ్చాడో.. ఆ అవకాశం ఇప్పుడు ఇస్తాడో తనకు తెలుసునన్నారు. రాష్ట్ర ప్రజలకు సేవ చేయాలని, బెంగళూరు ప్రజలకు మంచి పాలన అందించాలని తాను కోరుకుంటున్నానన్నారు. ఆ ఉద్దేశంతోనే తాను తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే.. తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తే మీడియాపై పరువు నష్టం కేసు వేస్తానని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది చివరలో మరోసారి సిఎం మార్పు తథ్యమని కొంత కాలంగా వార్తలు ఊహాగానాలున్నాయి. అయితే, తానే ఐదేళ్లు సిఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. 2023 మే నెలలో కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో సిఎం పదవి కోసం సిద్ధరామయ్య, డికె శివకుమార్ మధ్య పోటీ నెలకొన్న విషయం తెలిసిందే. పార్టీ హైకమాండ్ మంతనాలతో డికె వెనక్కి తగ్గారు.

## బిహార్‌లో 100 సీట్లలో ఎఐఎంఐఎం పోటీ!

**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుకు 'ఇండియా' కూటమి ఎటూ తేల్చిచెప్పకపోవడంతో అసదుద్దీన్ ఒవైసీ సారథ్యంలోని ఎఐఎంఎంఐ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో బిహార్‌లో 20 సీట్లలోపే పోటీ చేస్తూ వచ్చిన ఆ పార్టీ ఇప్పుడు 100 సీట్లలో పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ, కాంగ్రెస్–ఆర్‌జెడికూటములకుప్రత్యామ్నాయంగా తృతీయ రాజకీయ శక్తిగా ఎదిగేందుకు తాము సిద్ధమవుతున్నట్లుఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమామ్ తెలిపారు. పొత్తుల కోసం లాలూ ప్రసాద్ యాదవ్(ఆర్‌జెడి అధ్యక్షుడు), తేజస్వి యాదవ్‌కు తాము లేఖ రాశామని, అయితే ఎలాంటి స్పందన రాలేదని అఖ్తరుల్ తెలిపారు. దీంతో తమ పార్టీ ఉనికికి మరింత విస్తరించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, భావసారూప్యత కలిగిన పార్టీలతో తృతీయ ఫ్రంట్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని చెప్పారు.




## పసిడి మెరుపులు!



బంగారం ధరల పరుగులకు సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు. రకరాల ఆచారాలు, సంప్రదాయాలు, మత విశ్వాసాలు బంగారానికి నిరంతర డిమాండ్‌ను కల్పిస్తునే ఉన్నాయి. తదనుగుణంగానే ధరలు పెరుగుతున్నాయి. 1965లో భారతదేశంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర కేవలం రూ.63గా ఉంది. కేవలం రూ.63కి అమ్ముడైన 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర నేడు రూ. 1,24,000. దీనిని బట్టి, గత ఆరు దశాబ్దాల కాలంలో బంగారం ధరలు ఏ విధంగా దూసుకెళ్లాయో ఊహించుకోవచ్చు. 1979లో మధ్యప్రాచ్యంలో ఘర్షణలు ఒక్కసారిగా పెరిగాయి. ఇరాన్ విప్లవం తర్వాత మధ్యప్రాచ్యంలో ఏర్పడిన అస్థిరత బంగారం ధరను పెంచింది. ఆ సమయంలో, భారతదేశంలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.937కి అమ్ముడైంది. ఆ తరువాత 1987లో ప్రపంచ స్టాక్ మార్కెట్ భారీ క్షీణతను చవిచూసింది. బంగారం ధర గరిష్ట స్థాయికి చేరుకుని రూ.2570కి పెరిగింది. ఇక 2008లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మళ్లీ కుప్పకూలింది. దీంతో బంగారం ధర రూ.12,500 గరిష్ట స్థాయికి చేరుకుంది. ఇక 2012లో యూరోపియన్ బాండ్ రుణ సమస్య ప్రారంభమైంది. ఆ సమయంలో భారతదేశంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 31,000 రూపాయల గరిష్ట స్థాయికి చేరుకుంది. ఇక 2019లో మధ్యప్రాచ్యంలో యుద్ధం గరిష్ట స్థాయికి చేరుకుంది. ఆ సమయంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అస్థిరత, యుద్ధ ఉద్రిక్తతలు బంగారం ధరను 10 గ్రాములకు 35,220 రూపాయలకు పెంచాయి. 2020లో కరోనా మహమ్మారి సమయంలో అన్ని పరిశ్రమలు స్తంభించిపోయాయి. దీని కారణంగా, భారతదేశంలో బంగారం ధర రూ.48,651కి పెరిగింది. ప్రస్తుతం, బంగారం ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిలో ఉంది. కాగా, భూమి నుండి ఇప్పటి వరకు 1,87,200 టన్నుల బంగారాన్ని వెలికితీసినట్లు ప్రపంచ బంగారు మండలి చెబుతోంది. ప్రతి దేశం తమ బంగారు నిల్వలను పెంచుకోవడాన్ని తమ హోదాగా భావిస్తుంది. ప్రపంచ ఆర్థిక అస్థిరత కాలంలో బంగారం సురక్షితమైన ఆస్తి అనే మనస్తత్వమే సాధారణ కుటుంబాల నుండి పెద్ద దేశాల కేంద్ర బ్యాంకుల వరకు అందరూ బంగారాన్ని కొనుగోలు చేయడానికి కారణం.






## ఒకరి నిర్లక్ష్యం... మరొకరికి వరం..

ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారని, విధుల పట్ల సరైన శ్రద్ధ వహించరని విమర్శలు సహ జం. ఈ సమస్య కేవలం మన దేశంలో మాత్రమేకాదు.. ఎంతో అభివృద్ధి చెందిన అమెరికాలోనూ ఉంది. ఇప్పటికీ కోర్టులో నలుగుతున్న కేసు వివరాల ప్రకారం, అమెరికాలోని ఒహియో రాష్ట్రం, ట్రెంటన్ అనే పట్టణానికి చెందిన జేసన్ ఫాంట్లెరోయ్ అనే వ్యక్తి ఓ ఇంటిని నిర్మించుకోవడానికి స్థలాన్ని బట్లర్ కౌంటీ షరీఫ్ కార్యాలయంలో, 2021లో జరిగిన వేలంలో 5000డాలర్లకు కొన్నాడు. ఎక్కడ పొరపాటు జరిగిందో తెలీదుగానీ, అతని పేరుమీద కేవలం స్థలమేకాకుండా, అక్కడి రోడ్డును, ఐదు ఇళ్లను కూడా చేర్చేశారు. దీనితో బ్లూమ్‌ఫీల్డ్ కోర్ట్ రోడ్డుకు కూడా అతనే యజమాని అయ్యాడు. దీనితో ఆ రోడ్డు నిర్వహణ బాధ్యత కూడా జేసన్‌పై పడింది. విషయాన్ని గ్రహించిన నగర పాలక సంస్థ దీన్ని తిరిగి తీసుకోవాలని భావించింది, ఇందుకోసం నిబంధనల ద్వారా ప్రభుత్వ అవసరాల కోసం భూమిని స్వాధీనం చేసుకొనే 'ఎమినెంట్ డొమైన్' చర్య తీసుకుంది. అయితే, నగర పాలక సంస్థ కేవలం ఖాళీ స్థలానికే విలువ కట్టింది. మొత్తం రోడ్డు విలువను పట్టించుకోలేదు. ఈ చర్యపై జేసన్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఆ రోడ్డు, దానికి పక్కనే ఉన్న ఇళ్లు కూడా తనకు చెందినవేనని రికార్డుల్లో ఉన్నందున, తనకు చట్టప్రకారం ఎక్కువ పరిహారం చెల్లించాలని భీష్మించుకున్నాడు. చివరికి ఈ కేసు కోర్టుకెక్కింది. తీర్పుకోసం ఇరు వర్గాలు ఎదురుచూస్తున్నారు. అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో హక్కుల చట్టాలు ఒకే రీతిలో లేకపోవడంలో జరిగే ఊహించని విచిత్ర సంఘటనలు ఎలా ఉంటాయన్నది ఈ ఘటన నిరూపిస్తున్నది.

## అదృష్టం మీ చేతుల్లోనే..



అదృష్టం అనేది నిజంగానే ఉంటుం దా? ఒకవేళ ఉంటే, దానిని నిర్ధారించేది ఎవరు? ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీకి చెందిన భౌతిక శాస్త్రవేత్తలు చేసిన ప్రయోగాల్లో, లక్ అనేది యాదృచ్ఛికం కాదు.. అది మనిషి చేతుల్లోనే ఉంటుంది. వివరాల్లోకి వెళితే, శాస్త్రవేత్తలు ఎలక్ట్రాన్లపై ఒక ప్రయోగం చేశారు. పరిశీలకుడు ఏ ఫలితాన్ని ఆశిస్తున్నాడనే ఆలోచనను అనుసరించి, కణాల ప్రవర్తనలో మార్పు కనిపించింది. దీంతో ఒక పాత సిద్ధాంతం నిర్ధారణ అయింది. ఆశించటం అనేది స్వయంగా ఫలితాన్ని మారుస్తుంది. శాస్త్రవేత్తల పరిభాషలో దీనిని 'అబ్జర్వర్ కోహెరెన్స్ ఎఫెక్ట్' అని అంటారు. ఏదైనా అదృష్టం వరిస్తుందని గాఢంగా నమ్మినప్పుడు, మీ మెదడు వాస్తవాన్ని ఫిల్టర్ చేసి, ఇతరులు గమనించని అవకాశాలను మీ ముందు తెస్తుందని జ్యూరిక్‌లో జరిగిన పరిశోధన చెబుతోంది. తమ అదృష్టంపై విశ్వాసం ఉన్నవారు, ఇతరులతో పోలిస్తే మూడు రెట్లు ఎక్కువగా లాభపడతారని రుజువైంది. డబ్బు లేదా ఉద్యోగం లేదా వ్యాపార ఒప్పందాలు వంటి అనేక విజయాలు వారిని వరించినట్టు ఈ పరిశోధన పేర్కొంటున్నది. అంటే అదృష్టం మరెక్కడో లేదు.. అది మన చేతుల్లోనే ఉంది. అదృష్టం కోసం రకరకాల మూఢ నమ్మకాలను పెంచుకుంటున్న వారికి ఈ పరిశోధన ఓ పాఠం.

— బిఎస్ఎస్ మైత్రేయి

## అఫ్గానిస్థాన్‌తో పూర్తిస్థాయి దౌత్యం

కొద్ది సంవత్సరాల క్రితం ఊహించనిది ఇప్పుడు జరిగింది. అఫ్గానిస్థాన్ తాలిబన్ ప్రభుత్వ విదేశాంగమంత్రి అమీర్‌ఖాన్ ముత్తాఖీ 8 రోజులపాటు భారత్‌లో పర్యటనకై అక్టోబర్ 9న న్యూఢిల్లీ చేరుకున్నారు. ఇది భారత విదేశాంగ విధానంలో గుణాత్మక మలుపు. కాబూల్‌లో పూర్తిస్థాయి రాయబార కార్యాలయం(ఎంబెసీ) ఏర్పాటును భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ ముత్తాఖీతో చర్చల సందర్భంగా ప్రకటించారు. భారత్–తాలిబన్ సంబంధాల్లో ఇది మరొక మలుపు. భారత్‌కు కాబూల్‌లో దీర్ఘకాలంగా పూర్తిస్థాయి దౌత్యకార్యాలయం ఉంది. అమెరికా టెర్రరిజాన్ని ప్రపంచ సమస్యగా మార్చి, ఆ టెర్రరిజం మూలకేంద్రం అఫ్గానిస్థాన్‌లో ఉందని ప్రకటించి 2001లో సైనికంగా దురాక్రమణకు పాల్పడి తాలిబన్ 'టెర్రరిస్టు ప్రభుత్వాన్ని' కూలదోసింది. తొత్తు ప్రభుత్వాలను ముందుపెట్టి 20సంవత్సరాలపాటు సైనిక పాలన సాగించింది. చివరకు 2021లో చెప్పాపెట్టకుండా సైన్యాలు ఉపసంహరించుకుంది. అమెరికా మిత్రరాజ్యాల సైన్యాలు అంతకుముందే సొంతింటికి చేరుకున్నాయి. అమెరికన్‌ల నిష్క్రమణతో తాలిబన్‌లు అధికారం హస్తగతం చేసుకున్నారు. తాలిబాన్‌లు మతఛాందసులు, టెర్రరిస్టులు; తాలిబానిజం అంటే షరియత్ పాలన. ఆ ప్రకారమే వారు బాలికలను విద్యకు దూరం చేశారు. ఉన్నత విద్యాలయాల్లో ప్రవేశం నిషేధించారు. ఒక్కమాటలో చెప్పాలంటే స్త్రీ స్వేచ్ఛలను అణచివేశారు. 1999 లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసి 814 ను కాందహార్‌కు హైజాక్‌చేసి భారత జైలునుండి టెర్రరిస్టులను విడుదల చేయించుకున్నది తాలిబన్‌లేనని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. తాలిబన్‌లకు పాకిస్థాన్ ప్రభుత్వం నుంచి పూర్తి అండదండలున్నాయి. 2021 ఆగస్టులో తాలిబన్‌లు కాబూల్‌కు తిరిగివచ్చాక భారత్ ఆచితూచి వారితో సంబంధాలు నెరపుతున్నది. "భారత్, తాలిబన్ మధ్య చిత్తశుద్ధితో కూడిన అవగాహన అసాధ్యం. ఆ ఉద్యమంపై పాకిస్థాన్ ప్రభావం తాలిబన్‌తో భారత్ అర్థవంతమైన సంభాషణలకు మహా అవరోధం సృష్టిస్తున్నది" అని పాకిస్థాన్‌లో భారత రాయబారిగా పనిచేసిన విజయ్ కె.నంబియార్ అభిప్రాయపడ్డారు. అమెరికా సైన్యాలు ఉపసంహరించుకోగానే భారత ప్రభుత్వం కాబూల్ నుంచి తమ రాయబారిని వెనక్కు రప్పించి ఎంబెసీని మూసివేసింది. టెక్నికల్ మిషన్ మాత్రమే కొనసాగించింది. భారత్‌లోని తమ ఎంబెసీని భారత ప్రభుత్వం నుంచి సహకారం లేదన్న కారణంతో తాలిబన్ ప్రభుత్వం 2023 చివర్లో మూసివేసింది. అయినా దౌత్యాధికారుల మధ్య అడపాదడపా విదేశీగడ్డపై సంభాషణలు కొనసాగాయి. భారత్ 2021 సెప్టెంబర్‌లో అఫ్గానిస్థాన్ అంతటా అధికారం కలిగి ఉన్న సంస్థ గా తాలిబన్‌ను అధికారికంగా గుర్తించింది. తాలిబన్ ప్రభుత్వం, ఆఫ్ఘాన్ ప్రజలను వేరుచేసి చూస్తూ అన్ని ఆపత్కాలాల్లో మానవతా సహా యం అందజేస్తున్నది.

ప్రజాపక్షం 12-10-2025, ఆదివారం

అయితే ఇంత స్వల్పకాలంలోనే భారత్–తాలిబన్ ప్రభుత్వం మధ్య పూర్తిస్థాయి దౌత్యసంబంధాల పునరుద్ధరణ, ఇతర పలు ఒప్పందాలకు దారితీసిన పరిస్థితులేమిటి? నాటకీయంగా మారిపోయిన ప్రాంతీయ భౌగోళిక దృశ్యం ప్రధాన కారణం. తాలిబన్‌కు ప్రాథమిక మద్దతుదారుగా ఉండిన పాకిస్థాన్ ఇప్పుడు ప్రత్యర్థిగా మారింది. జై శంకర్ అన్నట్లు భారత్‌తోపాటు అఫ్గానిస్థాన్ కూడా పాకిస్థాన్ నుండి సీమాంతర టెర్రరిజానికి గురవుతున్నది. ముత్తాఖీ ఢిల్లీలో చర్చలు జరుపుతుండగానే కాబూల్‌లోపల రెండు బాంబు పేలుళ్లు జరిగాయి. అంతకుముందు పహల్గాంలో టెర్రరిస్టుల రాక్షసత్వాన్ని తాలిబన్ ప్రభుత్వం ఖండించింది. సొంత సమస్యల్లో సతమతమవుతున్న ఇరాన్ ప్రభావం అఫ్గానిస్థాన్‌పై తగ్గింది. రష్యా ఉక్రేన్‌తో యుద్ధంలో తలమునకలుగా ఉంది.

అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అఫ్గానిస్థాన్‌పట్ల ఇప్పుడు భిన్నమైన వైఖరితో ఉన్నాడు. కాగా చైనా పూర్తిస్థాయి దౌత్యసంబంధాలేర్పరుచుకుని అఫ్గానిస్థాన్ భవిష్యత్‌లో ప్రధాన సహాయకారి కావాలని చూస్తోంది. భారత ప్రభుత్వం అఫ్గానిస్థాన్ ప్రభుత్వ అంతర్గత విధానాలతో విభేదిస్తూ వెనకడుగువేస్తే, ఇన్నాళ్లూ పెట్టిన పెట్టుబడులు నిష్ఫలమవుతాయి, భద్రతా ప్రయోజనాలు కూడా ఇబ్బందుల్లో పడతాయి.

వాణిజ్యం పెంపుదలకు, మానవతా సహాయం అందించేందుకు ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవును వినియోగించుకోవాలని భారత్, అఫ్గాన్‌లు అంగీకరించటానికీ ప్రాధాన్యత ఉంది. ప్రపంచ పరిస్థితులు, ప్రాంతీయ సంబంధాల సందర్భంలో ఇరుదేశాల సంబంధాలు, సహకారానికి ప్రాధాన్యత ఉంది. తాలిబన్ ఒంటరితనం నుంచి బయటపడినపుడు దాని ప్రాపంచిక దృష్టిలోనూ మార్పు రావచ్చు. దాన్ని బయటనుంచి ఎవ్వరూ మార్చలేరు.

## పాఠ్యాంశాలు మార్చుకున్నంత మాత్రాన...

# సైన్సు, చరిత్ర మారవు!



డాక్టర్ దేవరాజు మహారాజు

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం పాఠశాల పాఠ్య గ్రంథాల నుంచి సైన్సు, చరిత్రకు సంబంధించి పలు అంశాలను తొలగించింది. నిజానికి అవి చాలాచాలా ముఖ్యమైన అంశాలు. జీవ పరిణామాన్ని విజ్ఞాన శాస్త్ర సిలబస్‌లో లేకుండా చేయడం – తాము నమ్మే సృష్టి సిద్ధాంతాన్ని రాబోయే తరాలు నమ్ముతూ ఉండాలనుకోవడం నేటి ఆరెస్సెస్ బిజెపి ప్రభుత్వ విధానం. అలాగే చరిత్ర పాఠ్య పుస్తకాల నుండి మొత్తానికి మొత్తంగా మొఘలుల పాలనా కాలాన్ని తొలగించడం– వారి విద్వేష పాలసీ విధానానికి అనుగుణంగా చేసిందే! టిప్పు సుల్తాన్ దేశభక్తిని మరుగుపరచడం కూడా అలాంటిదే! ముస్లింలు, మైనార్టీలు, దళితులంటే వారికున్న ద్వేష భావాన్ని ప్రత్యక్షంగా చూపించడమే! పాఠ్య గ్రంథాల సిలబస్‌లు మార్చుకున్నంత మాత్రాన అసలు చరిత్ర మారదు కదా? చారిత్రక ఆనవాళ్లు తుడిచి పెట్టుకుపోవు కదా? ఆర్కియాలజీ విభాగం వారి రిపోర్టులూ, ప్రపంచ వ్యాప్తంగా వందలమంది చరిత్రకారులు రాసిన చరిత్ర గ్రంథాలు మాట్లాడుతూనే ఉంటాయి కదా? ఆయా విషయాల మీద వాస్తవికతకు అద్దం పడుతూ వెలువడిన సినిమాలు, నాటకాలు, ఇతర సృజనాత్మక రచనలు నేటి ప్రభుత్వపు అబద్ధపు ప్రచారాల్ని బట్టబయలు చేస్తూనే ఉంటాయి కదా?

మొఘలుల చరిత్ర ఏదో కొద్ది కాలంది కాదు.. ఈ నేలమీద పరిపాలన సాగిస్తూ, సుమారు నాలుగు శతాబ్దాల పాటు ఇక్కడే పాతుకుపోయింది. అంతేకాదు, ఈ దేశంలో అంతర్భాగమైపోయింది. మొఘలుల తర్వాత వచ్చిన బ్రిటీషు వారు ఈ దేశాన్ని దోచుకుపోయారు. దోచుకున్నది తీసుకుపోయి బ్రిటన్‌లో పెట్టుకున్నారు. ఉదాహరణకు మన ప్రాంతం నుండి తీసుకుపోయిన కోహినూరు వజ్రం. బ్రిటీష్ రాణి కిరీటంలో ధగ ధగా మెరిసింది కదా? మరి మొఘలులు దోచుకున్న దేమిటీ? దోచుకుంటే అది వారెక్కడికి తీసుకుపోయారూ? అని భావి తరాల పౌరులు ప్రశ్నలు సంధించరా? మొట్టమొదట దేశంలోకి ప్రవేశించిన బాబర్ తప్ప, మిగిలిన మొఘల్ చక్రవర్తులందరూ ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి ఇక్కడే కన్నుమూశారు కదా? ఈ దేశపు మట్టిలో మట్టయిపోయారు. భారతీయ జన జీవితంలో ఐక్యమైపోయారు.

సాధారణ శకానికి పూర్వం ఎప్పుడో అశోకచక్రవర్తి పరిపాలించిన సువిశాలమైన భూభాగాన్ని మళ్లీ మొఘలులు ఆక్రమించి సుస్థిర పరిచారు. ఇతర చొరబాటుదారులు దేశంలో చొరబడకుండా అడ్డుకుంటూ శత్రు దుర్భేద్యంగా నిలబడ్డారు. శతాబ్దాలు గడిచిపోతున్నా ప్రపంచ పర్యాటకులు మొఘలుల కట్టడాలను చూడడానికి విపరీతంగా వస్తున్నారు కదా? తాజ్‌మహల్, లాల్‌ఖిలా, హుమాయూన్ సమాధి, ఆగ్రా కోట, బులంద్ దర్వాజ వంటివన్నీ యునెస్కో వరల్డ్ హెరిటేజ్ స్థలాలుగా గుర్తింపు పొందాయి కదా? కాదంటారా? రోజూ వేలమంది సందర్శకులకు ఆ కట్టడాల నేపథ్యం తెలియనీయకుండా జాగ్రత్త పడతారా? అక్బరు, షాజహాన్‌ల పేర్లు బయటకు రానీయకుండా బిజెపి పాలనలో మోడి చక్రవర్తి అవి కట్టించాడని చెప్పుకుంటారా? చెప్పుకున్నా చెప్పుకుంటారు. ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు. వారి అబద్ధపు ప్రచారాలు, ఆర్భాటాలు ఎంత దిగజారుడు స్థాయిలో ఉంటున్నాయో రోజూ చూస్తూనే ఉన్నాం కదా? ఇక, తామే ఎల్లకాలమూ అధికారంలో ఉంటామన్న భ్రమలో నేటి ప్రభుత్వ పెద్దలు ఉన్నట్టుంది. కాల ప్రవాహంలో మార్పు సహజం అని గ్రహించలేకపోతున్నారు. గతంలో హిట్లర్ కూడా ఇలాగే మార్పులు చేయించాడు. మరి ఎల్లకాలమూ అధికారంలో ఉండలేకపోయారు కదా!

ఇక సైన్సు పాఠ్య గ్రంథాల నుండి జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలగించడం గురించి చూద్దాం. మనిషిగా పుట్టిన ప్రతివాడూ తప్పక తెలుసుకోవాల్సిన అంశం – జీవ పరిణామం. ఇది ఏ ఒక్క దేశానికో సంబంధించిన విషయం కాదు. కేవలం జీవశాస్త్రం అభ్యసించే విద్యార్థులు చదువుకునేది కూడా కాదు. ప్రపంచ పౌరులందరూ అధ్యయనం చేయాల్సిన విషయం. అర్థం చేసుకోవాల్సిన విషయం. చదువు లేని వారు సైతం చదువుకున్న వారిని అడిగి, సారాంశం – తెలుసుకోవాల్సిన విషయం. కొన్ని లక్షల ఏళ్ల పాటు కొనసాగిన మానవుడి తొలి దశలు ఏవో, అవి ఎంతెంతగా సంఘర్షిస్తూ వచ్చాయో– వాతావరణ పరిస్థితులను ఎలా ఎదుర్కుంటూ వచ్చాయో – ఎప్పటికప్పుడు కొత్త విషయాలు అవగతం చేసుకుంటూ, ఎదుగుతూ, పరిణామం చెందుతూ ఇప్పటి ఈ స్థితికి ఎలా చేరుకున్నాయో తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ ఉంది! ఏకకణ జీవుల నుండి, బహుకణ జీవుల నుండి, వెన్నెముక లేని జంతువుల్లో జరిగిన జీవ పరిణామం – తొలి దశ అయితే.. అందులో నుండి వెన్నెముక గల జీవులు–చేపలు, ఉభయచరాలు– సరీసృపాలు పక్షులు– ఆ తర్వాత హోమినిడికి చెందిన వానరాలు, అందులో నుండి తొలి మానవ దశలు రావడం మలిదశ.

ఒకానొక కాలంలో ఎన్నో తొలి మానవదశలు కలిసి, ఏక కాలంలో ఈ నేల మీద సంచరించాయి. ఆహారం కోసం పోటీపడి కొట్లాడుకున్నాయి. అలా ఆ ఘర్షణల్లో తెలివైన జాతి – హోమో సేపియన్ గెలుస్తూ, తన జాతిని కొనసాగించుకుంటూ వచ్చింది. మిగిలిన జాతులన్నీ క్రమంగా అంతరించిపోయాయి. హోమో– అనేది మానవ జాతికి సంబంధించిన జీనస్. సేపియన్–అనేది స్పీసీస్, 'సేపియన్' అంటే వివేకం గలది అని అర్థం. సేపియన్‌గా ఈ భూమి మీద బతకుతున్నందుకు ప్రతీ ఒక్కరూ తమ వివేచనను ఉపయోగిస్తూ ఉండాలి! అందువల్ల ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కడ ఏమూలలో ఉన్న మానవుడైనా, అతను హోమో సేపియనే అంటే, మనుషులంతా ఒక్కటే అని కదా అర్థం. ఆ రకంగా ప్రతి మనిషీ విశ్వమానవుడే! అనాగరికతను వదిలేస్తూ మనిషి నాగరికుడిగా ఎలా తయారయ్యాడో, మనిషి కేంద్రంగా అతను ఆధునిక, అత్యాధునిక యుగాలను ఎలా నిర్మించుకుంటూ వచ్చాడో తెలుసుకోవాలంటే తప్పదు ప్రతి ఒక్కరూ జీవపరిణామ శాస్త్రం చదువుకోవాల్సిందే!

దైవ విశ్వాసంలో నిండా మునిగి, ఆత్మ, పరమాత్మ, పునర్జన్మ లాంటి అంధ విశ్వాసాల్లోనే జీవన సత్యం ఉందనుకునే వారికి జీవపరిణామం అక్కరలేదు. అబద్ధాలు పూర్తిగా నమ్ముతూ, నిజాలకు రుజువులడిగే అతి తెలివిగాళ్ళకు నిజమే జీవ పరిణామ శాస్త్రం అక్కర లేదు. ఆత్మ విశ్వాసాన్ని తొక్కిపెట్టి, దైవవిశ్వాసానికి భజనలు చేసే వారికి అవును– జీవపరిణామం అక్కర లేదు.

జీవపరిణామ శాస్త్రం హేతువాదానికి మూలం!
మానవ వాదానికి మూలం! స్వేచ్ఛాలోచనకు మూలం!
విశ్వదృష్టికి మూలం!
జీవ పరిణామమంటే చీకటిలోంచి వెలుగులోకి చేసిన ప్రయాణం!
అజ్ఞానంలోంచి జ్ఞానంలోకి చేసిన ప్రయాణం!
మనిషి, మనిషి విలువను తెలుసుకోవడానికే,
మానవ జీవన పరిణామం గురించి తెలుసుకోవాలి!

మరి వీటిలో ఏ ఒక్కటీ గుర్తించలేని వారు, భరించలేని వారు ప్రస్తుతం అధికారంలో ఉన్నారు కాబట్టి, వారు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. రాబోయే తరాల్ని నిర్వీర్యం చేయడానికి పూనుకున్నారు.

ఏ ప్రభుత్వమైనా ముఖ్యంగా చేయాల్సినవి రెండు పనులు.

1. విద్య 2 వైద్యం–దేశ ప్రజలకు బాధ్యతతో అందించాలి! వైద్యం సమకాలీన సమాజంలో బతికి ఉన్న పౌరులకు మాత్రమే పని కొస్తుంది. కానీ విద్య–రాగల భవిష్యత్ తరాలకు కూడా అందుతూ ఉండేది. సరైన విద్య అందించకుండా ఒక తరాన్ని తయారు చేస్తే, దాని ప్రభావం రాబోయే ఎన్నో తరాల మీద పడుతుంది. ఆలోచించి చూడండి వైద్యం కన్నా విద్య ఎంత ముఖ్యమైందో.

వైద్యం–చాలా అవసరమే. దేశ పౌరులు ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తరాలు ఆరోగ్యంగా పుడతాయి. నిజమే! కానీ, అధిక సంఖ్యలో అజ్ఞానులు పుట్టినందువల్ల దేశానికి ఏం లాభం? సమాజగతిని మార్చే జ్ఞానులు కొంత మందైనా తయారు కావాలి కదా? అందుకే ప్రభుత్వాలు హేతుబద్ధమైన విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలి. మనకు నిత్య జీవితంలో అందుబాటులోకి వస్తున్న అనేకానేక వైజ్ఞానిక పరికరాలు ఏకొద్ది మంది శాస్త్రజ్ఞులు కనుక్కున్నవి. మరి కొద్దిమంది సాంకేతిక నిపుణులు తయారు చేస్తున్నవీను! అత్యధిక ప్రపంచజానాభా వాటిని సుఖంగా, సులభంగా వాడుకుంటోంది కదా?

సమాజగతిని మార్చగల శక్తి సామర్థ్యాలు ఎప్పుడైనా ఏ కొద్ది మందికో కల్పించాలి. అంతే గాని, మెదళ్ళు కత్తిరించి, రెక్కలు కత్తిరించి, మాటను కత్తిరించి, ఆలోచనను కత్తిరించి ప్రభుత్వం వివేకవంతుల్ని తయారు చేయలేదు! పాఠ్య పుస్తకాల్లోంచి అవసరమైన విషయాలు తొలగించడమంటే, నిజాల్ని తొక్కిపెట్టడమే. సమాజాన్ని నిస్సత్తుగా మార్చడమే, యువత జ్ఞాన సంసన్నులై ఎక్కడ ప్రశ్నలు సంధిస్తారోనని ఒకరకంగా ప్రస్థుత ప్రభుత్వం భయపడుతున్నట్టుగా ఉంది. నిజాల్ని దాచిపెట్టి తమ హిందుత్వ ఎజెండాను తెచ్చి, సృష్టి సిద్ధాంతాన్ని బాల బాలికల మెదళ్ళలో కుక్కి, రాజ్యాంగాన్ని పక్కకు తోసి, మనుస్మృతిని వాడుకలోకి తేవాలన్నది ఆరెస్సెస్, బిజెపిల ఉద్దేశం. ఆ దిశలో వాళ్ళు మొదటి నుండి పనిచేస్తున్నారు. సమస్యలు ఎదురైనప్పుడు కాళ్ళ బేరానికి రావడం వాళ్ళకు మొదటి నుండి అలవాటు. బ్రిటీష్ వారికి క్షమాపణలు చెప్పి స్వాతంత్ర్యోద్యమంలో ఆనాటి యువతీయువకులు పాల్గొనకుండా అడ్డుకున్నది వీరే. నెహ్రూ ప్రభుత్వంలో హోం మంత్రి సర్దార్ పటేల్ ఆరెస్సెస్‌ను నిషేధిస్తే క్షమాపణలు చెప్పి బయటపడింది వీరే. తమ కార్యకర్తల్ని విడిపించుకోవడానికి ఇందిరా గాంధీ ప్రభుత్వానికి క్షమాపణ చెప్పి నాటి ఎమర్జెన్సీని బలపరిచింది వీరే. ఇప్పుడు మళ్ళీ వారే అప్పటి ఎమర్జెన్సీని విమర్శిస్తున్నారు– నిజాయితీ లేదు. నిబద్ధత లేదు. నిజాలు మాట్లాడరు. అక్రమ మార్గాల్లో ఎన్నికై వస్తారు. బలం లేకపోయినా, రెండు ఊతకర్రల్ని చంకనేసుకుని కుంటుతారు. పని శూన్యం ! ప్రచారం అమోఘం!!!

మొఘలులు ముస్లింలు గనక, ఈ దేశంలోని హిందువులంతా వారిని ద్వేషించాలని అధికారంలో ఉన్న అతిపెద్ద రాజకీయ పార్టీ భావిస్తోంది. మహిళల్ని నగ్నంగా వీధుల్లో తిప్పినా బాధపడదు. ఇ.డి , సిబిఐ, కోర్టులు –వంటి వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేసి వాటితో ఊడిగం చేయించుకుంటున్న విధంగానే, ఇప్పుడు ఎస్‌సిఇఆర్‌టిని కూడా మార్చుకుంటోందని ఈ దేశ పౌరులు అర్థ చేసుకుంటున్నారు. కార్యాచరణకు సిద్ధపడుతున్నారు.

*(కవిరాజు త్రిపురనేని జాతీయపురస్కార తొలిగ్రహీత, బయాలజీ ప్రొఫెసర్.)*

# జిఎస్‌టి కోత ఎవరికి ఎక్కువ లాభం?

ఇటీవల అమలులోకి వచ్చిన జిఎస్‌టి పన్నురేట్ల సవరింపులు నిజానికి ప్రాముఖ్యతగలవి. దీనివల్ల వినిమయ డిమాండ్ పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఇక్కడ ఉదయించే ప్రశ్న – ప్రజల్లో ఏ విభాగాలు నిజంగా లబ్ధిపొందుతాయి, తక్కువ ఆదాయ విభాగాలు, ఆర్థికంగా బలహీన గ్రూపులకు ఈ లబ్ధి అందుతుందా? అందరికీ లబ్ధి చేకూరకపోతే, వినిమయ డిమాండ్ బహుముఖంగా ఎలా పెరుగుతుంది? ఎగువ, మధ్య స్థాయి ఆదాయ మధ్యతరగతులు చాలా పెద్ద సంఖ్యలో ఉన్న దేశంలో జిఎస్‌టి తగ్గింపులో ప్రధానభాగం వినిమయ వస్తువులపై ఉన్నందున జీవన వ్యయాల్లో

ధూర్జటి ముఖర్జీ

వ్యత్యాసం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. గృహ బడ్జెట్లపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో వినిమయవ్యయం తగ్గుదలకు ప్రాముఖ్యత ఉంటుంది.

జిడిపిలో వినిమయం వాటా సుమారు 60 శాతం. అందువల్ల ప్రభుత్వం వినిమయం పెంపు చేయాలనుకుంటోంది. గత రెండు సంవత్సరాల్లో జిడిపిలో ప్రైవేటు వినిమయం వాటా 2021–23 నాటి పెరుగుదలనుంచి (ద్రవ్యోల్బణాన్ని లెక్కలోకి తీసుకుంటే) దిగజారింది. కరోనా మహమ్మారికి ముందున్న స్థాయి కన్నా మెరుగ్గా ఏమీ లేదు. వినిమయ రుణాల చెల్లింపులో వైఫల్యం, కుటుంబాల ఆర్థిక అవసరాలు, అప్పులు పెరుగుదల వినిమయ వ్యయం తగ్గుదలకు దారితీసింది. అయితే ఇప్పుడు ధరలు ఏ మేరకు తగ్గుతాయన్నది జిఎస్‌టి తగ్గింపు వినియోగదారుకు వాస్తవంగా చేరటంపై ఆధారపడి ఉంటుంది. కొంతభాగాన్ని తమ వ్యాపార లాభం పెంపుదలకు వ్యాపారులు అట్టిపెట్టుకుంటారు. కాబట్టి వినియోగదారుకు అందేది కొద్ది భాగమే. అయితే ప్రభుత్వం శ్రద్ధగా దృష్టి కేంద్రీకరిస్తున్నందున ధరల్లో తగ్గుదల గమనించదగిందిగా ఉండవచ్చు.

గిరాకీ పెంచటానికి ధరలు తగ్గించటమన్నది అల్పాదాయ వినియోగదారులకు వనగూరే ప్రయోజనం కన్నా పరిశ్రమ ప్రయోజనం రీత్యానే ఎక్కువ అవసరం. అది కొత్తగా పెట్టుబడులకు, ఉపాధి కల్పనకు, ప్రపంచ మార్కెట్‌లో చైనాతో పోటీ పడటానికీ దారితీయవచ్చు. కార్ల తయారీదారులు బిఎస్ 6 ధరల పెంపుదల నుంచి 2019 ధరల స్థాయికి ఇప్పటికే ధరలు తగ్గించారు. అయితే కార్ల కొనుగోలు ఎగువ మధ్యతరగతి విభాగాల ప్రజలకే పరిమితం.



జిఎస్‌టి తగ్గింపు, నవరాత్రి ఉత్సవాల సీజన్ ప్రారంభం దృష్ట్యా 2025 సెప్టెంబర్ మాసంలో ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో విక్రయాలు గణనీయంగా పెరిగినట్లు ప్రభుత్వాధికారులు చెప్పారు. ఉన్నతస్థాయి ఆదాయవర్గాలు తమ కు లేదా తమ కుటుంబానికి మరో కారు కొనుక్కోవటం కూడా కార్ల విక్రయాల వృద్ధికి దారితీసి ఉండవచ్చు. మహానగరాల్లో కార్ల పార్కింగ్ ఇప్పటికే సమస్యగా ఉంది. ఇప్పుడు అది మరింత పెరగవచ్చు. జిఎస్‌టి తగ్గింపు సొంతకార్లు లేనివారి కీ, కారుకొనకముందే దాని పార్కింగ్ స్థలం చూసినవారికీ పరిమితం చేస్తే బాగుండు. కాని అట్టి నియంత్రణ అసాధ్యం. కార్బన్ ఉద్గారాల్లో నెట్ జీరో సాధించేందుకు ఒక వైపు ప్రయత్నిస్తూ, రెండోవైపున కార్ల ఉత్పత్తి పెంపుదలను అనుమతించటం అందుకు సహాయకారి అవుతుందా?

అలాగే ప్రతి పరిశ్రమ ఉన్నత స్థాయిది కాదు. అందువల్ల ప్రతి ఒక్క వస్తువు ధర తగ్గింపుపై నిఘా పెట్టటం సాధ్యం కాదు. అయితే ఆరోగ్య బీమాపై జిఎస్‌టి పూర్తిగా ఎత్తివేసినందున, ఆ రంగంపై ప్రత్యేకించి దృష్టి పెట్టాలి. దిగువ మధ్యతరగతులలోకి కూడా ఆరోగ్య బీమాను తీసుకెళ్లే నిమిత్తం జిఎస్‌టి పూర్తిగా ఎత్తివేయటం జరిగింది.

ఆదాయం పన్ను గరిష్ట పరిమితి పెంపుదల, జిఎస్‌టి రేట్ల పునర్వ్యవస్థీకరణ ప్రధాన ఉద్దేశం వినిమయంపై వ్యయాన్ని గణనీయంగా పెంచటం, మధ్యతరగతులు, సంపన్న తరగతులు ప్రధాన వినియోగదారులని, వారు చేసే వ్యయం పెరుగుదల వృద్ధిని ప్రోత్సహిస్తుందని వాదించవచ్చు. అయితే దిగువ తరగతులకు లబ్ధి చేరకపోవటం ఖండించదగింది. అంతేగాక, చిన్న వ్యాపారులు జిఎస్‌టి తగ్గింపును మొత్తంగా వినియోగదారులకు అందించకపోతే ఆహార పదార్థాల ధరలు తగ్గవు. భారతదేశం తన స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలు రెండింటికీ ఒకే వ్యూహం అనుసరించాలి. భారతదేశం ఎల్లప్పుడు ఆర్థిక వ్యవస్థలో వృద్ధికి దేశీయ వినిమయం పైనే ఆధారపడుతున్నది. కాగా ఏసియాన్ నుంచి దక్షిణ కొరియా వర కు, ఆసియాలోని అద్భుత ఆర్థిక వ్యవస్థలన్నీ, చైనా కూడా తమ వృద్ధికి ఎగుమతులు ప్రోత్సహిస్తున్నాయి. భారతదేశం దిగుమతులకు ప్రత్యామ్నాయాలు ఉత్పత్తి చేయటంపై కేంద్రీకరించీ, లైసెన్స్, ఇన్‌స్పెక్టర్ రాజ్ ఆదేశాలపై, వ్యాపారాలపై అదనపు భారాలు మోపీ మాన్యుఫాక్చరింగ్ బస్ మిస్ అయింది.

భారతదేశంలో కుటుంబ ఆదాయంలో 65 శాతం 10శాతం మంది చేతిలో కేంద్రీకృతమై ఉందని జర్మన్ బీమా కంపెనీ అల్లియాంజ్ కుటుంబ ఆస్తులపై ఇటీవల తయారు చేసిన నివేదికలో సంపద కేంద్రీకరణను ప్రస్తావించింది. 2004లో ఈ సంపద కేంద్రీకరణ 58శాతంగా ఉంది. అంతరం పెరుగుతున్నప్పటికీ, మొత్తం మీద సంపద ఉత్పత్తి వేగం పుంజుకుంది. తలసరి నికర ద్రవ్య ఆస్తులు 20సంవత్సరాలు క్రితం కన్నా 13రెట్లు పెరిగాయి. అదే కాలంలో చైనా వృద్ధి 12రెట్లు. అందువల్ల వినిమయవ్యయం గణనీయంగా పెరుగుతుందని భావించవచ్చు. కాని అది మధ్య, ఎగువ ఆదా య విభాగాల చేతిలో కేంద్రీకృతమై ఉంటుంది. అప్పు డు ప్రశ్న ఉదయిస్తుంది. సమాజంలోని కింది తరగతులు ఏమి కావాలి? పండుగల సీజన్ ప్రారంభం కావటంతో కూరగాయలు, మాంసం ఉత్పత్తి ధరలు పెరుగుతున్నాయి. దీనివల్ల బాధపడేది అట్టడుగు తరగతులే. పండగల రోజుల్లో మంచి ఆహారం కూడా సామాన్యులకు అందని ద్రాక్షే అవుతున్నది.

కొత్త జిఎస్‌టి రేట్ల వల్ల ప్రభుత్వానికి కొంత ఆదాయ నష్టం జరుగుతుంది. అయితే జిఎస్‌టి ఎగవేతను సమర్థవంతంగా అరికట్టడం ద్వారా ఆ నష్టాన్ని భర్తీ చేసుకోవచ్చు. గత ఐదేళ్లలో రూ.2.23 లక్షల కోట్లు ఎగవేతను కనుగొన్నారు.

మొత్తం సమస్య వినిమయ గిరాకీని ప్రోత్సహించటం చుట్టూ తిరుగుతుందా లేక ఎక్కువ ఉత్పత్తి చేసి ఎక్కువ విక్రయం జరిపేటట్లు పరిశ్రమకు సహాయపడటం చుట్టూ తిరుగుతుందా? దేశంలో వాస్తవ లబ్ధిదారులెవరు, ఎవరి కోసం పన్నులు తగ్గించబడుతున్నాయి? పన్నులు తగ్గించవలసిన వస్తువులను గుర్తించేటప్పుడు ఈ ప్రశ్నలను సీరియస్‌గా పరిశీలించాలి. సంక్షేమ కార్యక్రమాలకు దేశానికి అధిక వనరులు అవసరం. ఆరోగ్యం, అత్యంత ఆదరణ పొందిన మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజినరేగా) కార్యక్రమాలకు బడ్జెటరీ కేటాయింపులు ద్రవ్యోల్బణం జతచేసిన మేరకు పెరగకపోవటం మరిచిపోరాదు. మొత్తం మీద అరకొర పరిష్కారం సమాధానం కాజాలదు.

## గతుకుల రోడ్లపై ప్రయాణించేది ఎలా?

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** అంతంత మాత్రంగానే ఉన్న రోడ్లు, దీనికి తోడు ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల గ్రామాల్లోని రోడ్లు పూర్తిగా పాడవడంతో వాహనదారులు ఇబ్బందులు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గతుకుల రోడ్లపై ప్రయాణించాల్సి వస్తుందని దీంతో వాహనాలు పాడవటమే కాక ప్రయాణం అలసటగా మారుతుందని వాహనదారులు ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. వీపనగండ్ల నుండి కల్వరాల మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డు కేతేపల్లి వరకు పాడవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రం నుంచి వల్లభాపూర్ వెళ్లే వాహనదారులు సంగినేనిపల్లి క్రాస్ రోడ్డు వద్ద బీమా కాలువపై ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నారు. ఈ రహదారి వెంట ప్రతినిత్యం ఓ ప్రైవేట్ పాఠశాల చెందిన బస్సు వెళుతుండటంతో చిన్నారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. తుమ్మకుంట చౌరస్తా నుంచి బొల్లారం, కొర్లకుంట్ల యన్మన్ బెట్ల వెళ్లే రహదారులు, వీపనగండ్ల ప్రధాన రోడ్డు నుంచి గోపాల్ దీన్నేకు వెళ్లే రోడ్డు పాడైపోవడంతో ద్విచక్ర వాహనాలు వెళ్ళటానికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా రోడ్ల బాగు కోసం నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## చిత్తశుద్ధి ఉంటే బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

### మాజీమంత్రి చిత్తరంజన్‌దాస్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కేంద్రప్రభుత్వానికి సామాజికన్యాయంపై చిత్తశుద్ధి ఉంటే బిసి రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని మాజీమంత్రి చిత్తరంజన్ దాస్ అన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ అడ్డుకున్నపాపం బిజెపి, బిఆర్‌ఎస్‌పార్టీలదేనని ఈపార్టీలో ఒక్కటే బిసి రిజర్వేషన్లను అడ్డుకున్నాయని ఆరోపించారు. శనివారం పట్టణంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిసారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి కులగణనచేసి 42శాతం బిసి రిజర్వేషన్లను రూపొందించినట్లు గుర్తుచేశారు. తమ ప్రభుత్వం 42శాతం బిసి రిజర్వేషన్లకు కట్టుబడి ఉందన్నారు. బిసి రిజర్వేషన్ బిల్లు రెండు సభల్లోపాస్‌చేసి గవర్నర్‌కు పంపించామని, గవర్నర్ బిల్లు పాస్ చేయకుండా అడ్డుకున్నారన్నారు. అగ్రకులాలకు పదిశాతం రిజర్వేషన్లను ఇచ్చే సమయంలో తామూ అడ్డుకోలేదన్నారు.



## 15.60 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ పట్టివేత

### ధన్వాడ ఇంచార్జ్ ఎస్సై సురేష్

**ప్రజాపక్షం/ధన్వాడ :** పోలీస్ స్టేషన్ పరిధిలో బొలెరో వాహనంలో అక్రమంగా పిడిఎస్ రైస్ తరలిస్తుంటే ఎమ్మోన్‌పల్లి గ్రామ శివారులో టాస్క్ ఫోర్స్ ధన్వాడ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకొని పోలీస్ స్టేషన్కు తరలించి విచారించారు. నర్వ మండలంలో పలు గ్రామాలో పిడిఎస్ రైస్ సేకరించి కర్ణాటక తీసుకెళుతున్న బొలెరో డ్రైవర్ నరేందర్ తండ్రి శాంతన్న, తిరుమలాయపల్లి గ్రామం, మదనాపురం. ఓనర్ బాలరాజు తండ్రి నాగప్ప, శ్రీరామ్ నగర్ కాలనీ, మక్తల్ 15.60 క్వింటాళ్ల పిడిఎస్ రైస్ పట్టుకొని డిటి పంచనామా అనంతరం డ్రైవర్‌ఓ, ఓనర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ధన్వాడ ఇంచార్జ్ ఎస్సై సురేష్ తెలిపారు. ధన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా పిడిఎస్ రైస్ నిల్వ ఉంచిన రవాణా చేసిన ఇతరులకు అమ్మిన అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై హెచ్చరించారు.

## ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



### మాగనూరు ఎస్సై అశోక్ బాబు

**ప్రజాపక్షం/మాగనూర్ :** మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి పర్మిషన్ లేకుండా అర్ధరాత్రి వర్కూర్ వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను మాగనూరు పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. టిప్పర్ నంబర్ ఎపి07 టిడి 4678 డ్రైవర్ నాగేంద్ర బాబు తండ్రి ఆంజనేయులు వయస్సు 25 గ్రామం కర్నె భూత్పూర్ మండల ఓనర్ పేరు రంజిత్ గౌడ్ తండ్రి నరసింహులు వయస్సు 35 భూత్పూర్ టిప్పర్ డ్రైవర్, ఓనర్‌పై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా పర్మిషన్ లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే అట్టి వ్యక్తుల పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై హెచ్చరించారు.

## మొరం తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్రమంగా మొరం మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను ఎమ్మోన్ పల్లి గ్రామ శివారులో ధన్వాడ పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా టిప్పర్ డ్రైవర్ నరేందర్ తండ్రి నరసింహులు, పేర్నాపల్లి, నారాయణపేట, బొడపల్లి ఆంజనేయులు తండ్రి నరసప్ప, బిజ్వార్, అనే వ్యక్తులు మంత్రోని పల్లి నుండి ఎమ్మోన్ పల్లి గ్రామంకి అక్రమంగా తరలిస్తుంటే పట్టుకుని ఇద్దరు వ్యక్తుల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ధన్వాడ ఇన్చార్జ్ ఎస్సై సురేష్ తెలిపారు.

## యథావిధిగా ప్రజావాణి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రజాసమస్యల సత్వర పరిష్కారంకోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లోని సమావేశమందిరంలో కొనసాగుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 13వతేదినుండి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికసంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండటంవల్ల తాత్కాలికంగా ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదావేయడం జరిగిందని గుర్తుచేశారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికల నిర్వహణ ప్రక్రియ నిలిచిపోయినందున ప్రజావాణి కార్యక్రమంతిరిగి యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

## కాలువలో పడి దంపతుల మృతి..



పరామర్శించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/జడ్చర్ల:** కిష్టారం గ్రామం అంబతాపూర్ వార్డుకు చెందిన నివాసులు బాలయ్య, రాములమ్మ దంపతులు వృత్తిరీత్యా పనుల నిమిత్తం తరచుగా కిష్టారం గ్రామానికి వెళ్ళి వస్తుండగా, గురువారం సాయంత్రం భారీ వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువల్లో పడి దురదృష్టవశాత్తు మృతి చెందారు. ఈ విషాద ఘటన గురించి తెలుసుకున్న జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి నేడు కిష్టారం అంబతాపూర్ గ్రామానికి వెళ్లి మృతదేహాలను సందర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా తక్షణ చర్యలు తీసుకుంటామని, తొందరలోనే కిష్టారం గ్రామానికి బీట్ రోడ్ మంజూరయ్యేలా చర్యలు చేపడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## ఉపాధి పనికి వెళ్లాలంటే ఇ-కెవైసి తప్పనిసరి

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు ఈకేవైసీ ని తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. ఉపాధి హామీ పథకం పనుల్లో ఏలాంటి అవకతవకలు జరగకుండా జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్క ఉపాధి హామీ కూలి ఈకేవైసి కావాలని తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామపంచాయితీల వద్ద ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు మొబైల్ యాప్ ద్వారా ఈకేవైసీ చేస్తున్నారని, గ్రామపంచాయితీ కార్యదర్శులు కూలీలకు అవగాహన కల్పించి ఈకేవైసీ చేయించాలని ఎంపీడీవో తెలిపారు.

# 'పిఎం ధన్-ధాన్య కృషి యోజన' సద్వినియోగం

### పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డి.కె.అరుణ

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** ప్రధాన మంత్రి ధన్‌ధాన్య కృషి యోజన పథకాన్ని జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డీ.కె. అరుణ అన్నారు. పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం, పప్పు ధాన్యాల మిషన్‌ను భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ ద్వారా శనివారం ప్రారంభించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నారాయణ పేట మండలం జాజాపూర్ గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ప్రారంభ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరు కాగా, నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, నోడల్ అధికారి సాయి బాబా, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ పాలొ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ పీఎం ధన్‌ధాన్య కృషి యోజన పథకం ఎంతో గొప్ప కార్యక్రమం అని, దేశంలోని 100 జిల్లాలోని నారాయణపేట జిల్లా ఈ పథకం కింద ఎంపిక కావడం ఈ ప్రాంత అభివృద్ధికి శుభ పరిణామం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకం కింద ఎంపికైన నాలుగు జిల్లాలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో నే మూడు జిల్లాలు నాగర్ కర్నూల్, గద్వాల, నారాయణపేట ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. ఈ ప్రాంత రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షతో ప్రవేశ పెట్టిన ఈ పథకం ఆరేళ్ల పాటు కొనసాగుతుందని, ఈ పథకం కింద ప్రతి ఏటా రూ. 960 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆమె తెలిపారు. 2018–19 నుంచి ఆస్పి రేషన్ బ్లాక్ కొనసాగుతోందని, 2021 లో మన జిల్లాలోని నర్వ మండలం ఆ బ్లాక్ కింద ఎంపిక అయిందని, నీతి అయోగ్ ద్వారా రూ. 2 కోట్ల నిధులు వచ్చాయని ఆమె తెలిపారు. ప్రధాన మంత్రి ధన్‌ధాన్య కృషి యోజన పథకం లోని వంద ఆస్పిరేషన్ లలో వ్యవసాయం , రైతు సంక్షేమ శాఖ కు సంబంధించి 29 పథకాలు ఉంటాయన్నారు. వాటిలో వ్యవసాయ పరిశోధన, విద్య విభాగం, మత్స్యశాఖ, పశుసంవర్ధక , పాడిపరిశ్రమ శాఖ, సహకార, మంత్రిత్వ శాక, జలవనరులు, నదీ అభివృద్ధి & గంగా పునరుజ్జీవన శాఖ, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ పథకాలు ఉంటాయని ఆమె తెలిపారు.



పీఎం ధన్‌ధాన్య కృషి యోజన పథకాన్ని శనివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారని, జిల్లాలో ఈ పథకానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ ను తయారు చేస్తామని, పథకం జిల్లాలో లాంచ్ అయిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, బీజేపీ ముఖ్య నేతలు నాగురావు నామాజీ, రతంగ్ పాండ్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, ప్రధాన కార్యదర్శులు తిరుపతి, లక్ష్మీ శ్యాంసుందర్ గౌడ్, సిద్ధి వెంకట్ రాములు, బిజెపి నగర, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు, బిజెపి వివిధ మోర్చాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఓట్ చోరీ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి



### దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**ప్రజాపక్షం/కొత్తకోట:** కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు నేడు ఓట్ చోరీకి వ్యతిరేకంగా నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ ఓట్ చోరీ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఓటు చోరికి పాల్పడి దేశంలో బిజెపి గద్దెనెక్కిందని, మోడీ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, బిజెపి ప్రభుత్వం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తుందని అన్నారు. ఇప్పటికే లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ఓట్ చోరికి సంబంధించి ఆధారాలు బయటపెట్టిన, ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకోకుండా బిజెపి కనుసన్నల్లో ఎన్నికల సంఘం పనిచేస్తుందన్నారు. ఓట్ చోరికి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా, భారత రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు హక్కును కాపాడుకునే ప్రయత్నంకు అందరూ సంతకం చేసి ఓట్ చోరీ వ్యతిరేక కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానంలోని మహాదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్లో ఒక లక్ష 250 ఓట్లు దొంగ ఓట్ల దొంగతనం జరిగిందని రాహుల్ గాంధీ ఆధారాలను బయటపెట్టిన, ఎన్నికల సంఘం చర్యలు తీసుకోకుండా, ఓట్ చోరిని బయటపెట్టిన రాహుల్‌గాంధీని క్షమాపణ చెప్పాలని, అఫిడవిట్ ఇవ్వాలని ఎన్నికల సంఘం కోరడం సిగ్గుచేటు అన్నారు. అనంతరం బీసీ రిజర్వేషన్ల పై మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లను అడ్డుకోవడంలో ప్రధాన ముద్దాయిలు బిఆర్ఎస్ బిజెపి పార్టీలని ధ్వజమెత్తారు. కులగణన చారిత్రాత్మక నిర్ణయమని, పారదర్శకంగా నిర్వహించామని బిజెపి బిఆర్ఎస్ కలిసి బిసి రిజర్వేషన్లను అడ్డుకునే కుట్ర చేస్తున్నాయని విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బిల్లు గవర్నర్ దగ్గర పెండింగులో ఉందని, తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన బిల్లును గవర్నర్ వద్ద ఆపింది. బిజెపి ప్రభుత్వం కాదా అంటూ సూటిగా నిలదీశారు. తదనంతరం కూరగాయల మార్కెట్, సంత బజార్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు.



## రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ తనిఖీ

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయకర్ శుక్రవారం కనకదుర్గ నవాబుపేట, సురేష్ బోయపల్లి, భాను భూత్పూర్, లక్ష్మి నరసింహ అడ్డకుల్, శ్రీరామ గండిడ్, లక్ష్మి బాలాజీ మహమ్మాదాబాద్ రైస్ మిల్లులను తనిఖీ చేశారు. 2024–25 , సిఎంఆర్ పెండింగ్ రైస్ మిల్లులు 24 గంటలు నడిపించి అనుకున్న సమయానికి డెలివరీ చేయాలని రైస్ మిల్స్ యాజమాన్యాని ఆదేశించారు. అలాగే ఖరీఫ్ 2024–25కు సంబంధించి మన జిల్లా 92% డెలివరీ చేయడం జరిగింది. మిగిలిన 8% పూర్తి చేయాలని రైస్ మిల్లర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అలాగే జిల్లాలో గల ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసీల్దార్‌లను పెండింగ్ ఎక్కువ గల రైస్ మిల్లులను ప్రతి రోజు సందర్శించి డెలివరీ అయే విధంగా చూడాలని ఆదేశించారు.

# నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

### డిఎస్పీ ఎన్.లింగయ్య



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులకు డిఎస్పీ ఎన్.లింగయ్య డీఎస్పీ కార్యాలయంలో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరిగే నేరాల నియంత్రణ పై దృష్టి సారించి పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాను గ్రేవ్ కేసుల గురించి సిఐ, ఎస్సై లను అడిగి తెలుసుకొని ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసుటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి ఏఏఉ అంశాలు క్రోడికరించాలి తదితర అంశాల గురించి వివరించారు. ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి, కేసులు చేదించాలి. కేసుల్లో శిక్షల శాతం పెంచాలి. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి పూర్తి పారదర్శకంగా కేసులో ఇన్వెస్టిగేషన్ చేయాలి. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలి అక్రమ ఇసుక రవాణా, గంజాయి, గుట్కా, పేకాట పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమూలంగా నిర్మూలించాలి. ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, 60 రోజుల్లో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలి. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని, ప్రతి రోజు కేసులను ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. కేసులను అన్ని కోణాలలో ఇన్వెస్టిగేషన్ చేసి కేసు ఫైనల్ చేయాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా చేదించాలి అని తెలిపారు. సామాజిక అంశాలు అయిన సైబర్ నేరాల డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాల పైన ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎలక్షన్స్ పై ముందస్తు భద్రత పరమైన చర్యలు తీసుకోవాలని, గ్రామాలలో సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ శివ శంకర్, ఎస్సై లు వెంకటేశ్వర్లు, రాముడు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

## బీటెక్ విద్యార్థినికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/పెబ్బేరు:** సోషల్ రెస్పాన్సిబిలిటీ అనే కాన్సెప్ట్‌తో గద్వాలకు చెందిన యువకుల వాట్సాప్ గ్రూపు సభ్యులు సుగూరు గ్రామానికి చెందిన విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేశారు. వివరాల్లోకి వెళ్ళగా పెబ్బేరు మండల పరిధిలోని సూగూరు గ్రామానికి చెందిన జయలక్ష్మి హైదరాబాద్ లోని శ్రీ దేవి ఉమెన్స్ కాలేజీలో బిటెక్ థర్డ్ ఇయర్ సిఎస్సి చదువుతుంది. ఇటీవల కాలంలోనే తండ్రి పురుషోత్తం అనారోగ్యంతో మరణించారు. తల్లి పుష్ప దినసరి కూలీగా పనిచేస్తూ కూతురు జయలక్ష్మి చదివిస్తుంది. ఆర్థిక కారణాలతో కాలేజీల ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాల వారు జయలక్ష్మి చదువుకు నిరాకరించారు. దీంతో జయలక్ష్మి గద్వాలకు చెందిన సోషల్ రెస్పాన్సిబిలిటి టీంను సంప్రదించగా, వారు పూర్తిస్థాయిలో విచారించి శనివారం రోజు సుగూరు గ్రామానికి చెందిన జయలక్ష్మి రూ.45 వేల చెక్కును అందజేశారు. దీంతో జయలక్ష్మి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. సోషల్ రెస్పాన్సిబిలిటీ టీం సభ్యులను పలువురు అభినందించారు. ప్రతి ప్రాంతంలో ఇలాంటి అభ్యుదయ భావాలు ఉన్న కొంతమంది యువకులు గ్రూపులుగా ఏర్పడి అవసరం ఉన్న వారికి ఆర్థిక సహాయం అందించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ రెస్పాన్సిబిలిటీ టీం సభ్యులు సంజయ్, నగేష్, మురళి, బెంజిమెన్, ఉదయ్ కిరణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# జెడ్‌పి హైస్కూల్‌లో రిటైర్డ్ పెన్షనర్స్ సమావేశం



**ప్రజాపక్షం/మక్తల్ :** పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు బి.గోపాలం అధ్యక్షతన రెండవ శనివారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మక్తల్‌లో జరిగిన సమావేశంలో అధ్యక్షుడు బి.గోపాలం మాట్లాడుతూ.. గత, 2 సంవత్సరాల నుండి రిటైర్మెంట్ అయినా పెన్షనర్స్‌కు రావలసిన బెనిఫిట్స్ వెంటనే నగదు రూపంలో చెల్లించాలని, రిటైర్డ్ అయినా పెన్షనర్స్ చాలా అప్పులు చేసి, వడ్డీ చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రభుత్వము వెంటనే గ్రహించి వారికి రావలసిన బెనిఫిట్స్ చెల్లించాలని, అలాగే ఐదు డిఏలను, కొత్త పిఆర్సీ పి ధీపావళి కానుకగా వెంటనే నగదు రూపంలో చెల్లించాలని, రిటైర్డ్ అయినా ఎంప్లాయిస్‌కు కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఉచిత వైద్యం అందించాలని,, పెన్షనర్స్ దాచుకున్న డబ్బులను రిటైర్మెంట్ తర్వాత చెల్లించకుండా ప్రభుత్వము చాలా ఇబ్బందుల పాలు చేస్తుందని, ఇది చాలా సహించరాన్ని అన్యాయమని బి.గోపాలం తెలిపారు. మక్తల్ పెన్షనర్స్ సంఘం ఈ నెలలో జన్మించిన 84 సంవత్సరాల జనార్ధన్‌ను సంఘం అధ్యక్ష కార్యదర్శులు బి.గోపాలం, భాస్కర్, రాష్ట్ర నిర్మాణ కార్యదర్శి సూర్యప్రకాష్, కోశాధికారి సిద్ధి లింగయ్య శాలువలతో ఘనంగా సన్మానించి అభినందించారు. అలాగే నూతనంగా ఎన్నుకోబడిన మహిళ ప్రతినిధులను అరుణ, సుజాత, విద్యవతి, నర్వ పెన్షన్ సంఘం అధ్యక్షుడిగా బి. సంజన, ప్రధాన కార్యదర్శిగా నారాయణ రెడ్డి, కోశాధికారిగా ఎస్ ఎస్ రాములు, ఉపాధ్యక్షురాలుగా ప్రసన్న కుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకొని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు బి. గోపాలం, బి. భాస్కర్, రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి సూర్య ప్రకాష్, సిద్ధి లింగయ్య, తులసప్ప, నారాయణ రెడ్డి, దేవేంద్రప్ప, సురేందర్, రాములు, తిప్పన్న, జగదీష్, మల్లికార్జున్, సయ్యద్ మౌలానా, అశోక్, సత్యానారాయణ, అరుణ, నర్సయ్య, సుజాత నర్సమ్మ, 100 మంది సభ్యులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

## వరదలతో దెబ్బతిన్న రోడ్లు..

### ప్రజలకు తీవ్ర ఇబ్బందులు



**ప్రజాపక్షం/ ఉట్కూర్ :** ఉట్కూర్ మండల పరిధిలోని పులిమామిడి, బిజ్వార్, అవసలోనిపల్లి గ్రామాల మధ్య రహదారుల పై ప్రతి వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మూడు గ్రామాల మధ్య రాకపోకలను సులభతరం చేయడానికి హై లెవెల్ బ్రిడ్జిలు నిర్మించాల్సిన అవసరం తక్షణమే ఉందని సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ శనివారం పేర్కొన్నారు. వర్షాలు ప్రారంభమవగానే పులిమామిడి చెరువు కట్ట మలుపు వద్ద, అలాగే బిజ్వార్ అవసలోనిపల్లి వాగు పై నీరు ఉధృతంగా ప్రవహించడం వల్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని ఆయన వివరించారు. ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మాంచిన లో లెవెల్ బ్రిడ్జిలు ప్రస్తుతం ధ్వంసమై, వాటి పై నీరు ప్రవహించడంతో రహదారి గుంతలమయం అయిందని తెలిపారు. ఈ రహదారి పై ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, కార్లు, భారీ వాహనాలు తరచుగా ప్రయాణిస్తున్నప్పటికీ, ప్రజల ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆర్ & బి శాఖ అధికారులు స్పందించి హై లెవెల్ బ్రిడ్జిలను నిర్మించాలి, అప్పుడే గ్రామాల ప్రజలు ఈ సమస్యల నుంచి విముక్తి పొందుతారని మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

**ప్రజాపక్షం/వంగూర్ :** స్థానికసంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బిసి మహాసభ రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో జ్యోతిరావుపూలే చౌరస్తాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద‌వైఖరి అవలంభించిందని ఆయన విమర్శించారు. జరగబోయే స్థానిక ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేవరకు పోరాడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిసిసంఘం నాయకులు రమేష్‌చారి, సైదులు, సాయన్న, మంగలిగణేష్ పాల్గొన్నారు.

# రైతాంగానికి ఎంతో ప్రయోజనకరం

### ప్రధాన మంత్రి చేతుల మీదుగా ధన్-ధాన్య కృషి యోజన ప్రారంభం : కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** దేశవ్యాప్తంగా వెనకబడిన వంద జిల్లాల్లోని రైతులకు వ్యవసాయానికి చేయూతనందించడానికి కేంద్రప్రభుత్వం నేటినుంచి ప్రయోగాత్మకంగా మొదటివిడతలో నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజనను అమలు చేయాలనే నిర్ణయంతో నాగర్‌కర్నూల్ జిల్లా రైతాంగానికి ఈపథకం ఎంతో ప్రయోజకరంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం దేశరాజధాని ఢిల్లీ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి భారత ప్రధానమంత్రి నరేంద్రమోడి వర్చువల్ కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యువజన పథక కార్యక్రమాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషి విజ్ఞానకేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ , ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ అధికారులు మావిళ్ల విష్ణువర్ధన్‌రెడ్డి ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ రైతాంగానికి ఎంతో ప్రయోజనకరంగా ఉండేలా 11శాఖల్లో అమల్లో ఉన్న 36 పథకాలను సమ్మిళితం చేసి ఈపథకం అమలు కానున్నదని తెలిపారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం కోసం రైతుల ఆదాయం రెండురెట్లు చేయడం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్రారంభించిన పిఎం ధన్‌ధాన్యకృషి యోజన ప్రారంభం కానుందని ఆయన తెలిపారు. జిల్లాకు మొదటిదశలో ఎంపిక కావడం ఎంతో సంతోషకరమన్నారు. ఈపథకం ద్వారా జిల్లాలోని రైతులకు ఎంతోమేలు చేకూరుతుందని ఆయన అన్నారు.

**రైతులు మరింత ఆర్థికంగా ఎత్తుకు ఎదగడానికి**

రైతులముఖాల్లో ఆనందం చూడాలనేదే మామొదటి ప్రాధాన్యత అని ప్రధాన మంత్రి నరేంద్రమోడి పర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా అన్నారు. రైతులకు వ్యవసాయంలో ఎదురవుతున్న సమస్య సవాళ్ల పరిష్కారంలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయని రైతులకోసం ఖర్చుచేయడంలో వెనకాడేదిలేదని స్పష్టంచేశారు. న్యూఢిల్లీలోని భారత వ్యవసాయపరిశోధన సంస్థలో జరిగిన



ప్రత్యేక కృషి కార్యక్రమంలో వ్యవసాయ ఉత్పాదకతపెంపు, నీటిపారుదల సౌకర్యాల మెరుగుదల, రైతులకు సులభతర రుణాలకల్పనకోసం ఎంపికచేసిన వంద జిల్లాల్లో అమలుచేయనున్న ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషియోజన పథకం పప్పు ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేలా పప్పు ధాన్యాల స్వయంసమృద్ధి మిషన్ అనే రెండు పథకాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కృషివిజ్ఞానకేంద్రం పాలెం జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు, పిడిడిఆర్‌డిఎ చిన్న ఓబులేసు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జ్ఞానశేఖర్, జిల్లా విజయడైరీ డిడి, జిల్లా అనుబంధ వివిధశాఖల అధికారులు, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## 20 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/దేవరకొండ :** మండలంలోని ఇద్దంపల్లి గ్రామానికి చెందిన తగుళ్ళ పెద్ద మల్లయ్య, తగుళ్ళమల్లయ్య, తగుళ్ళ సందీప్, సునిత, రామ కృష్ణ, విష్ణు, ప్రభులతో పాటు 20కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో ఎంఎల్ఏ బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి ఎంఎల్ఏ బాలునాయక్ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మల్ రెడ్డి శ్రీలత రవీందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు హరి కృష్ణ, ఇద్దంపల్లి కాంగ్రెస్ నాయకులు పందుల వెంకటయ్య, ముత్తయ్య, వాసు, సతీష్, అజీమ్, స్వామి, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## 14న రాష్ట్ర వ్యాప్తబంద్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** బీసీల రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించిన సందర్భంగా జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య పిలుపుమేరకు ఈనెల 14న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన,బంద్ పాటించాలని నిర్ణయించడం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఎల్వి యాదవ్, బీసీ పొలిటికల్ జాక్ జేఏసి చైర్మన్ వైద్యుల సత్య నారాయణ తెలిపారు.సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మీనారాయణ అధ్యక్షతన శనివారం పట్టణంలోని బీసీ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 42 బీసీలకు రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ ఇస్తే కొంతమంది అగ్రవర్ణాల వారు వారి కుచ్చితమైన ధోరణితో బడుగు బలహీన వర్గాల రిజర్వేషన్ల పైన హైకోర్టుకు వెళ్లడం చాలా విచారకరమైన విషయం అన్నారు. బడుగు బలహీన వర్గాలను రాజకీయంగా అనగదొక్కాలని చూడడం వారి చెడునీ వారు కోరితెచ్చుకున్నట్లుగా భావించాలని తెలియజేస్తున్నారు. ఈ సమావేశం లో గుండు వెంకటేశ్వర్లు, కూరేళ్ల విజయకుమార్, మునాస ప్రసన్నకుమార్, భక్కతట్ల వెంకన్న,పుట్ట వెంకన్న గౌడ్,కట్ట హారిబాబు, సతీష్ యాదవ్,పగిల్ల కృష్ణ పాల్గొన్నారు.



## శ్రీ లక్ష్మీ నరసింహా స్వామిని దర్శించుకున్న హైకోర్టు చీఫ్ జస్టిస్

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ శనివారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా కలెక్టర్ హనుమంత రావు, ఆలయ ఈవో రవి నాయక్లు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో రవి నాయక్ చీఫ్ జస్టిస్కు స్వామివారి ప్రసాదం, చిత్ర పటాలను బహుకరించారు. ఆయనతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె. శరత్, జస్టిస్ కె.సుజన, జస్టిస్ వి.రామకృష్ణారెడ్డిలు కూడా స్వామివారిని దర్శించుకున్నారు. రాచకొండ సీపీ సుధీర్ బాబు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ గోపిరెడ్డి వీరారెడ్డి, డీసీపీ అక్షాంశ్ యాదవ్, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, యాదగిరిగుట్ట ఎమ్మార్వో గణేష్ నాయక్ తదితరులున్నారు.

## నవంబర్ 12న జరిగే సిఎస్ఆర్ సమ్మిట్‌కు గవర్నర్‌కు ఆహ్వానం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) సమ్మిట్ నిర్వాహకులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని గౌరవనీయులైన తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను అధికారికంగా ఆహ్వానించారు.ఈ గ్రాండ్ సమ్మిట్ నవంబర్ 12న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో జరగనుంది.ఈ సందర్భంగా సామాజిక బాధ్యత, స్థిరమైన అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన చొరవను అభినందిస్తూ, సమ్మిట్‌లో పాల్గొనడానికి గవర్నర్ ఆసక్తిని వ్యక్తం చేశారు.గవర్నర్‌తో జరిగిన సమావేశంలో వినీల్ రెడ్డి (లైసెన్సీ),ఎం. వి. గోన రెడ్డి (సిఈఓకోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్), జతిన్ జాంగీర్,రాగ సమన్విత పాల్గొన్నారు.ప్రభావవంతమైన సమాజ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడానికి ,స్థిరమైన వృద్ధిని ప్రోత్సహించడానికి కార్పొరేట్‌లు, ప్రభుత్వ విభాగాలు,స్వచ్ఛంద సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం దక్షిణ భారత సమ్మిట్ లక్ష్యం అన్నారు.

## వృద్ధురాలిపై దాడి చేసి... బంగారం దోపిడీ!



**ప్రజాపక్షం/హాలియా:** ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళపై వ్యక్తి దాడి చేసి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడును దోచుకెళ్ళిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సంఘటనకు సంబంధించిన వివరాలు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన అయితగోని సత్తెమ్మ అనే వృద్ధ మహిళలపై నరేందర్ అనే వ్యక్తి ఒంటరిగా ఉన్న మహిళ ఇంటి వద్దకు శుక్రవారం మధ్యాహ్నం వచ్చి ఆమెపై దాడి చేసి ఆమె మెడలో ఉన్న మూడు తులాల పుస్తెలతాడును లాక్కొని పరారైనట్లు తెలిపారు. ఈ ఘటనలో అయితేగోని సత్యమ్మ తీవ్రంగా గాయపడినట్లు వారు తెలిపారు. ఆమె పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు హాలియాలోని ఒక ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. ఇదే విషయమై బాధితురాలు కుమారుడు అయితేగోని శ్రీనివాస్ హాలియా పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న హాలియా సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ రెడ్డి, ఎస్సై సాయి ప్రశాంత్ లు సంఘటన స్థలానికి చేరుకొని సంఘటనకు సంబంధించిన వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మూడుతులాల బంగారు పుస్తెలతాడును దొంగిలించి పారిపోయిన నిందితుడని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆడ పిల్లలకు సమాన హక్కులు కల్పించటం అందరి బాధ్యత

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రతి బాలికకు విద్య, ఆరోగ్యం, భద్రత, కల్పించటం మన బాధ్యత అని అశ్రీత కోఆర్డినేటర్ శోభారాణి అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం ప్రస్కరించుకొని పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో బాలికా దినోత్సవం జరిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలకు సమాన హక్కులు, సమాన భవిష్యత్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. బాలికలకు ఎలాంటి సమస్య వచ్చిన వెంటనే 1098 కి కాల్ చేయాలని, బాల్యవివాహాలు చేసుకోకూడని, ఎవరైనా చేస్తున్నట్లు తెలిస్తే టోల్ ఫ్రీ కి తెలియజేయాలన్నారు.ప్రిన్సిపల్ సంధ్య మాట్లాడుతూ పిల్లందరు మొబైల్స్, చెడు స్నేహాలు చేయకుండా పెద్దలు చెప్పినట్లుగా విని బాగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. చివరగాబాలికల చేత కేక్ కట్ చేసి,ప్రతిజ్ఞ చేశారు. కో ఆర్డినేటర్ మహేష్, ధనమ్మ ఝాన్సీ,కవిత, రమేష్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.




# ధాన్యం దిగుబడిలో తెలంగాణ రికార్డు

### స్వతంత్ర భారతదేశంలో అత్యధిక ఉత్పత్తి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ

### మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** ధాన్యం దిగుబడిలో తెలంగాణ అరుదైన రికార్డ్ అని, స్వతంత్ర భారతదేశంలో అత్యధిక ఉత్పత్తి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ అని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. వానాకాలం ధాన్యం కొనుగోలుపై యాదాద్రి భువనగిరి జిల్లా సమీకృత కలెక్టరేట్ ప్రాంగణంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సాగు అయిన మూడు పంటలలోనూ రికార్డు స్థాయిలో ఉత్పత్తి ఆయిందన్నారు. ఈ వానాకాలంలో 148.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. భారతదేశ చరిత్రలోనే ఈ దిగుబడి సంచలనం సృష్టిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కల సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ అనుకూల విధానాల తోటే రికార్డ్ స్థాయిలో ఉత్పత్తి వచ్చిందన్నారు. ధాన్యాం కొనుగోలుకు రంగం సిద్ధం చెయ్యాలన్నారు. 66.80 లక్షల ఎకరాలలో 148.03 లక్షల ఎకరాల దిగుబడి, దిగుబడి అయిన మొత్తంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాట్లు చెయ్యాలన్నారు. 40 లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలు, 40 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకాల కొనుగోలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8342 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఐ కే పి ద్వారా 3517,పి.ఏ.సి.ఎస్ ద్వారా 4259,ఇతర ప్రాంతాలలో 566 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఇప్పటికే 1205 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయ్యాయన్నారు. కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సిద్దిపేట, నల్లగొండ జిల్లాలో 1205 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాల్లన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై ఈ నెల 16 న ప్రత్యేక సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోళ్ల లో అనుసరించల్సిన విధి విధానాలను క్షేత్ర స్థాయిలో అధికారులకు పంపించాము అన్నారు. వానాకాలం కొనుగోళ్ల ప్రక్రియను ఈ నెల మొదటి తేదీ నుండి ప్రారంభించాం అన్నారు. వానాకాలం కొనుగోళ్ల ప్రక్రియ జనవరి నెల రెండో వారం నాటికి పూర్తి అవుతాయన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్, శాసనసభ్యులు కుంభం అనిల్ రెడ్డి, మందుల శ్యామ్యోల్, పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇఎన్.సి అంజద్ హుస్సేన్,కలెక్టర్ మంత్రిప్రగడ హనుమంతరావు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు దామోదర్‌రెడ్డి సంతాప సభకు సిఎం రాక

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** తుంగతుర్తి మండల కేంద్రంలో నేడు (ఆదివారం) దివంగత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంతాప సభలో పాల్గొనడానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఆయనతోపాటు డిప్యూటి సిఎం భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. శనివారం జిల్లా ఎస్‌పి కె నరసింహ జిల్లా అధికారులు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో సిఎం, మంత్రుల రాక సందర్భంగా హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించి, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆర్‌డిఓ వేణుమాధవ్, డిఎస్‌పి ప్రసన్న కుమార్, సిఐ నరసింహారావు, ఈఈ సీతారామయ్య, డిఈ పద్మావతి, ఎస్ఐ క్రాంతికుమార్, డిసిసి అధ్యక్షులు, రాష్ట్ర రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు వెంకన్న యాదవ్, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పాల్గొన్నారు.

# కేసుల దర్యాప్తులో ప్రణాళికలతో ముందుకు

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** కేసుల దర్యాప్తులో నైపుణ్యం ప్రణాళికలతో ముందుకు వెళ్ళాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దీర్ఘకాలిక పెండింగ్ కేసుల పరిష్కారం, పోలీసు సిబ్బంది సంక్షేమం, ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండడం, రౌడీషీటర్స్ ట్రబుల్ మాంగర్స్‌పై నిఘా, సాంకేతిక సద్వినియోగం, పోలీసు లక్ష్యాలు, ఉద్దేశ్యం అనే అంశాలపై డిఎస్‌పిలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పోలీస్ విభాగం ప్రజలకు వేగవంతమైన నాణ్యమైన, నైపుణ్యంతో కూడిన పారదర్శకమైన పోలీస్ సేవలను అందించడానికి కృతనిశ్చయంతో ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పోలీసు విధులను ఇన్‌స్పెక్టర్లు, డిఎస్‌పిలు నిషితంగా పర్యవేక్షించాలని అప్పుడే ఆధునిక పోలీసింగ్ విజయవంతంగా ముందుకు వెళ్ళడం ద్వారా సాంకేతికపరమైన సేవలను విస్తృతపరచవచ్చని వివరించారు. ఇందుకోసం ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండడం చాలా ముఖ్యమని, పోలీస్ స్టేషన్లలో కిందిస్థాయి సిబ్బంది నుండి పైస్థాయి వరకు ప్రతి ఒక్కరి సంక్షేమం చూస్తూనే విధుల నిర్వహణలో పటిష్టంగా పనిచేసేలా కృషి చేయాలని తెలిపారు. ప్రజల రక్షణలో భద్రతలో బాధ్యతగా ఉండాలని ప్రతి ఫిర్యాదుదారునికి నమ్మకం కలిగించేలా పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. రౌడీ షీటర్స్ ట్రబుల్ మాంగర్స్‌పై జిల్లా వ్యాప్తంగా పటిష్ట నిఘా ఉంచామన్నారు. వారి యొక్క స్థితిగతులను ఎప్పటికప్పుడు డిజిటల్ జియో ట్యాగింగ్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కేసుల ధర్యాప్తులో నైపుణ్యం సాధించాలని ప్రతి కేసును త్వరితగతిన చేధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పిలు రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, డిఎస్‌పిలు ప్రసన్నకుమార్, రవి, నరసింహచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ హరిబాబు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, వెంకటయ్య, నాగేశ్వరరావు, శివశంకర్, రామకృష్ణారెడ్డి, చరమందరాజు, ఐటి టెక్నాలజీ ఆర్ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.



## ఆధార్ సెంటర్ కోసం వినతి

**ప్రజాపక్షం/ఆలేరు :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆలేరు మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ ఆలేరు పట్టణంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, గతంలో పోస్ట్ ఆఫీస్‌లో అందుబాటులో ఉన్నప్పటికి ఇపుడు లేకపోవడం వల్ల జనగాం లేక భువనగిరి వెళ్ళవలసి వచ్చి ప్రజలు నానా అవస్తలకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలేరులో తక్షణమే ఆధార్ లింకు సెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రజలను ఆదుకోవాలని సిపిఐ పార్టీ తరపున సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, టౌన్ కార్యదర్శి కొట్టిపవుల శ్రీనివాసరాజు, సహాయ కార్యదర్శి బొడ్డు ఆంజనేయులు, కందుల మధు, మండల నాయకులు పొన్న బోయిన రవి, రాజు, అభి, యాదగిరి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఎదుగుదలకు సౌకర్యాలు కల్పిస్తాం

### రాష్ట్ర వెనుకబడిన తరగతుల పాఠశాల సెక్రటరీ సైదులు



**ప్రజాపక్షం/నందికొండ:** విద్యార్థుల శ్రేయస్సే తమకు ప్రదానమని విద్యార్థుల ఎదుగుదలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాల సెక్రటరీ బి.సైదులు అన్నారు.స్థానిక మహాత్మా జ్యోతిభాపులే గురుకుల పాఠశాల,నావ పూర్వ విద్యార్థులు, ప్రిన్సిపాల్ రవి కుమార్ ఆధ్వర్యంలో 25వ మెడికల్ క్యాంప్ సిల్వర్ జూబ్లీ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెక్రటరీ బి.సైదులు ముఖ్యఅతిథిగా విచేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా సరైన బోధన ఉపకరణాలను ఉపయోగించి పాఠ్యాంశాలు బోధించాలని అప్పుడే విద్యార్థులు విద్యలో రాణిస్తారని అవి విద్యార్థులు ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయని పదవ తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రతి ఒక్క ఉపాధ్యాయులకుపదవ తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రతి ఒక్క ఉపాధ్యాయులు కృషి చేసే విధంగా ప్రిన్సిపాల్ రవికుమార్ ఆర్‌సిఓ స్వప్నను ఆదేశించారు. సాగర్‌లో డిగ్రీ కళాశాల కొరకు భవనాన్ని నిర్మిస్తున్నామని ఈ క్యాంపస్‌లో ఉన్న డిగ్రీ కళాశాలను ప్రస్తుతం తాత్కాలికంగా నిడమనూరులో ఏర్పాటు చేసి భవన నిర్మాణం పూర్తయిన తర్వాత మళ్లీ డిగ్రీ కళాశాలను తిరిగి ఇక్కడ ఏర్పాటు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో నావ కన్వీనర్ భాస్కర్ రెడ్డి, పూర్వ విద్యార్థి జనరల్ సర్జన్ డాక్టర్ కిషోర్, ఫౌండర్ చిట్ల చక్రపాణి,సెక్రటరీ శివాజీ, ట్రెజరర్ చార్టెడ్ అకౌంటెంట్ సైదులు,25వ మెడికల్ క్యాంపు సమన్వయ కర్త కొత్తపల్లి నితీష్, ఎన్ఎస్ఎస్ కాలేజీ కో ఆర్డినేటర్ జన నాగరాజు ఏన్‌సిసి ఆఫీసర్ వెంకటేష్ పూర్వ విద్యార్థులు పాఠశాల,కళాశాలల విద్యార్థులు,ఉపాధ్యాయులు అధ్యాపకులు పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారు పండించిన వరి ధాన్యం మొత్తం ప్రభుత్వం మద్ధతు ధరతో కోనుగోలు చేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. శనివారం మండలంలోని వివిధ గ్రామంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిసిన సంవత్సరాలో ఏ ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని,రైతులు అందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. రైతులు అందరూ దళారుల బారిన పడకుండా ఉండాలని సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎంట్రీ రిజిస్టర్ ఏర్పాటు చేశామని,ఎంత ధాన్యం వచ్చిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్‌చైర్మన్ ఐతరాజు యాదయ్య,అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## పారదర్శకంగా డిసిసి అధ్యక్షుడి ఎంపిక

### ఎఐసిసి మాజీ జనరల్ సెక్రెటరీ బిశ్వరాజన్ మహంతి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజాస్వామ్య యుతంగా,పార్టీ నాయకులు, కార్యకర్త మనోభావాలను, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని డిసిసి అధ్యక్షుని నియామకం చేపట్టడం జరుగుతుందని ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రెటరీ విశ్వరాజన్ మహంతి తెలిపారు.డిసిసి ఎన్నిక ప్రక్రియలో భాగంగా శనివారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏఐసీసీ మాజీ జనరల్ సెక్రెటరీ విశ్వరాజన్ మహంతి, ఏఐసిసి కార్యదర్శి, జిల్లా అబ్జర్వర్ సంపత్ కుమార్, ఎమ్మెల్సీ శంకర్ నాయకులు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేలా కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంటుందని డిసిసి అధ్యక్షుడు నియామకం తర్వాత బ్లాక్,మండల, గ్రామస్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఎంపిక నిర్వహిస్తామని తెలిపారు.జిల్లాలో 10 రోజులపాటు పర్యటించి వివిధ నియోజకవర్గాలలో నాయకుల, కార్యకర్తల అభిప్రాయాలను తీసుకుంటామని రాహుల్ గాంధీ దిశా నిర్దేశంతో పారదర్శకంగా డిసిసి అధ్యక్షుని ఎంపిక చేయడం జరుగుతుందన్నా రు.కాంగ్రెస్ పార్టీ ఆలోచన ఆనుగొనంగా పార్టీకి అంకితభావంతో పనిచేసే వారిని,అందరినీ సమన్వయంతో పార్టీని ముందుకు నడిపించే వ్యక్తిని ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.రాజకీయ సమీకరణలను, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని దరఖాస్తులను ఏఐసిసికి అందజేయడం జరుగుతుందని వెల్లడించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డికి ఇవ్వాలని నియోజకవర్గ పార్టీ కార్యకర్తలంతా ఏకగ్రీవంగా తీర్మానం చేస్తూ విశ్వరాజన్ మహంతి, సంపత్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/మునుగోడు:** ప్రస్తుత పరిస్థితులలో వివిధ రోగాల బారినపడి ఆసుపత్రికి వచ్చిన రోగులకు వ్యాపార దృక్పథంతో కాకుండా సామాజిక దృక్పథంతో వైద్య సేవలు అందించి వారి ప్రాణాలు కాపాడేందుకు కృషి చేయాలని ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం వైద్యలకు సూచించారు.మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన రమేష్ స్పెషాలిటీ వైద్యశాలను డిసిసిబి ఉమ్మడి జిల్లా చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డితో కలసి ప్రారంభించారు. ఈసందర్బంగా సత్యం మాట్లాడుతూ మునుగోడు ప్రాంత పేద ప్రజలకు వైద్యం అందించాలని సంకల్పంతో ఎంబిబిఎస్ పట్టా పొంది ముందుకు వచ్చిన డాక్టర్ రమేష్ ను అభినందించారు. కార్యక్రమంలో చండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ,బొల్గూరి నరసింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, సురిగి చలపతి, చాపల శ్రీను, పాండు పాల్గొన్నారు.



### సైదులు మరణం తీరని లోటు

సిపిఐ నాయకులు దుబ్బ సైదులు అకాల మరణం పార్టీకి తీరని లోటని ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. గత కొంత కాలంగా కిడ్నీ వ్యాది సమస్యతో బాధపడుతూ ఇటీవల సైదులు మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎంఎల్ సి సత్యం శనివారం ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్బంగా సైదులు పార్టీకి చేసిన సేవలను గుర్తు చేశారు.ఆయన వెంట సిపిఐ నాయకులు బొల్గూరి నరసింహ, తీర్పారి వెంకటేశ్వర్లు, సురిగి చలపతి, చాపల శ్రీను, గోస్కొండ లింగయ్య,మందుల పాండు, వనం వెంకన్న, దుబ్బ వెంకన్న, మునుగోటి దయాకర్, మల్లేష్ పాల్గొన్నారు.

## ఉచిత పశువైద్య శిబిరం

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని రాజాపేట తండా గ్రామంలో శనివారం పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 12 గేదెలు, 4 ఆవులకు చూడి పరీక్షలు, 14 గేదెలు, 6 ఆవులకు గర్భకోశ చికిత్సలు, 16 గేదెలకు సాధారణ చికిత్సలు చేసినట్లు డాక్టర్ సురేందర్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ యమున, ఏ.ఎల్లేష్, సహాయకులు శివతో పాటు రైతులు పాల్గొన్నారు.

## నూతన పిఆర్‌సి కమిటీ నివేదిక ప్రకటించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన నూతన పిఆర్‌సి కమిటి రిపోర్టును వెంటనే ప్రకటించి అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సూర్యాపేట నందు జిల్లా అధ్యక్షులు ఎన్ సోమయ్య అధ్యక్షతన జిల్లా ఆఫీస్ బేరర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల కరువు భత్యం (డిఏ)లను వెంటనే ప్రకటించాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పదవివిరమణ పొందిన ఉద్యోగుల పెన్షనరీ బెనిఫిట్స్‌కి సంబంధించిన బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ అనిల్‌కుమార్, జి వెంకటయ్య, ఆర్ దామోదర్, ఎన్ నాగేశ్వర రావు, బి ఆడం, ఎస్ సోమయ్య, వెలుగు రమేష్, చిలక రమేష్, డి లాలు, కె పాండు రంగచారి, కె బాల సైదిరెడ్డి, ఎం రవీందర్, సాంబయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



క్రీడ

# ఆ విషయం ముందే చెప్పారు..

2027 ప్రపంచ కప్ ఆడాలని ఉంది: రవీంద్ర జడేజా

అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాతో భారత్ మూడు వన్డేల సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్‌కు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాను ఎంపిక చేయలేదు. దీంతో అతడి వన్డే కెరీర్ ముగిసిందా? వచ్చే ప్రపంచ కప్‌నకు ఎంపిక చేయరా? అనే చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వెస్టిండీస్‌తో రెండో టెస్టు ఆడుతున్న జడేజా తనను ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ఎంపిక చేయకపోవడంపై స్పందించాడు. ఈ విషయం గురించి మేనేజ్‌మెంట్ ముందుగానే తనతో మాట్లాడిందన్న జడేజా.. ఒకవేళ అవకాశం వస్తే ప్రపంచ కప్‌లో ఆడాలని ఉందని తన మనసులోని మాటను బయటపెట్టాడు. 'నేను వన్డేలు ఆడాలనుకుంటున్నాను. కానీ అది నా చేతుల్లో లేదు. నన్ను ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఎంపిక చేయలేదు. టీమ్ మేనేజ్‌మెంట్, సెలక్టర్లు, కోచ్, కెప్టెన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. జట్టుకు ఎంపిక చేయకపోవడం గురించి ముందే నాతో మాట్లాడారు. ఎంపిక చేయకపోవడానికి గల కారణాలను నాకు వివరించారు. ఇందుకు నేను సంతోషంగా ఉన్నా. కానీ, తదుపరి అవకాశాలు వచ్చినప్పుడల్లా నేను ఇన్నాళ్లూ ఎలాగైతే ఆడానో దాన్నే కొనసాగించడానికి ప్రయత్నిస్తాను. అవకాశం వస్తే ప్రపంచ కప్‌లో ఆడతా. ఆ ప్రధాన టోర్నీకి ముందు భారత్ కొన్ని వన్డేలు ఆడనుంది. నేను ఆ మ్యాచ్‌ల్లో బాగా రాణించి ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకుంటే కచ్చితంగా అది భారత క్రికెట్‌కు లాభం చేకూర్చుతుంది. ప్రపంచ కప్ గెలవాలనేది ప్రతి ఒక్కరి కల. గత ప్రపంచ కప్‌ను త్రుటిలో చేజార్చుకున్నాం. ఈ సారి ఆ కలను సాకారం చేసుకోవడానికి ప్రయత్నిస్తాం' అని రవీంద్ర జడేజా పేర్కొన్నాడు.



విండీస్‌తో జరిగిన తొలి టెస్టులో బ్యాటింగ్‌లో 104 పరుగులు చేసి అజేయంగా నిలవడంతోపాటు నాలుగు వికెట్లు పడగొట్టిన జడేజా.. రెండో టెస్టులోనూ రాణిస్తున్నాడు. జడ్డూ (3/37) విజృంభించడంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఫస్ట్ ఇన్నింగ్స్‌లో విండీస్ 140/4తో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 518/5 వద్ద డిక్లేర్ చేసిన విషయం తెలిసిందే.




# హ్యాట్రిక్ విజయంతో అగ్రస్థానంలో ఇంగ్లాండ్

మహిళల వన్డే వరల్డ్ కప్‌లో ఇంగ్లాండ్ విజయ గర్జన కొనసాగుతోంది. తొలి రెండు మ్యాచుల్లో భారీ తేడాతో గెలిచిన ఫేవరెట్ శ్రీలంకనూ ఓడించింది. నాట్ సీవర్ బ్రంట్(117) కెప్టెన్ శతకంతో భారీ స్కోర్ అందించగా.. బంతితో సోఫీ ఎకిల్‌స్టోన్ (4–17) మ్యాజిక్ చేసింది. లంక మిడిలార్డర్‌ను కూల్చిన ఈ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ లంకను ఓటమి అంచుల్లోకి నెట్టింది. బ్రంట్ కూడా రెండు వికెట్లు తీయగా ఆతిథ్య జట్టు పరాజయాన్ని తప్పించుకోలేకపోయింది. వరుసగా మూడో విజయంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది మాజీ ఛాంపియన్. ఉపఖండంలో జరుగుతున్న పదమూడో సీజన్ వన్డే వరల్డ్ కప్‌లో ఇంగ్లాండ్ జోరు చూపిస్తోంది. తొలి పోరులో దక్షిణాఫ్రికాను, ఆపై బంగ్లాదేశ్‌ను వణికించిన ఇంగ్లాండ్. కో హోస్ట్ శ్రీలంకను మట్టికరిపించింది. కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ సుడిగాలి సెంచరీతో విరుచుకుపడగా లంకకు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. భారీ ఛేదనలో ఆరంభం నుంచి తడబడిన ఆతిథ్య జట్టు ఏదశలోనూ విజయం దిశగా సాగలేదు.

### టాపార్డర్ వైఫల్యంతో..

సొంతగడ్డపై చెలరేగి ఆడతారనుకుంటే శ్రీలంక బ్యాటర్లు నిరాశపరిచారు. ఇంగ్లాండ్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ సోఫీ ఎకిల్‌స్టోన్(45) విజృంభణతో మేము ఆడలేమంటూ డగౌట్‌కు క్యూ కట్టారు. విష్మీ గుణరత్నే (15) కాసేపు నిలబడినా.. చార్లీ డీన్ ఓవర్లో క్లీన్ బౌల్డ్ అయింది. ఆ తర్వాత ఎకిల్‌స్టోన్ తన స్పిన్ మ్యాజిక్ చూపిస్తూ.. క్రీజులో కుదురుకున్న ఓపెనర్ హాసిని పెరీరా(35)ను, హర్షిత సమరవిక్రమ (33)లను ఔట్ చేసింది.

ఆ షాక్ నుంచి తేరుకునేలోపే కవిష దిల్హారి(4)ను పెవిలియన్ పంపి లంకను కోలుకోలేని దెబ్బతీసింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఆటపట్టు (15) కూడా పెద్ద షాట్లు ఆడలేకపోయింది. ఆమె కూడా ఎకిల్‌స్టోన్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ కావడంతో 116 వద్ద లంక సగం వికెట్లు పడ్డాయి. నాట్ సీవర్ రెండు వికెట్లు తీసి లంకన ఓటమిని ఖాయం చేయగా.. స్మిత్ వేసిన 46వ ఓవర్లో ప్రబోధిని ఔట్ కావడంతో 164కే లంక ఆలౌటయ్యింది. 89 పరుగుల తేడాతో గెలుపొందిన ఇంగ్లండ ఆరు పాయింట్లతో అగ్రస్థానానికి ఎగబాకింది.

ప్రపంచ కప్‌లో ఇంగ్లాండ్ విజయాల్లో కీలకం అవుతున్న కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ (117) శ్రీలంకపైనా చెలరేగింది. టాపార్డర్ విఫలమైనా.. మిడిలార్డర్ సాయంతో జట్టుకు కొండంత స్కోర్ అందించింది. ప్రేమదాస మైదానంలో శ్రీలంక బౌలర్లకు చుక్కలు చూపించిన ఆమె. ఎడాపెడా ఉతికే బౌండరీలతో ఐదో సెంచరీ సాధించింది. టమ్మీ బ్యూమంట్(32), హీథర్ నైట్(29)లు తోడ్పాడునందించగా నిర్ణీత ఓవర్లలో 253 రన్స్ చేసింది ఇంగ్లాండ్.




# కళ్లు తిరిగే బంగారం ధరలు

ఈవారం గతంలో ఎన్నడూ లేని విధంగా భారత దేశం మొత్తం బులియన్ మార్కెట్ వైపే చూసింది. బంగారం ధరలు ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరాయి. ఒకప్పుడు 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర రూ.63,000 వద్ద ఉండగా, ఇప్పుడు అది ఏకంగా రూ.1.24 లక్షలకు పైగా పెరిగింది. ఇంతటి పెరుగుదలకు కేవలం డిమాండ్ ఒక్కటే కారణం కాదనేది వాస్తవం. అంతర్జాతీయ షేర్ మార్కెట్లు వివిధ రకాలైన అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, మదుపరులు ఎక్కువగా 'సేఫ్ గేమ్' ఆడేందుకే మొగ్గు చూపుతున్నారు. బంగారంపై పెట్టుబడిని మించిన సేఫ్ గేమ్ లేదన్న అభిప్రాయానికి వస్తున్నారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు, జియోపాలిటికల్ ఉద్రిక్తతలు అన్నీ కలిపి బంగారాన్ని మరింత విలువైన ఆస్తిగా మార్చాయి. గత కొన్నినెలలుగా ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు రిస్కీ ఆస్తుల కంటే సురక్షితమైన పెట్టుబడులను ఆశ్రయిస్తున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలు కూడా బంగారం ధరలను పెంచుతున్నాయి. వడ్డీ రేట్లు తగ్గినప్పుడు డాలర్ బలహీనమవుతుంది. బంగారం ఎక్కువగా డాలర్‌లోనే ట్రేడ్ అవుతుంది కాబట్టి, పెట్టుబడికి సరైన మార్గంగా కనిపిస్తుంది. ప్రపంచ రాజకీయాలు అనిశ్చితంగా మారిన ప్రతిసారి పెట్టుబడిదారులు స్టాక్స్, క్రిప్టో కరెన్సీల నుండి బయటకు వచ్చి బంగారం వైపు మారడం సహజం. కరెన్సీ విలువలు పడిపోయినా, బంగారం విలువ సాధారణంగా పెరుగుతుంది. ఈ ఏడాది కూడా అదే జరిగింది. ప్రపంచంలో రెండవ అతి పెద్ద బంగారం వినియోగదారుగా భారత్‌లో నిత్యం పండుగలు, వివాహాలు, సాంప్రదాయ అలవాట్ల వల్ల బంగారానికి డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. భవిష్యత్తులో బంగారం ధరలు పెరుగుతాయన్న వార్తలు రావడంతో, ఈ ఏడాది ఆరంభం నుంచే చాలా మంది కొనుగోళ్లు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఆదాయాలు పెరగడం వల్ల కూడా బంగారం కొనుగోలు పెరిగింది. భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) కూడా తన గోల్డ్ రిజర్వ్‌లను పెంచుతోంది. ఈ అన్ని అంశాలు కలిపి దేశీయ మార్కెట్‌లో బంగారం కొరతను సృష్టించాయి, దాంతో ధరలు రికార్డు స్థాయికి చేరాయి.

# లాభాల్లోనే ముగిసిన స్టాక్ మార్కెట్

అంతర్జాతీయ అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ, మన దేశంలో స్టాక్ మార్కెట్లు ఈవారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో 30 బెంచ్‌మార్క్ సెన్సెక్స్ సూచీ 710.70 పాయింట్లు మెరుగుపడి, 82,500.82 పాయింట్ల వద్ద ముగిసింది. వారం ప్రారంభంలో (అక్టోబర్ 6న) సెన్సెక్స్ 81,790.12 పాయింట్ల వద్ద మొదలైంది. వారాంతపు లావాదేవీలు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొన్నాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి అమ్మకాల ఒత్తిడి పెరిగినప్పటికీ, స్వదేశీ మదుపరులు ఆదుకున్నారు. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ కూడా ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొంది. ఈవారం 25,077.65 పాయింట్లతో మొదలైన నిఫ్టీ, శుక్రవారం (అక్టోబర్ 10) 25,285.35 పాయింట్ల వద్ద ముగిసింది. అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ స్వల్ప లాభాలను పోగు చేసుకోవడంతో, వచ్చే వారం లావాదేవీలు కూడా ఇదే రీతిలో సాగుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతున్నది. ఇటీవల కొంతకాలంగా మార్కెట్లు తీవ్రమైన ఒడిదుడుకులు లేకుండా స్థిరంగా సాగుతున్నాయి. ఈనెల మెరుగైన ఫలితాలే కనిపించడం ఇందుకు ఉదాహరణ. ఐటి, మెటల్ రంగాలకు చెందిన స్టాక్స్ లాభాల్లో ట్రేడ్ అయ్యాయి. విదేశీ పెట్టుబడిదారుల నుంచి ప్రగతిశీల కొనుగోళ్లు నమోదుకావడం విశేషం. అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించనున్నదన్న వార్తలు నిజమైతే, గ్లోబల్ మార్కెట్‌లో లిక్విడిటీ మెరుగవుతుంది. మార్కెట్లకు సానుకూల మద్దతు లభిస్తుంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో, వచ్చే వారం స్టాక్ మార్కెట్లు స్థిరమైన ప్రస్థానాన్ని కొనసాగించే అవకాశాలు ఉన్నాయి.

# టెక్ పరిశ్రమలో 'నిశ్శబ్ద' తొలగింపులు!

దేశ టెక్ పరిశ్రమలో లేఆఫ్‌ల సీజన్ నడుస్తున్నట్టు కనిపిస్తున్నది. వివిధ కంపెనీలు నిశ్శబ్ద తొలగింపు ప్రక్రియను కొనసాగిస్తున్నాయి. ఈ సంవత్సరం చివరి నాటికి 50 వేలు లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు నేరుగా లేదా పరోక్షంగా ఈ ఒరవడి కారణంగా ప్రభావితులయ్యే అవకాశముంది. కంపెనీలు అధికారికంగా ఉద్యోగులను తొలగించడాన్ని ప్రకటించకుండా, కొందరు ఉద్యోగులను ప్రేరేపించడం, రాజీనామా చేయమని అడగడం, లేదా కొత్త పాత్రల్లో మార్చడం ద్వారా ఉద్యోగాలను తగ్గించే విధానాన్నే 'నిశ్శబ్ద తొలగింపు'గా పేర్కొంటారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) ఈ సంవత్సరం జులైలో ప్రకటించిన 2 శాతం, అంటే సుమారు 12 వేల మంది ఉద్యోగుల తొలగింపు వార్త చాలా మందికి ఆశ్చర్యంగా అనిపించింది. టిసిఎస్ వంటి పెద్ద కంపెనీ సహజంగా ఉద్యోగ భద్రతపై ఎక్కువ దృష్టి కేటాయించినప్పటికీ, ఈ కొత్త నిశ్శబ్ద తొలగింపు విధానం, ఇతర పెద్ద, మధ్య తరహా టెక్ సేవల సంస్థల్లో కూడా అనుసరిస్తున్నారు. అనేక కంపెనీలు ఉద్యోగులను అధికారికంగా తొలగించకుండా, వారు రాజీనామా చేసే పరిస్థితులు సృష్టించి, తొలగించడం కొత్త ట్రెండ్‌గా మారింది. ఇలాంటి నిశ్శబ్ద తొలగింపుల ప్రభావం మూలంగా ఉద్యోగులు తీవ్ర అభద్రతా భావానికి గురవుతున్నారు. దీనితో వారు సాంకేతిక, మానసిక ఒత్తిడికి గురై, పనిపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సిఎల్ వంటి దిగ్గజ ఐటి కంపెనీలు తమతమ ప్రాజెక్టు అవసరాలు, ఖర్చుల నియంత్రణ




వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని నిశ్శబ్ద తొలగింపు విధానాన్ని అనుసరిస్తున్నాయని ఇటీవలి పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. కొన్ని పెద్ద కంపెనీలు అధికారిక ఉద్యోగ తొలగింపుల రౌండ్‌ను అనుసరించకుండా, పనితీరు ఆధారంగా తొలగింపులు, స్వచ్ఛంద విభజన, ప్రాజెక్ట్ రీఅసైన్‌మెంట్ ద్వారా ఉద్యోగులను పింక్ కార్డులు ఇస్తున్నాయి. మొత్తం మీద నిశ్శబ్ద తొలగింపుల ప్రక్రియ టెక్ పరిశ్రమ ఉద్యోగులను తీవ్ర భయాందోళనలకు గురి చేస్తున్నది. ఎప్పుడు ఉద్యోగం ఉంటుందో, ఎప్పుడు ఇంటిదారి పట్టాల్సి వస్తుందో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వచ్చే ఏడాది వరకూ ఈ ఒరవడి కొనసాగుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# సిపిఐలో 40కుటుంబాలు చేరిక

పేదల సంక్షేమమే సిపిఐ ఎజెండా

సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** లక్ష్మీ దేవిపల్లి మండలం ఉమ్మడి బంగారు చెలక గ్రామపంచాయితీ పరిధిలోని లక్ష్మీ పురం గ్రామపంచాయితీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 40 కుటుంబాలు వారు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా సమక్ష్యంలో శనివారం భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. ఆర్లగండి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీ పురం పంచాయితీ మాజీ సర్పంచ్ బాడిశ మోహన్ రావు, గ్రామపెద్దలు శంకర్, తాటి రాంబాబు, గోపాల్, సూర్యప్రకాశ్, నరేష్ తదితరులకు ఎర్రజెండా కప్పి పార్టీలోనికి పాషా ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారు మూల ఏజెన్సీలో నివశిస్తున్న ఆదివాసీ కుటుంబాల వారికి సిపిఐ అండని, వారికి తరుపున అండగా నిలబడి సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా కృషి చేస్తుందని చెప్పారు. సిపిఐ పట్టణాలకు మాత్రమే పరిమితమై ఉండదని, పేదలు ఏ మారుమూల నివశించిన వారి సంక్షేమం కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఎంఎల్‌ఏ కూనంనేని ఏజెన్సీ గ్రామాలపై దృష్టి సారించి అభివృద్ధి బాటలు వేస్తున్నారని చెప్పారు. గత నాయకులు మారుమూల పల్లెలను కనీసం పట్టించుకోలేదని, అందుకే ఏజెన్సీ ప్రజలు సిపిఐ వైపు చూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి దీటి లక్ష్మీ పతి, మండల నాయకులు దార శ్రీనివాసరావు, కంటెం సత్యనారాయణ, జోగా రామయ్య, పారిపర్తి రాజు, జోగా రాజబాబు, రామస్వామి, పుల్లయ్య, కార్తీక్, నవీన్, మోహన్, ముత్తయ్య, రాజు, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక, మొరానికి అనుమతులిచ్చి ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఇసుక, మొరంకు అనుమతులు ఇచ్చి ధరలు పెరగకుండా చూడాలని ప్రభుత్వం చూడాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సిరిసిల్ల ఎఐటియుసి కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇసుక, మొరం నిత్యం అందక, ఇసుక మొరం తరలించే వాహనాలను మైనింగ్ అధికారులు అనుమతుల పేరుతో సీజ్ చేయడంతో విపరీతమైన ధరలు పెరిగి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మోయలేని పెనుభారంగా మారిందన్నారు. 5 లక్షలతో ఇంటి నిర్మాణం చేయలేని పరిస్థితి నెలకొందని కాంగ్రెస్ ప్రభుత్వం నాయకులు ఆర్ డిఒ, తాసిల్దార్లు ఈ విషయంపై తక్షణమే స్పందించి ప్రతిరోజూ పర్మిషన్ ఇవ్వాలన్నారు. అడ్డాల వద్ద భవన నిర్మాణ కార్మికులకు పని దొరికేలా చూడాలని 3నెలలుగా ఇసుక, మొరం లేక కార్మికులు పస్తులు వుండే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు, శ్రీరాముల నర్సయ్య, చేరాల రవి, పెంట అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.




# రిజర్వేషన్లు దక్కకుండా చేస్తున్న కుట్రలను బిసిలు తిప్పికొట్టాలి

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు



**ప్రజాపక్షం/ వరంగల్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యా, ఉద్యోగ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు చట్టాన్ని ఆమోదించకుండా మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యహరించడం వల్లనే రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ల ప్రక్రియలో అనేక ఆటంకాలు కలుగుతున్నాయనీ బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. వరంగల్ పోచమైదాన్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వెంకట్రాములు, జిల్లా ప్రధానకార్యదర్శి చింతకింది కుమారస్వామి ప్లేకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన చట్టాన్ని గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపినప్పటికీ బిసి చట్టాన్ని 9వ షెడ్యూల్లో చేర్చి ఆమోదించవలసిన బిసి ప్రధాన మంత్రిని అంటున్న మోడి బిసిల ఎడల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి కారణంగానే తెలంగాణలో బిసిలకు రిజర్వేషన్లు దక్కకుండా పోతున్నాయన్నారు. బిసిల రిజర్వేషన్లు అమలు జరగాలంటే తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చడం ఒక్కటే మార్గమని, ఎందరో న్యాయకోవిదులు నిపుణులు చెప్పుతున్నా కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆర్డినెన్స్ అని ఒకసారి, జీవో అని ఒకసారి కాలయాపన చేస్తూ స్థానిక సంస్థల ఎన్నిక ల్లో రిజర్వేషన్ల జిఒ మీద అగ్రకులాలు న్యాయస్థానాలకు వెళ్ళే అవకాశాలు కల్పించేలా వ్యవహారించడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా బిసి రిజర్వేషన్లు సాధించడానికి అన్ని రాజకీయ పార్టీలను బిసి సంఘాలను కలుపుకొని ఐక్య కార్యాచరణ ద్వారా బలమైన ఉద్యమాన్ని నిర్మించి మోదీ ప్రభుత్వం బిసి చట్టాన్ని 9వ షెడ్యూల్ లో చేర్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బొట్ల శ్రీనివాస్ , జిల్లా నాయకులు పరికరాల రమేష్, గంగాధరీ జగదీష్, ఓదెల భద్రయ్య, రామకృష్ణ, చంద్రశేఖర్, సయ్యద్ యాకూబ్, ఎండి సద్దాం హుస్సేన్, ఎండి షఫీ, లావుడ్య దస్రూ, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు విరమించుకోవాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్




**ప్రజాపక్షం/మంగపేట/ఏటూరునాగారం :** కేంద్రం ప్రభుత్వం కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా పనిచేస్తూ కార్మికులు అనేక సంవత్సరాలు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 కోడ్స్‌గా చట్టాలను కుదించిందని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ విమర్శించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని, యథావిధిగా 44 చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. శనివారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వెల్దండి కొమురయ్య అధ్యక్షతన ఎఐటియుసి మండల మహసభ నిర్వహించారు. సభకు రవీందర్ హాజరై మాట్లాడుతూ, కనీస వేతనాలు 26000వేల రూపాయలు చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు ప్రజాప్రతినిధులకు వారికి ఇష్టం వచ్చినట్లుగా వేతనాలు పెంచుకోవడం, జీవితాంతం పెన్షన్ పొందే అవకాశం ఉంటుంది కానీ జీవితాంతం పనిచేసే కార్మికులకైనా ఉద్యోగులకైనా పెన్షన్ పొందే అవకాశం మాత్రం లేకపోవడం చాలా అన్యాయం అన్నారు. అందుకే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా స్కీం వర్కర్స్ అయిన మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్‌కు అంగన్వాడీ టీచర్స్ ఆయాలకు ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు లేవు ఉద్యోగ భద్రత కూడా లేదు అన్నా రు. ఇక జిల్లా వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ భవణ నిర్మాణ ట్రాక్టర్ డ్రైవర్స్ అందరికీ సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘటిత రంగంలో పనిచేస్తున్న సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు మార్కెట్ హమాలీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు ప్రతీఒక్కరికీ ఈఎస్ఐ పిఎఫ్ పెన్షన్ పొందే అవకాశం కల్పించాలని కోరారు. టెస్టుల పేరుతోని భవణ నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను దుర్వినియోగం చేస్తున్న ప్రభుత్వాలు ఇంకా అనేక సమస్యల్ని పరిష్కరించడానికి జిల్లాలోని ప్రతీ రంగంలో పనిచేస్తున్న ప్రతీ ఒక్కరూ సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యండి నాసర్, ఏఐటియుసి నాయకులు వెల్దండి కొమురయ్య, పోరెడ్డి ప్రమీల, భవణ నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పోలం కొండయ్య, బిక్షపతి, రమేష్, రవి, శ్రీధర్, జగదీష్, బుచ్చవ్వ, రాజు, మున్నీ, గంగ, సమ్మయ్య, సమ్మక్క, వెంకటమ్మ, సత్యమ్మ, లక్ష్మి, సారలమ్మ, భానుమతి, చిన్నమ్మ పాల్గొన్నారు.

# కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కరించండి : ఎఐటియుసి




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి సి అండ్ ఎండిని కలిసిన గుర్తింపు సంఘం ఎఐటియుసి నాయలు. సింగరేణి కార్మికుల ముఖ్యమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంస్థ సి అండ్ ఎండి బలరాం నాయక్ ను, డైరెక్టర్ ఫా గౌతం పోట్రును కలవడం జరిగిందని సింగరేణి గుర్తింపు సంఘం ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామ య్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్‌లు పేర్కొన్నారు. శనివా రం హైదరాబాదులోని సింగరేణి భవన్‌లో సంస్థ అధికారులను కలిసిన అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై మాట్లాడడం జరిగిందని, ప్రధానంగా డిపెండెంట్ ఎంప్లాయిమెంట్‌కి సంబంధించిన మెడికల్ ఫిట్ ఐన కా ర్మికుల పిల్లలకు వెంటనే పోస్టింగ్ ఆర్డర్స్ ఇస్తామని తెలిపారని, అదేవిధంగా మెడికల్ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందని వారు తెలిపారు. మారుపేర్ల సమస్య మీద సానుకూలంగా స్పం దించారని, ట్రాన్స్‌ఫర్ల గురించి అడుగగా మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్ లైతే వెంటనే పరిష్కారం చేస్తామన్నారని వారు తెలిపారు. అదేవిధం గా మిగతా ట్రాన్స్‌ఫర్ల విషయంలో మూడు సంవత్సరాల సర్వీస్ నిబంధన ప్రకారం చేస్తామని అన్నారని, క్లర్కులకు సంబంధించిన రిక్రూట్మెంట్ పరీక్ష పెట్టి త్వరగా పూర్తి చేయాలని కోరడం జరిగిందని వారు తెలిపారు. అదేవిధంగా మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్స్ మెడికల్ అన్ ఫిట్ ఐతే సర్ఫేస్ లో సూటబుల్ జాబు ఇస్తామని, తొందరలో దీనిపై సర్క్యులర్ రిలీజ్ చేస్తామని తెలిపారని వారు పేర్కొన్నారు. డిస్మిస్ ఐన కార్మికులకు ఒక అవకాశంగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరడం జరిగిందని వారు తెలిపారు. కార్మికుల సమస్యల పైన సానుకూలంగా స్పందించారని,త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని సి అండ్ ఎండి, డైరెక్టర్ ఫాలు హామీ ఇచ్చారని వారు తెలిపారు.

# చేవెళ్ల కోర్టుకు హాజరైన సిపిఐ నాయకులు

భూ పోరాటం వర్ధిల్లాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

**ప్రజాపక్షం/షాబాద్:** భూ పోరాటం వర్ధిల్లాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలోని కోర్టుకు సిపిఐ నాయకులు హాజరు అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఐ కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ.. చేవెళ్ల మండల కేంద్రంలోని సర్వే నెం. 75లో ఇండ్లు లేని నిరు పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని గత మూడు సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న ప్రభుత్వం కనికరించడం లేదని పేర్కొన్నారు. ఈ విషయమై భూ పోరాటం చేస్తే పోలీస్ అధికారులు అరెస్టు చేసి కేసులు పెట్టి కోర్టుకు లాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు సిపిఐ పార్టీ పేదల పక్షాణ నిరంతరం భూ పోరాటం చేస్తుందని చెప్పారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి సర్వే నెం. 75లో పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ ఇంచార్జ్ రామస్వామి,వివిధ మండలాల కార్యదర్శులు సత్తిరెడ్డి, శ్రీనివాస్, సీనియర్ నాయకులు వడ్ల సత్యనారాయణ, సుధాకర్ గౌడ్, నరేష్, కృష్ణగౌడ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని రైతు వేదికలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. శనివారం నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ లైవ్‌లో నిర్వహించారు. పిఎం ధన్‌దాన్య క్రిషి యోజన, మిషన్ ఫర్ ఆత్మ నిర్భర్ ఇన్ పల్సెస్, అగ్రికల్చరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్, యానిమల్ హస్బెండరీ, ఫిషరీస్, ఫుడ్ ప్రాసెసిం గ్ సెక్టార్ వంటి పథకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, ఎడిఎ వెంకట్రామ్‌రెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి, వ్యవసాయాధికారులు, ఎఇఒలు, రైతులు పాల్గొన్నారు.





## అక్రమ పద్ధతిలో తీసుకున్న అనుమతులు రద్దు
### పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీకి వినతి

**కూకట్‌పల్లి/ప్రజాపక్షం:** వ్యాపార లబ్ధి కోసం, స్వప్రయోజనాల కోసం అధికారులను, ప్రజలను తప్పుదోవ పట్టించిన వెంకట ప్రణీత్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు అక్రమ పద్ధతిలో తీసుకున్న అనుమతులను వెంటనే రద్దు చేయాలని ఆదిత్య నగర్ కాలనీ వాసులు శనివారం పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల నుండి నివసిస్తున్నామని, అప్పట్లో ప్రావిడెంట్ ఫండ్ నుండి ఋణాలు తీసుకొని ఇండ్లను నిర్మించుకున్నామని అందరికి 60 ఫీట్ల రోడ్డు అని చూపించి అనుమతులు ఇచ్చారు. కానీ వెంకట ప్రణీత్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి మాత్రం 100 ఫీట్ల మాస్టర్ ప్లాన్ అని చూపించి జి+37 ఫ్లోర్ల బహుళ అంతస్తుల నిర్మాణం కొరకు అనుమతులు ఇచ్చారని, దొడ్డిదారిన తెచ్చుకున్న పర్మిషన్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. 60ఫీట్ల రోడ్డు వరకు మాత్రమే భవన నిర్మాణములకు అనుమతులు ఇవ్వాలని, ఒక బిల్డర్ కోసం అనేకమంది పొట్టకొట్టడం భావ్యం కాదని అన్నారు. వారి పర్మిషన్ రద్దు చేసేంత వరకు పోరాడుతామని కాలనీ వాసులు ముక్తకంఠంతో తెలియజేశారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ ప్రగతినగర్ రోడ్డు నుండి నాగార్జున హోమ్స్ చౌరస్తా నిజాంపేట్ రోడ్డు వరకు గల 60 ఫీట్ల రోడ్డులో భవనాల నిర్మాణాలకు అనుమతులు మాత్రం ఉన్నాయని, దొడ్డి దారిన అనుమతులు తెచ్చుకొన్న బహుళ అంతస్థులు నిర్మిస్తున్న ఎంతటివారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని అన్నారు. ఆదిత్యనగర్, నాగార్జున హోమ్స్, చుట్టు పక్కల కాలనీ వాసుల వినతి మేరకు జిహెచ్‌ఎంసి కమిషనర్‌కి ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.



## తాళికోట హరికృష్ణకు అభినందనలు

**ప్రజాపక్షం/నాగారం:** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఎల్ నగర్ నివాసి అయిన ఐటిడిపి రాష్ట్ర అధ్యక్షులు తాళికోట హరికృష్ణ విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యునిగా ఇటీవల ఎన్నికై శనివారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా నాగారం మున్సిపల్ తెలుగుదేశం పార్టీ నాయకులు ఉమాశంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో హాజరై అభినందనలు తెలిపారు.కష్టపడ్డ కార్యకర్తలకు అధినేత ఇచ్చిన అరుదైన గౌరవమని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు, శివాజీ,రామయ్య,రంగారావు,శంకర్‌గౌడ్,కృష్ణారావు, తదితరులు పాల్గొన్నా రు.

## మూసాపేట్ డివిజన్‌లో శేరి సతీష్‌రెడ్డి పర్యటన

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి శనివారం మూసాపేట్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ బస్తీలో పర్యటిస్తూ, స్థానికులతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీలో శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను, నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ మరమ్మతులు చేయించి, పెయింటింగ్ వేయించాలని, అలాగే బస్తీ యువతకోసం జిమ్ సామాగ్రిని ఏర్పాటు చేయించాలని అక్కడికక్కడే తన సిబ్బందిని పురమాయించారు. ఈ అభివృద్ధి పనులన్నింటినీ తన తాతగారి పేరిట స్థాపించిన శేరి రాజీవ్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు సతీష్‌రెడ్డి తెలిపారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బస్తీ వాసులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేకల మైకల్, మహ్మద్ జున్ను పాషా, లాయర్ రఘుపతిరెడ్డి, అశోక్ ముదిరాజ్, కిట్టు, జెర్రిపాటి రాజు, జె.సాయి, కె.సాయి, బి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గంధం భరించలేం బాబోయ్..

* శామీర్‌పేట- బాబాగూడ రోడ్డు పక్కన ఉన్న చెత్త డంపింగ్‌-యార్డును తలపిస్తున్న వైనం * వాహనాదారులపైకి దూసుకొస్తున్న పందులు * పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** తూంకుంట మున్సిపాలిటిలోని శామీర్‌పేట బాబా గూడ వెళ్లే రోడ్డు మార్గంలో చెత్త కుప్పలు డంపింగ్‌యార్డును తలపించే విదంగా కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. ఈ చెత్తతో పాటు భరించ లేని దుర్గంధం వస్తుందని ఈ రోడ్డును వెళ్తున్న వాహనాదారులు, పాదచారులు అంటున్నారు. గ్రామపంచాయతి నుంచి మున్సిపల్ వార్డు కార్యాలయంగా మారిన అభివృద్దిలో మాత్రం అధోగతి పాలైందని గ్రామస్థులు అంటున్నారు. మున్సిపల్‌లో విలీనం కావడమే శామీర్‌పేట చేసుకున్న పాపమా అని ప్రజలు వాపోతున్నారు. పారిశుద్య నివారణే మున్సిపల్ ద్యేయమని గొప్పలు చెప్పుకుంటున్న అధికారులకు ఈ చెత్త కుప్పలు కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. స్వచ్ఛ బారత్ 100 రోజుల్లో మున్సిపల్‌లోని అన్ని వార్డులను స్వచ్ఛంగా తీర్చిదిద్దామని అధికారులు చెబుతున్నప్పటికి ఎక్కడ పారిశుద్య నివారణపై చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ తూంకుంట మున్సిపల్‌లోని వివిధ వార్డుల్లో పర్యవేక్షిస్తున్న అధికారుల్లో చలనం లేకుండా పోయిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

**స్వైర విహారం చేస్తున్న పందులు..** రెండు గ్రామాల మధ్యలో ఉన్న రోడ్డు పక్కకు చెత్తను వేయడం వలన ఆ చెత్త కుప్పల్లో పందులు ఇష్టారీతిన తిరుగడం వలన పరిసరాలు దుర్గందంతో వ్యాపిస్తున్నాయి. ముక్కు పుటాలదిరే దుర్వాసనతో ప్రజలు, వాహానాదారులు అటువైపు వెళ్లాలంటే జంకుతున్నారు. ఈ పందులు రోడ్లపైకి వచ్చి వాహానాదారులను ఢీకొడుతున్నాయి. దీంతో వాహానాదారులు రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలైతున్నారు. రాత్రి పూట పందులు విచ్చలవిడిగా రోడ్డుపైకి వచ్చి ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్న మున్సిపల్ యంత్రాంగం ఇటువైపు కన్నెతి చూడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కార్యాలయాలకే అదికారులు పరిమితమైతున్నారని పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనబడుతుందని మున్సిపల్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కార్మికులు ఐక్యంగా పోరాడినప్పుడే
# సమస్యలు పరిష్కారం

### ఆలిండియా కంటోన్మెంట్ బోర్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి పీటర్ దుర్రై రాజు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికులు ఐక్యమై పోరాటాలు నిర్వహిస్తేనే హక్కులను సాధించుకోవడానికి అవకాశం ఉంటుందని గత అనేక సంవత్సరాలుగా కంటోన్మెంట్ లో పనిచేస్తున్నటువంటి కార్మికులకు రావలసిన బోనస్ కోసం చేసిన పోరాటంతోనే ప్రస్తుత సంవత్సరానికి బోనస్ ఇచ్చేందుకు కంటోన్మెంట్ అధికారులు అంగీకరించారని ఆలిండియా కంటోన్‌మెంట్ బోర్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి పి.పీటర్ దుర్రై రాజు అన్నారు. సికింద్రాబాద్ కంటోన్‌మెంట్ బోర్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) సర్వసభ్య సమావేశం పికెట్ గార్డెన్‌లో యూనియన్ అధ్యక్షులు ఎం. నరసింహ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన పీటర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక విధానాల వల్ల ప్రస్తుతం అనేక ఏళ్లుగా కాంట్రాక్టు కార్మికులు రెగ్యులరైజ్ కాలేకపోతున్నారని, కాంట్రాక్టు కార్మికుడు ఎన్నేళ్లు పనిచేసిన కాంట్రాక్టు కార్మికుడిగానే మిగిలిపోవడం దురదృష్టకరమన్నారు.



కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నటువంటి కంటోన్‌మెంట్ బోర్డులలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీ స వేతనాలు, పిఎఫ్, ఈఎస్‌ఐ సక్రమంగా అమలు చేయాలని ప్రతి ఏటా ఒక నెల బోనస్ జీతం చెల్లించాలని కార్మిక చట్టాలు చెబుతున్న అధికారులు వాటిని పెడచెవిన పెడుతూ కార్మికులకు అన్యాయం చేస్తే ఎఐటియుసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు. సికింద్రాబాద్ కంటోన్‌మెంట్ బోర్డులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు శ్రమకు తగిన ఫలితాన్ని అందించాలని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేయుచున్న కార్మికులకు అంతే సమానమైన జీతాలు ఇవ్వాలని వారి డిమాండ్ చేశారు.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ హెల్త్ సూపర్‌ఇంటెండెంట్ బి దేవేందర్ మాట్లాడుతూ యూనియన్ ప్రతినిధులతో కంటోన్‌మెంట్ సిఈఓతో జరిపిన చర్చల్లో కార్మికులకు ఈ ఏడాది బోనస్ చెల్లించేందుకు అంగీకరించారన్నారు. కంటోన్‌మెంట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆకుల మహేందర్, పరుశురాములు , యూనియన్ అధ్యక్షులు ఎం.నరసింహ మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్‌మెంట్ బోర్డులో దాదాపు 15 వందల మంది కార్మికులు కాంట్రాక్టు పద్ధతిన పనిచేయుచున్నారని కార్మికులకు కాంట్రాక్టర్లు సకాలంలో జీతాలు ఇవ్వకుండా తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారని, కాంట్రాక్టు చట్టం ప్రకారం ప్రతి నెలా ఏడవ తేదీ లోపు జీతాలు వచ్చేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, కార్మికుల రక్షణ సౌకర్యాలు కల్పించాలని కోరారు.

సమావేశంలో ఆల్ ఇండియా కంటోన్మెంట్ బోర్డ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కోశాధికారి బాలకృష్ణన్, కంటోన్మెంట్ బోర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కోశాధికారి రాజేష్, తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య, జిహెచ్‌ఎంసి కాంట్రా క్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, ఉప ప్రధాన కార్యదర్శి పి.నరసయ్య, తదితరులు ప్రసంగించారు.

## ఎఐసిసి అబ్జర్వర్‌కు ఘనస్వాగతం



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ నూతన అధ్యక్షుల నియామకం నేపధ్యంలో ఎఐసిసి అబ్జర్వర్ అంజలి మేడ్చల్‌కు శనివారం విచ్చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి, టిపిసిసి లీడర్ కూన శ్రీశైలంగౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, గౌడెల్లి మాజి సర్పంచ్ సురేందర్ ముదిరాజ్‌లు ఎఐసిసి అబ్జర్వర్ అంజలి నిమ్బాల్కర్ ఘనస్వాగతం పలికారు. అనంతరం ఒక్కొక్కరితో స్వయంగా ఆమె నియోజకవర్గ నాయకుల దగ్గర వివరాలు సేకరించారు.



## నూతన కమిటీని సన్మానించిన తుంగతుర్తి రవి
### నూతన అధ్యక్షుడిగా దేవేందర్ వేముల

**ప్రజాపక్షం/బోడుప్పల్:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీకృష్ణ నగర్ కాలనీ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. శ్రీకృష్ణ నగర్ కాలనీ నూతన అధ్యక్షుడుగా దేవేందర్ వేముల, ఉపాధ్యక్షుడిగా జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆది చంద్రారెడ్డి, జాయింట్ సెక్రటరీగా సురేష్, కోశాధికారిగా కే శ్రీ పాల్, సలహాదారులుగా వెంకట్ రెడ్డి, వినోద్, రాజేష్ ఎన్నికైన సందర్భంగా ఫీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి నూతన కమిటీ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలకతీతంగా కాలనీ అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచిస్తూ, కాలనీ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తుంగతుర్తి రవి అన్నారు. ఈ కార్యక్రమం లో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలి
### అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, సమాచార హక్కు చట్టాన్ని ప్రజలు వినియోగించుకోవాలని అలియాబాద్ కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం అలియాబాద్ మున్సిపాలిటి కార్యాలయంలో ప్రజలకు సమాచార హక్కు చట్టం 2025 పై అవగాహన కల్పించారు.

ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంతో ప్రజలకు పారదర్శక పాలన అందుతుందని ఆశాబావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయం నుంచి సమాచారం కావాలంటే కేవలం రూ.10 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 30రోజులు గడువు లోగా సమాచారం ఇవ్వకపోతే మొదటి అప్పిలేట్ అథారిటికి దరఖాస్తు చేయాలని, గడువు ముగిసినచో రాష్ట్ర సమాచార కమిషన్‌లో అప్పీల్‌కి వెళ్లవచ్చని తెలిపారు.




ప్రజలకు వచ్చిన సందేహాల ను మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**బోడుప్పల్‌లో :** ప్రభుత్వ అధికారుల పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందిన సమాచార హక్కు (ఆర్టీఐ)చట్టం 2005 అవగాహన సద స్సు కార్యక్రమం ను శనివారం ఫీర్జాదిగూడ నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ టి ఎస్ వి ఎన్ త్రిలేశ్వర రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా పౌరులకు సాధికారికత కలిగిందని, అధికారులు ఎలా పనిచేస్తున్నారో తెలుసుకునే హక్కు పౌరులకు లభించిందన్నారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలు ఈనెల 5 నుండి 12 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డిఈ సాయినాథ్ గౌడ్, ఏఈ వినీల్ కుమార్ గౌడ్, మేనేజర్ క్రాంతి కుమార్, ఆర్వో కిషోర్ కుమార్, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జాతర ఉత్సవాలు, వారంతపు మార్కెట్‌లకు వెళ్లే
# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
### సిఐ జి.వెంకట్



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** వారాంత మార్కెట్లు, జాతరలు, ఉత్సవాల సమయంలో మొబైల్ దొంగతనాలు జరుగుతున్నాయి. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోమిన్ పేట్ సిఐ జి.వెంకట్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవాబ్ మండల ప్రజలు వారాంతపు మార్కెట్లు, జాతరలు,ఉత్సవాల సమయంలో మొబైల్ దొంగతనాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో దొంగతనానికి గురైన ఫోన్ లోని ఉన్న బాంక్/యూపిఐ ద్వారా డబ్బు స్వాధీనం చేసుకుంటున్నారు. అందుచేత ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి అన్నారు. మార్కెట్‌లలో మీ మొబైల్‌ను పై జేబులో పెట్టుకోవద్దు అలాగే ఫోన్ పట్ల దృష్టి పెట్టి చూసుకొనేలా ఉండడం మంచిదని అన్నారు. ఫోన్ దొంగిలించబడితే వెంటనే మీ దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. మీ సిమ్, ఎటిఎం బ్లాక్ చేయించండి, ఫోన్ పోయినా, దొంగలించబడిన వెంటనే సిమ్ ను బ్లాక్ చేయించలేకపోతే నిందితులు ఒటిపి ద్వారా మీ యొక్క ఫోన్ పే, గూగుల్ పే పాస్‌వర్డ్ మార్చేసి డబ్బులను ట్రాన్స్ఫర్ చేసుకుంటారు. బ్యాంక్‌ని సంప్రదించి మీ యొక్క బ్యాంక్ యూపిఐ సేవల్ని, లావాదేవీలను నిలిపివేయించండి. లేదా ఫోన్‌లో లాగిన్ అయిన బ్యాంకింగ్, ఇమెయిల్, సోషల్ మీడియా పాస్‌వర్డ్‌లను వెంటనే మార్చండి.

నవాబుపేట్ మండలంలో మార్కెట్, జాతర ప్రాంతాలలో ప్రజాసంక్షేమానికి మరియు నేరాల నివారణకు జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, డిఎస్పీ ఎన్.శ్రీనివాస్ రెడ్డి, ఆదేశాల మేరకు సాధారణ దుస్తుల్లో పోలీసులు, అలాగే యూనిఫార్మ్ ఉన్న పోలీసులు నియమించబడ్డారు. అలాగే మార్కెట్లకు సమీపంలో పోలీస్ పెట్రోల్ మొబైల్, పోలీస్ వాహనం ఉండీ అక్కడ కూడా పోలీసు వారు అందుబాటులో ఉంటారు. మార్కెట్లో మీ యొక్క మొబైల్ దొంగిలించబడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో లేదా మార్కెట్‌కు సమీపంలోని పోలీసులు దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేయండి. పోలీస్ వారు మీ సమస్యను తక్షణమే స్వీకరించి తగిన చర్యలు తీసుకుంటారని అన్నారు. మీ దగ్గర ఫోన్ పోయిన, లేదా సైబర్ మోసానికి గురైన ప్రతి కేసులో పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సహకరిస్తుంది. మీ సమస్యను వెంటనే పోలీస్‌లకు తెలియచేసి సహాయాన్ని పొందాలని అన్నారు. ప్రజలు ఇలాంటి మోసపూరిత సంఘటనలు ఎదురైతే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ కు కాల్ చెయ్యండి. ఏ విధమైన సైబర్ సంబంధిత మోసానికి గురి అయినట్లయితే వెంటనే మోమిన్పేట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయానికి రాగలరు అని జి.వెంకట్ మోమిన్ పెట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ తెలియజేశారు.



## ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు
### మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు జరుగుతుందని అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం అలియాబాద్ మున్సిపాలిటి మజీద్‌పూర్‌లో లక్ష్మ క్కపల్లిలోని ఆర్‌విఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 379 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 73 మందిని ఆర్‌విఎం ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆర్‌విఎం ఆస్పత్రి యాజమాన్యం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందించదగిన విషయమని చెప్పారు. ఈ వైద్య శిబిరంలో పేదలకు ఉచితంగా మందులను పంపిణీ చేశారని చెప్పారు. ఆర్‌విఎం ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ మంచినీళ్ల లక్ష్మ ణ్ మాట్లాడుతూ లక్ష్మ క్కపల్లిలోని ఆర్‌విఎం ఆస్పత్రిలో ఆధునిక పరికరాలతో శస్త్ర చికిత్సలు చేస్తున్నారని చెప్పారు. ఆర్థికంగా ఇబ్బందులు పడేవారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

## రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులో ఇసుక మాఫియా రెచ్చిపోతుంది. వారి ఆగడాలకు అడ్డుకట్ట లేకుండా పోయింది. ఇసుక అక్రమ రవాణను అడ్డుకోబోయిన పోలీసులపైకి దౌర్జన్యాన్నికి దిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాండూరు నియోజకవర్గ పరిధి బషీరాబాద్ మండల దామర్‌చెడ్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి వెలుగు చూసింది. ఈ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణ అవుతంది బషీరాబాద్ పోలీసులకు సమాచారం అదింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి వెళ్ళి ఇసుక ఎక్కడి నుండి ఎక్కడికి తరలిస్తున్నావని, దీనికి పర్మిషన్ ఉందా అంటూ పోలీసుల అరాతీశారు. అక్రమంగా ఇసుక తరలిస్తునట్లు గ్రహించిన పోలీసులు ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్న క్రమంలో సమాచారం అందుకున్న ట్రాక్టర్ ఓనర్ అక్కడికి వచ్చి పోలీసులతో ఘర్షణకు దిగారు. ట్రాక్టర్‌కు అడ్డు తప్పుకోండి అంటూ లేదంటే ట్రాక్టర్ తోస్తామంటూ హెచ్చరించారు. దీంతో పోలీసులు వెంటనే ట్రాక్టర్ డ్రైవర్‌ను, ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. రోజరోజుకు ఇసుక మాఫియ ఆగడాలు మితిమీరిపోయ్యాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణను అడ్డుకోవాలని కోరుతున్నారు.

## యధావిధిగా ప్రజావాణి కార్యక్రమం: కలెక్టర్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం యధా విధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజల అర్జీలు ఇచ్చేందుకు 13వ తేదీన నిర్వహించడం జరుగుతుందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు.

## అమెరికా కొత్త దౌత్యవేత్తతో జైశంకర్ సమావేశం

**న్యూఢిల్లీ:** భారతదేశంలో అమెరికా దౌత్యవేత్తగా నియమితులైన సెర్గియో గోర్‌తో విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ శనివారం సమావేశమయ్యారు. అమెరికా సెనేట్ ఆయన నియామకాన్ని ఖరారు చేసింది. ఐతే ఇంకా సెర్గియో గోర్ భారతదేశంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించలేదు. గోర్‌తోపాటు అమెరికా నిర్వహణ–వనరుల శాఖామంత్రి మైఖేల్ జె.రిగాస్ ఆరు రోజులపాటు ఢిల్లీలో పర్యటన సందర్భంగా జైశంకర్ వారిని కలిసి సంప్రదింపులు జరిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో జైశంకర్ ఒక పోస్టింగ్ పెడుతూ, దౌత్యవేత్తగా అమెరికా అత్యున్నత చట్టసభ ఖరారుచేసిన సెర్గియో గోర్‌తో సమావేశం కావడం ఎంతో ఆనందంగా ఉంది, రెండు దేశాలమధ్య సంబంధాలపైన, ప్రపంచ పరిణామాలపైన చర్చించాం అని పేర్కొన్నారు. ఈ కొత్త బాధ్యతలలో ఆయన విజయవంతం కావాలని జైశంకర్ ఆకాంక్షించారు. భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీతో కూడా గోర్ సమావేశమయ్యారు. ''వారిద్దరి మధ్య ప్రయోజనకరమైన సంభాషణలు జరిగాయి, రెండు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగురించి, ఉమ్మడి విలువల గురించి చర్చించారు, ఆయనకు మిస్రీ అభినందనలు తెలియజేశారు అని విదేశీవ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. డోనాల్డ్ ట్రంప్ భారత్‌పై భారీగా సుంకాలు విధించిన తర్వాత రెండు దేశాలమధ్య సంబంధాలు ఇటీవలికాలంలో దెబ్బతిన్నాయి. ఇటీవల ప్రధానమంత్రి మోదీ, ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణల ద్వారా కొంత సానుకూల వాతావరణం ఏర్పడింది. ప్రస్తుతం రెండు దేశాల మధ్యా వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ విషయంలో ట్రంప్ చేసిన సానుకూలమైన ప్రకటనలు ఆ దేశంతో తిరిగి సంబంధాలు మెరుగుపడతాయన్న ఆశాభావం రేకెత్తించాయి.

## మైనారిటీ యువతికి సిఎంఆర్‌ఎఫ్ సాయం

**ప్రజాపక్షం/దుండిగల్ :** ఖుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని చర్చిగా గాగిల్లాపూర్ గ్రామంలో నివసిస్తున్న మైనారిటీ యువతికి ఇటీవల మెదడులో రక్తం గడ్డకట్టిన సమస్య (బ్లడ్ క్లాట్) తలెత్తిందనీ కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో వైద్యం అందించడం కష్టంగా మారడంతో విషయాన్ని తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి బాధిత యువతికి సిఎంఆర్‌ఎఫ్ ఎల్.ఓ.సి ద్వారా అవసరమైన వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. సర్జరీ విజయవంతంగా పూర్తయ్యి, యువతి ప్రస్తుతం ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అవడంతో, కిషోర్ రెడ్డి స్వయంగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆమె కుటుంబాన్ని ధైర్యం చెప్పడంతో పాటు, 10,000 వేలు ఆర్థిక సహాయం అందించా రు.



ఈ కార్యక్రమం లో దుండిగల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్ రెడ్డి శ్రీశైలం ముదిరాజ్, దొంతి మహేష్ ముదిరాజ్, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## హస్తినాపురం జెడ్‌పి రోడ్డు మీదుగా ఆర్‌టిసి బస్సులు నడపాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** హస్తినాపురం డివిజన్‌లోని జెడ్‌పి రోడ్డు మీదుగా ఆర్‌టిసి బస్సులు నడపాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ శనివాసం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సుజాత నాయక్ మాట్లాడుతూ బిఎన్‌రెడ్డి నగర్ చౌరస్తా నుండి హస్తినాపురం జెడ్‌పి రోడ్డు మీదుగా 277 నెంబర్ గల బస్సును జెడ్‌పి రోడ్డు రూట్‌లో వచ్చే విధంగా కృషి చేయాలని వినతి పత్రంలో మంత్రిని కోరారు. ఈ మేరకు మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి బస్సును జెడ్‌పి రోడ్డుకు వచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపినట్లు కార్పొరేటర్ సుజాత నాయక్ తెలిపారు.

## సోమవారం ప్రజావాణి యథాతథం

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా రద్దుచేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని అక్టోబర్ ఆరవ తేదీ సోమవారం యధాతధంగా నిర్వహించడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో స్థానిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన సందర్భంగా జిల్లా కలెక్టరేట్ నందు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తేదీ 6–102025 నుండి రద్దు చేయడం జరిగింది. కానీ స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర హై కోర్టు స్టే విధించినందున రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక ఎన్నికలు వాయి దా వేయడం జరిగినది. కావున రద్దుపరిచిన ప్రజావాణి కార్యక్రమాన్ని య ధావిధిగా తేదీ:13–10–2025 నుండి కొనసాగించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శనివారం తన ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి తమ వినతులు సమర్పించుకోవాలని, అదేవిధంగా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి కోరారు.

## ఇవిఎం గోడౌన్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రాజేందర్ నగర్‌లోని ఇవిఎం గోడౌన్‌ను రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె చంద్రారెడ్డి శనివారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్ర స్థాయి సందర్శన జరిపారు. ఇవిఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి,బ్యాలెట్,కంట్రోల్ యూనిట్లతోపాటు వివి.ప్యాట్లు,ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు.అదేవిధంగా ఇవిఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును సైతం క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ నగర్ తహశీల్దార్, వేర్ హౌస్ ఇంచార్జ్ రాములు, ఎన్నికల విభాగం అధికారులు,సంబంధిత తదితరులు వున్నారు.

## మహిళల స్వయం ఉపాధికి చేనేత ప్రదర్శన వేదికగా మారాలి : సబితా



**ప్రజాపక్షం/ సరూర్‌నగర్ :** మహిళల స్వయం ఉపాధికి చేనేత ప్రదర్శన వేదికగా మారాలని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పటోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మీర్‌పేట మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని మైత్రిపురం మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన చేనేత హస్తకళ ప్రదర్శన అమ్మకాలను సబితారెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంట్లో నుండే వ్యాపా రం చేసుకునే మహిళలకు, స్వయం ఉపాధి పొందాలనుకునే వారికి ఈ వేది క గొప్ప అవకాశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రతినిధులు, నా యకులు, మైత్రిపురం మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

## హెచ్‌ఐసిసి హోటల్‌లో మ్యాజిక్‌బ్రిక్స్ ఇంటీరియర్స్ మెగా ఎక్స్‌పో..




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** మాదాపూర్‌లోని నోవాటెల్ హెచ్‌ఐసిసి హోటల్‌లో శనివారం మ్యాజిక్‌బ్రిక్స్ హోమ్ ఇంటీరియర్స్ ఎక్స్‌పో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మ్యాజిక్‌బ్రిక్స్ సీఈఓ సుధీర్ విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిజైన్ ఆధారిత ఇన్నోవేషన్, మాడ్యులర్ లివింగ్, స్మార్ట్ హోమ్ సొల్యూషన్స్‌ల ప్రదర్శన అని తెలిపారు. దేశంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ పోర్టల్ అయిన మ్యాజిక్‌బ్రిక్స్ హైద్రాబాద్‌లోని మాదాపూర్‌లో నిర్వహిస్తున్న హోమ్ ఇంటీరియర్స్ ఎక్స్‌పో అద్భుత విజయాన్ని సాధించినదని, గృహ యాజమానులు, డిజైన్ ప్రేమికులు, ఇంటీరియర్ రంగ నిపుణుల నుండి అపూర్వమైన స్పందన లభించినదన్నారు. ఈ ఎక్స్‌పోలో కొత్తగా ఎదుగుతున్న ఇంటీరియర్ బ్రాండ్లు, హోమ్‌లైన్, హోమ్‌లైన్ లక్సే, నూతన థ తన కూడిన డిజైన్ ఇన్నోవేషన్, ఇంటీరియర్స్ లివిన్, డ్రీమ్ మాడ్యులర్స్, హోంవిజ్ ఇంటీరియర్స్, దివా ఇంటీరియర్, స్టైల్ కిచెన్స్ ఒకే వేదికపై ప్రదర్శనలు అందించి గృహ నిర్మాణదారులకు ట్రెండ్లను తెలుసుకోవడానికి డిజైన్ ఆప్షన్‌లను పోల్చుకునేందుకు చక్కని వేదికగా నిలిచాయని తెలిపారు.

## షాబాద్ మండల వ్యవసాయ అధికారిగా దండెం విజయచంద్ర



**ప్రజాపక్షం/షాబాద్:** షాబాద్ మండల వ్యవసాయ శాఖ అధికారిగా దండెం విజయచంద్ర పదవి బాధ్యతలు తీసుకున్నారు. గతంలో నల్గొండ జిల్లా నిడమనూర్ మండలంలో వ్యవసాయ గ్రేడ్1 అధికారిగా విదులు నిర్వహించారు. విది నిర్వహణలో బాగంగా పదోన్నతి పై షాబాద్ కు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. షాబాద్ మండల రైతులకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రైతులు వ్యవసాయ అధికారుల సుచనల మెరకు ఆదునూతన పద్దతులతో వ్యవసాయం చేస్తే మంచి దిగుబడి లాభాలు వస్తాయని పేర్కొన్నారు. రైతులు వేసిన పంటలను వ్యవసాయ శాఖ కార్యాలయంలో రికార్డు చేయించుకోవాలని సూచించారు. రైతుల సమస్యలు ఉంటే ఆయా గ్రామాల్లోని రైతు వేధికలో ఏఈవోలు అందుబాటులో ఉంటారు సంప్రదించాలని వివరించారు.

# హైదరాబాద్ పోలీసుల ప్రతిష్టను మరింత పెంచాలి

అధికారులకు కమిషనర్ సజ్జనార్ కితాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తామిచ్చిన సూచనలు, సలహాలు పాటించి హైదరాబాద్ పోలీసులకు మరింత మంచి పేరు తీసుకురావాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా వి.సి. సజ్జనర్ బాధ్యతలు స్వీకరించిన తరుఆవత శనివారం మొదటి సారిగా హైదరాబాద్ సిటీ పోలీసులోని అన్ని విభాగాలు మరియు పోలీస్ స్టేషన్ల (లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్) అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ గారు మాట్లాడుతూ..'గత ఆరు నెలలుగా హైదరాబాద్ సిటీ పోలీసులోని ప్రతి విభాగం వారు ఎంతో కష్టపడి పనిచేశారు. మీ అందరికీ నా అభినందనలు. ఇదే స్ఫూర్తితో, నిబద్ధతతో భవిష్యత్తులో కూడా పనిచేసి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. దేశంలోనే అతి పురాతనమైన ఎంతో పేరున్న మన హైదరాబాద్ కమిషనరేట్ ప్రతిష్టను మరింత పెంచాలన్నారు. మనమందరం సమన్వయంతో పనిచేస్తే తెలంగాణ రాష్ట్రానికి కూడా మంచి పేరు వస్తుందని తెలిపారు. 'సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తే ప్రత్యేకంగా గుర్తించి ప్రశంసిస్తామన్నారు.అయితే విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవు. కొందరు సిబ్బంది చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం క్షమించరానిదని హెచ్చరించారు. 'పోలీసు సిబ్బంది శాఖకు వెన్నెముక లాంటి వారు. మీరు ప్రజలతో మమేకమై, మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలి. ఫిర్యాదుదారుల పట్ల సరైన రీతిలో స్పందించినప్పుడే ప్రజలకు మనపై మంచి అభిప్రాయం, నమ్మకం కలుగుతాయి. మన ప్రవర్తనే డిపార్ట్‌మెంట్ ఇమేజ్‌ను నిర్ణయిస్తుంది. వృత్తి నైపుణ్యంతో, ప్రామాణిక కార్యాచరణ విధానాలను పాటిస్తూ పనిచేయాలి,' అని సూచించారు. 'ఎక్స్‌ట్రా మైల్ రివార్డ్: 'విధి నిర్వహణతో పాటు మానవతా దృక్పథంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందే సిబ్బందిని ప్రోత్సహించడానికి 'ఎక్స్‌ట్రా మైల్ రివార్డ్' అనే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తున్నాము. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి శనివారం ఉత్తమ సిబ్బందిని గుర్తించి, ప్రశంసాపత్రం మరియు రివార్డుతో ఘనంగా సన్మానిస్తాము,' అని ప్రకటించారు. 'ప్రజలతో మమేకమై పనిచేస్తూ.. పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ వివిధ కార్యకలాపాలపై సమాచారాన్ని సేకరించాలి. హైదరాబాద్‌ను డ్రగ్ రహిత నగరంగా మార్చడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలి. డ్రగ్స్ కేసులను లోతుగా దర్యాప్తు చేసి, దోషులకు కఠిన శిక్షలు పడేలా చూడాలి. మహిళలు, చిన్నారుల జోలికి వస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవనే భావన నేరస్థులలో కలిగే విధంగా అన్ని విభాగాలతో పాటు షీ టీమ్స్ కూడా పనిచేయాలి. నగరంలో ప్రయాణ సమయాన్ని తగ్గించడానికి ట్రాఫిక్ పోలీసులు వినూత్న ఆలోచనలు చేయాలి అని సజ్జనర్ అన్నారు. 'మెరుగైన పోలీసింగ్ కోసం మీ విలువైన సలహాలను, సూచనలను నేరుగా నాకు తెలియజేయవచ్చు. అందుబాటులో ఉన్న సాంకేతికతను, వనరులను సమర్థవంతంగా వాడుకొని మరిన్ని కేసులను ఛేదించాలి. సిబ్బంది పని ఒత్తిడితో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దు,' అని హితవు పలికారు. ఇటీవల మాదన్నపేట పీఎస్ పరిధిలో జరిగిన చిన్నారి హత్య కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్సైలు సుధాకర్, శోభ, సాయికాంత్, శివకుమార్, మరియు సిబ్బందిని అభినందించారు. అలాగే నిరాశ్రయులైన కొందరిని ఆదరించి అమ్మనాన్న ఆశ్రమానికి తరలించిన అఫ్జల్‌గంజ్ ఎస్‌హెచ్‌వో రవి, అడ్మిన్ ఎస్సై నిరంజన్, ఏఎస్సై ధర్మేందర్‌ను ప్రశంసించారు. ఓ కేసులో 30 ఏళ్ల తర్వాత నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలకపాత్ర పోషించిన ఫిలింనగర్ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ విజయ సుధాకర్, కానిస్టేబుల్ సురేందర్ లను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఐపిఎస్ అధికారులు తఫ్సీర్ ఇక్బాల్, పరిమళ హనా నూతన్, కె. అపూర్వారావు, కృష్ణ మూర్తి, ఎం. శ్రీనివాసులు, డి. జోయల్ డెవిస్, డిసిపిల నుంచి కానిస్టేబుల్ స్థాయి అధికారులు వర్చువల్‌గా హాజరయ్యారు.

## పోషణ మహోత్సవంపై మహిళలకు అవగాహన

షాద్‌నగర్ డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పోషణ మహోత్సవంపై మహిళలు అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాలని డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీ సూచించారు. శనివారం షాద్‌నగర్ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మహోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు పోషక ఆహారంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు పోషక ఆహారం తీసుకుంటేనే జన్మించే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. అంగన్‌వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషక ఆహారాన్ని విధిగా తీసుకునేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా తక్షణమే సంబంధిత ఏఎన్‌ఎంకు, ఆశ వర్కర్‌కు వివరించేందుకు గర్భిణీ స్త్రీలు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఫెమినా మహిళా మండలి నాయకురాలు అలియా సుల్తానా, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని నెహ్రూనగర్ కాలనీలోని అంగన్‌వాడి కేంద్రంలో టీచర్ పద్మ ఏర్పాటు చేసిన పోషణ్ అభియాన్ కార్యక్రమానికి హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు హాజరయ్యారు. వ్యాధి నిరోధక టీకాలపై మహిళలకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆకు కూరలతోపాటు పండ్లు, చిరు ధాన్యాలు, ఫైబర్ వంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటమ్మ, టీచర్ పద్మ, ఆయా కళావతి, ఏఎన్‌ఎం విజయలక్ష్మి , ఆశ వర్కార్లు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు పాల్గొన్నారు.

## వాలీబాల్ అండర్ 14తో సత్తా చాటిన విద్యార్థులకు ఘన సన్మానం..

**ప్రజాపక్షం/యాచారం:** యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి పాఠశాల విద్యార్థులు అండర్ 14 వాలి బాల్‌లో సత్తా చాటిని విద్యార్థులను, పిఇటి శ్రీనివాస్‌ను శనివారం గ్రామానికి చేందిన కోంగరి లింగం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లింగం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి క్రిడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. వాలి బాల్ అండర్ 14 లో 46 టింలు పోటి పడగా అందులో నందివనపర్తికి చెందిన విద్యార్థులు 2వ స్థానం కైవసం చేసుకోవడం ఎంతో హర్షించదగ్గ విషయమని అన్నారు. విద్యార్థులు క్రిడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిలో అడాలన్నారు. విద్యార్థులను పోత్సహిస్తున్న ఉపాధ్యాయులకు, పిఈటికి అయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కొండాపురం శివకుమార్,రమేశ్, దశరధ తదితరులు పాల్గోన్నారు.



## రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వం ఆకాంక్ష

రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.ఉష



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షతో ప్రభుత్వం ప్రధాన మంత్రి ధన్, ధాన్య కృషి యోజన పథకంను ప్రవేశ పెట్టిందని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.ఉష అన్నారు. శనివారం ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకం, పప్పు ధాన్యాల మిషన్‌ను భారత ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ ద్వారా ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రారంభ కార్యక్రమాన్ని వీక్షించేందుకు జిల్లా వ్యవసాయ అధికారి ఉష,వివిధ మండలాల నుంచి సుమారు 200 మంది రైతులు,కెవికె సెంటర్,క్రీడా తరపున శాస్త్రవేత్తలు,వివిధ డివిజన్‌ల ఎడిఎలు, మండల వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష మాట్లాడుతూ పిఎం ధన్‌ధాన్య కృషి యోజన పథకం ద్వారా రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షతో ప్రవేశ పెట్టిన పథకమని,ఈ పథకం ఆరేళ్ల పాటు కొనసాగుతుందని చెప్పారు. వ్యవసాయ రంగం తక్కువ ఉత్పాదకత, తగినంత హామీ లేని నీటిపారుదల, పరిమిత రుణ లభ్యత, పంటకోత తర్వాత మౌలిక సదుపాయాలు లేకపోవడం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, వ్యవసాయ సామర్థం సమృద్ధిగా ఉన్నప్పటికీ, ఉత్పాదకత, ఆర్థికాభివృద్ధి పరంగా వెనుకబడిన అనేక ప్రాంతాలలో ఈ సవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయని డిఎఒ ఉష వివరించారు.ఇలాంటి అంతరాలను పరిష్కరించాల్సిన అవసరాన్ని గు ర్తించి, భారత ప్రభుత్వం 2025 కేంద్ర బడ్జెట్‌లో 'పిఎం ధన ధాన్య కృషి యోజన (పిఎండిడికె వై)' కింద 100 ఆకాంక్షాత్మక వ్యవసాయ జిల్లాలను అభివృద్ధి చేస్తామని ప్రకటించిందని,ఆకాంక్ష జిల్లాల కార్యక్రమం విజయంతో ప్రేరణ పొందిన ప్రభుత్వం, రాష్ట్రాల భాగస్వామ్యంతో, ప్రస్తుత ప థకాలు,ప్రత్యేక చర్యలను కలిపి'ప్రధాన మంత్రి ధన్‌ధాన్య కృషి యోజన'ను చేపడుతుందన్నారు. గ్రామీణాభివృద్ధి, సహకారం,ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, పశుసంవర్ధక అండ్ పాడి పరిశ్రమ, మత్స్య,ఐ సిఎఆర్,నీతి ఆయోగ్, నాబార్డ్ అండ్ రాష్ట్రాలు,యూటీలు వంటి అనుబంధ మంత్రిత్వ శాఖలు,విభాగాలతో సన్నిహిత సహకారంతో ప నిచేస్తుందని డిఎఒ తెలిపారు. అనంతరం మహారాజా ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ నుంచి హరి మోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతుల బాధ్యత ను గుర్తు చేస్తూ స్వావలంబన సాధించడానికి వ్య వసాయ ఆధారిత దేశమైన భారతదేశంలో రైతు లు పాత్రను గుర్తు ఎరగాలని సూచించారు. కా గా రైతులు స్వావలంబన సాధించాలి అంటే వ్యవసాయం మీదనే కాకుండా పశు పోషణ మత్య సంపద మీద కూడా దృష్టి సారించాలని క్రీడా శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి రైతులకు వివరించారు. కెవికె శాస్త్రవేత్త విజయ్ కుమార్ మాట్లాడుతూ పంటల ఉత్పాదకతను పెంచుకోవడం యాంత్రకరణ అవసరతను రైతు గుర్తెరిగాలని సూచించారు. ఈ సందర్భంగా చిత్తాపూర్ గ్రామ రైతు అన్నపూర్ణ మాట్లాడు తూ ప్రకృతి వ్యవసాయంలో తన అనుభవాలను తన తోటి రైతులతో పంచుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న , వివిధ మండలాల నుంచి వందలాది మంది రైతులు,కె వి కె సెంటర్, క్రీడా తరపున శాస్త్రవేత్తలు,డివిజన్ ఎడిఎ లు,మండల వ్యవసాయా అధికారులు,వ్యవసాయ విస్తరణ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘం చైర్మన్ విషయంలో కోర్టు అర్డర్ దిక్కరిస్తున్న డిసిఒ

సహకార సంఘం చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి...




**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల సహకార సంఘం చైర్మన్‌గా తోటిరెడ్డి రాజేందర్ రెడ్డిని కోనసాగించాలని కోర్టు అర్డర్ ఉన్న జిల్లా డిసిఒ దిక్కరణకు పాల్పడుతన్నారని చైర్మన్ రాజేందర్‌రెడ్డి ఆగ్రహం వ్య క్తం చేశారు. శనివారం యాచారం మండల కేంద్రంలో అయన విలేకరులతో మాట్లాడుతూ ఇబ్రహింపట్నం నియోజకవర్గంలో కొంత మందిని చైర్మన్ పదవి నుండి కాంగ్రెస్ పదవి నుండి తోలగించిన విషయం తెలిసిం దే. ఈ నేపధ్యంలో యాచారం మండల సహకార సంఘం చైర్మన్ అయిన ను నేను కోర్టును అశ్రమించడం జరిగింది. కోర్టు చైర్మేన్‌గా కోనసాగించాలని అక్టోబర్ 27 న అర్డర్‌ను జారి చేసింది,ఈ అర్డర్‌ను జిల్లా డిసిఒ దగ్గ ర పెట్టుకోని అర్డర్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్టోబర్ 9న తోలగించినట్లు అర్డర్ ఇచ్చారు. సంఘం సిఇఒకు కూడా చెక్కు పవర్ ఇవ్వలేదన్నారు. దింతో సహకార సంఘంలో లావాదేవిలు కుంటు పడుతున్నాయని అన్నారు. రైతులు, ఇతర పనులపై బ్యాంక్‌కు వచ్చిన వినియోగ దారులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిసిఒ నిర్వాకం వల్ల ఇబ్బందులు పడాల్సిన దృష్థితి నెలకోందని అన్నారు. బ్యాంక్ లావా దేవిలు అగిపోయి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంట ఋణాలు, బంగారు అబరణాల తాకట్టు ఋణం కోసం వచ్చిన వారు ఇబ్బందులు ఎదురుకుంటున్నారన్నారు.కొర్టు అర్డర్ ప్రకారం తనను కోనసాగించాలని అయన కోరారు.

## 'వినియోగదారులను మోసగిస్తే పోరాడుతాం'




**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** వినియోగదారులకు జరుగుతున్న అన్యాయాలపై, మోసాలపై ప్రశ్నిస్తూనే చట్టపరంగా పోరాటం చేస్తామని తెలంగాణ వినియోగదారుల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు కోదూరు ప్రసన్నకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కార్తీక్‌రాజు తెలిపారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ వినియోగదారుల కమిటీ ఆవిర్భావం, నూతన కమిటీ ఎన్నికైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రీ లాంచ్ ఆఫర్‌ల పేరిట పేదలను మోసం చేస్తున్న వారి భరతపడతామన్నారు. అనంత రం నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంత్‌రెడ్డికి, జాయింట్ సెక్రటరీ ఆదిత్య కు, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్‌కు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఈశ్వర్‌కు విష్ణు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డికి నియామక పత్రాలు అందజేశారు.

## వృద్ధులు భవిషత్ తరాలకు మార్గదర్శకులు

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** నాగోల్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయి నగర్ కాలనీ (సౌత్) అభయ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు డి సుదీర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇం టిలోని వృద్ధులు బావి తరాలకు మార్గదర్శకులుగా నిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చింతల సురేందర్ యాదవ్,అనంతు లరాజిరెడ్డి,తూర్పాటి చిరంజీవి,సతీష్ యాదవ్ నాయకులు,సీనియర్ సిటిజన్,కాలనీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో సక్సెస్ చేయండి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పల్స్ పోలియోను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో మీడియా సమావేశాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఈనెల 12వ తేదిన ఉదయం ఏడు గంటల నుం డి సాయంత్రం 5గంటల వరకు పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. షాద్‌నగర్ డివిజన్‌లో 0నుండి 5ఏళ్ల వయ స్సు కలిగిన 35, 267మంది చిన్నారులకు పోలియో చుక్కలను వేయడం జరుగుతుందని, మొ త్తం 289బూత్‌లకు గాను 1168మంది వైద్య సిబ్బంది ఏర్పా టు చేశామని, 29మంది రూట్ సూపర్ వైజర్లు, 6మొబైల్ టీంలు పని చేయనున్నట్లు తెలిపారు. డివిజన్‌లో 11ట్రాన్సిస్ట్, బస్టాండ్, రైల్వే స్టేషన్లలో సైతం భూత్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. పోలియో చుక్కలు వేసుకొని చిన్నారులకు 13,14వ తేదిల్లో ఇంటింటికి వైద్య సిబ్బంది వెళ్ళి వేయడం జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలందరు స ద్వినియోగం చేసుకొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.

## ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరి

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరి వేయించాలని శంకర్ పల్లి వైద్యాధికారి డాక్టర్ రేవతి తెలిపారు. అక్టోబర్ 12 నుండి 14 వరకు మూడు రోజులు సబ్ నేషనల్ ఇమ్మ్యునైజేషన్ డే (ఎస్ ఎన్ ఐ డి) పల్స్ పోలియో కార్యక్రమం మన తెలంగాణ రాష్ట్రంలో ఐదు జిల్లాలలో(రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్గిరి, హనుమకొండ, హైదరాబాద్) నిర్వహించబడుతుందన్నారు.ఈ సందర్భంగా మన శంకర్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సున్నా నుండి ఐదు సంవత్సరాలు లోపు పిల్లలందరికీ కూడా పల్స్ పోలియో చుక్కలు వేయడం జరుగుతుంది కావున ఈ కార్యక్రమానికి శంకర్ పల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలో 34 బూతులు, రెండు ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసి అందరికీ ఈ పల్స్ పోలియో చుక్కలు అందించబడతాయి, కావున అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని.ఈ కార్యక్రమానికి పి హెచ్ సి పరిధిలో ఇప్పటివరకు మొత్తంగా 0 – 5 సంవత్సరాలలోపు 5492 మంది పిల్లలు గుర్తించినట్లు డాక్టర్ రేవతి పేర్కొన్నారు.

## పిల్లలందరికీ టీకాలు



**ప్రజాపక్షం/యాచారం :** పల్స్ పోలియో కార్యక్రమానికి విజయవంతం చేయాలని యాచారం మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు.శనివారం యాచారం మండల కేంద్రంలోని ప్రభుత్వ అసుపత్రిలో ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో అమే మాట్లాడుతూ ఐదేళ్ళలోపు పిల్లలందరికి పోలియో టికాలు వేయించాలన్నారు. ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని అన్నారు. మొదటి రోజు అంగన్ వాడి కేంద్రాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల్లో పల్స్ పోలియో చుక్కలు వేస్తారని అన్నారు.రెండవ, మూడవ రోజు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఐదేళ్ళ లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగతందని తెలిపారు.యాచారం మండలంలో మొత్తం పిల్లలు 5448 మంది ఉన్నారన్నారు. యాచారం బస్టాండ్ అవరణలో పోలియో చుక్కలు వేయడానికి పాయింట్ ఏర్పాటు చేస్తామన్నారు.మోబైల్ టిం ద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లోని కోళ్ళ ఫారాలు, కంకర మిషన్ల వద్ద,ఫాంహౌజ్‌లు, ఇటుక బట్టిల వద్ద చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామన్నారు.పోలియో చక్కల కార్యక్రమానికి అందరు హాజరై విజయవంతం చేయాలని కొరారు.

# ప్రైమ్ వాలీబాల్ లీగ్‌తో దేశంలో వాలీబాల్‌కు పెరిగిన ఆదరణ



క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రైమ్ వాలీబాల్ లీగ్ లాంటి లీగ్‌లతో దేశంలో వాలీబాల్ క్రీడకు మంచి ఆదరణ పెరిగిందని, మంచి గుర్తింపు లభిస్తోందని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలోని జిఎంసి బాలయోగి స్టేడియంలో జరుగుతున్న ప్రైమ్ వాలీబాల్ లీగ్ పోటీలకు మంత్రి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శుక్రవారం రాత్రి జరిగిన హైదరాబాద్ బ్లాక్ హాక్స్ – ఢిల్లీ తుఫాన్ జట్ల మధ్య మ్యాచ్‌ను వీక్షించారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు ఆటగాళ్లతో కరచాలనం చేసి, వారికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని క్రీడలకోసం పాలసీ తీసుకొని వచ్చి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మైదానాల్లో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడమే కాకుండా మట్టిలో మానిక్యాలాంటి క్రీడాకారులను గుర్తించి వారి ప్రతిభకు ప్రోత్సాహం ఇచ్చి ప్రపంచ వ్యాప్తంగా జరిగే టోర్నీలో రాణించే విధంగా కృషి చేస్తున్నాం అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే విధంగా హైదరాబాద్‌లో ఈ పోటీలు నిర్వహించడానికి చొరవ తీసుకున్న హైదరాబాద్ బ్లాక్‌హ్యాక్స్ జట్టు యజమాని కంకణాల అభిషేక్ రెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా తమ ఆహ్వానం మేరకు మ్యాచ్‌ను వీక్షించడానికి వచ్చిన మంత్రి శ్రీహరి, శివసేన రెడ్డిలకు అభిషేక్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. అభిషేక్ రెడ్డి మాట్లాడుతూ సీజన్ సీజన్‌కు పీవీఎల్‌కు ఆదరణ పెరుగుతోందని చెప్పారు. ఈ ఏడాది ప్రైమ్ వాలీబాల్ టివి వ్యూయర్‌షిప్ గత సీజన్ తో పోలిస్తే రెట్టింపు అయిందని ఆయన వెల్లడించారు.

**మూడు అంతర్జాతీయ రికార్డ్స్ సాధించిన రోహన్‌కు అభినందన**

ఏడు సంవత్సరాల వయసులోనే జిమ్నాస్టిక్స్‌లో 3 అంతర్జాతీయ రికార్ట్స్ సాధించిన రోహన్‌ను క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభినందించారు. బంజారాహిల్స్‌లోని మంత్రి అధికారిక నివాసంలో రోహన్ తల్లితండ్రులు సురేష్, సృజనలతో కలిసి మంత్రి వాకిటి శ్రీహరిని కలవడం జరిగింది 3వ తరగతిలోనే బ్యాక్ హ్యాండ్ స్ప్రింగ్స్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్ స్టాండ్ వాక్ అంతర్జాతీయ స్థాయి రికార్డ్ రోహన్ తల్లితండ్రులు మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి రోహన్‌ను శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. త్వరలోనే క్రీడాకారుల కోసం ప్రత్యేక యాప్ రూపొందిస్తున్నామన్నారు. క్రీడాకారులు అంతా అందులో రిజిష్టర్ చేసుకోవాలి అని సూచించారు. ప్రతిభ ఉన్న ప్రతిఒక్క క్రీడాకారులను గుర్తించి వారిని అన్ని రకాలుగా ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయిలో రాణించే తీర్చిదిద్దటమే ప్రభుత్వం లక్ష్యం అన్నారు.

# పరిపూర్ణ పర్యావరణ వ్యవస్థకు ఆదర్శం కన్హాశాంతివనం



కేంద్ర ఆయుష్ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్

**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రశాంతత, పరిపూర్ణ పర్యావరణ వ్యవస్థకు కన్హాశాంతివనం ఆదర్శప్రాయంగా నిలిచిందని కేంద్ర ఆయుష్ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ అన్నారు. శనివారం నందిగామ మండలం కన్హాశాంతివనంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ట్రెడిషనల్ మెడిసిన్ (ఏఐఐఐఎంఎస్), ఇన్స్టిట్యూట్ ఆఫ్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేద) అనే సంస్థలను హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్స్టిట్యూట్ తీసుకువచ్చిన సందర్భంగా ఏర్పా టు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ మాట్లాడారు. ఆధునిక సాంప్రదా య ఆరోగ్య విధానాలను క్రమబద్ధమైన, శాస్త్రీయ పద్ధతిలో అనుసంధానించడం, సంపూర్ణ ఆధారాలతో కూడిక వ్యూహాల ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రణకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. శారీరక మానసిక, ఆధ్యాత్మిక కోణాలను పరిష్కరించే ఆరోగ్యం యొక్క సమగ్ర నమూనాలను ప్రోత్సహించేందుకు కృషి చేయడం జరుగుతుందని వివరించారు. ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఆయుర్వేద సూత్రాల ఆధారంగా చేపట్టిన ప్రకృతి పరిక్షన్ అభియాన్ ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంభించడంతో ఆరోగ్యకమైన సమాజాన్ని, ఆరోగ్యకమైన దేశాన్ని నిర్మించడంలో సహాయపడుతుందని వివరించారు.

# విద్యార్థి జీవితంలో ‘పట్టా’ గొప్ప మలుపు


‘సెంట్ ఫ్రాన్సిస్’ పట్టభద్రుల దినోత్సవంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పట్టభద్రుల దశ విద్యార్థి జీవితంలో గొప్ప మలుపు అని, దీర్ఘకాలికంగా పట్టుదలతో చేసిన అధ్యయనానికి ఇది అంకితమని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. హైదరాబాద్ బేగంపేటలోని సెంట్ ఫ్రాన్సిస్ మహిళా కాలేజీలో 45వ పట్టభద్రుల దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, గౌరవ అతిథిగా పూర్వ విద్యార్థిని గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ డైరెక్టర్ ఐపిఎస్ దీపాలి మసీర్కర్, ఒయు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.శశికాంత్, జిహెచ్‌ఎంసి సూపరింటెండెంట్ ఇంజినీర్ రామాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డిగ్రీ పట్టాలను వారు అందజేశారు. మొత్తం 58 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 981 మంది విద్యార్థులకు కళలు, కామర్స్, సైన్స్, మేనేజ్‌మెంట్ విభాగాల్లో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సభలో వెంకయ్య నాయుడు మాట్లాడుతూ యువత సాధించిన పురోగతికి దేశ భవిష్యత్తుకు అనువుగా కాగలదని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యకరమైన జీవితం గడుపుతూ ప్రకృతిని, తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. దీపాలి మసీర్కర్ మాట్లాడుతూ తాను ఇదే కాలేజీలలో చదివానని, 2005 బ్యాచ్‌కు చెందిన విద్యార్థినని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి తమ కలల సాధనకు ధైర్యంగా పోరాడాలని, నేర్చుకోవడం ఎప్పటికీ ఆపవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.ఉమా జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



























Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com